# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 12-1-2023 RNI No.52865/93·Postal No\.H/SD/258/2021-2023 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :29 సంచిక: 117 పేజీలు:6 వెల: రూ.1/-


**నమ్మలేని నిజాలు**

కర్తకర్మలు
స్వర్గనరకాలు
చీకటి తెర

జెండాల కాలం
జనం గుండెల్లో జెండా
కూలినవెన్నో

లావు సన్నగ
ఆహార వ్యవహారం
ప్రకృతి ధర్మం

చందమామలు
చుక్కల్లా బడుగులు
దేశం వెల్గులా!

దిగుడు బావి
తాగునీటి ఎద్దడి
కొత్తరోజులు

– రేడియమ్
సెల్: 9291527757

**శ్రీనిజాలు**

హింస ప్రచారమాపమని
హుకుం జారీ చానళ్లకు !
కేంద్ర సమాచార శాఖ
సీరియసైంది చాన్నాళ్లకు !

కాపాడుతు ఉంచండోయ్
వ్యక్తిగత గోప్యత !
భంగం కలిగించరాదు
సంస్కార సభ్యత !

– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

**వివేక గని**

దైవత్వ దీపపు వెలుగుల్లో..
ఆత్మవిశ్వాస అపూర్వ మనోనిధి
భారతీయ తత్వ మహావేదాంతి
వివేకమే ఆనందమన్న యోగి
మహోపన్యాసక నరేంద్రుడే సదా !

సంధికాలపు నిస్తేజ జాతికి..
దొరికిన కోహినూర్ వజ్రమతడు
భారత ఆధ్యాత్మిక చింతనను..
విశ్వవ్యాప్తం చేసిన ఘనుడతడు
వాక్పటిమతో ప్రేరణనిచ్చిన సన్యాసి !

విశ్వశాంతి కాముక వివేకుడు
విశ్వసౌభ్రాతృత్వ ప్రచారకుడు
యువతకే నిత్య మేలుకొలుపు
ఓటమి కన్న ఆడకపోవడమే..
అధమమన్న యువ దీపస్తంభం !

గొర్రె తోలును విదిల్చి సింహాల్లా..
ఘర్జించమన్న అమృత ప్రవచనుడు
వ్యక్తిత్వం, స్వశక్తులే సర్వస్వమని..
వివేక వాక్కులే గెలుపు తీరాలన్న..
విజయ రహస్య ప్రదాత
వివేకానందుడే !

– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

**లేవండి! మేల్కొనండి!**

విశ్వ చింతనను
వినూత్న దిశకు తిప్పిన
వివేకానందుని సందేశం
యువతను నిద్ర నుండి మేల్కొలిపే
ఆధ్యాత్మిక దివ్య ఆదేశం!
భారతీయ తత్వానికి అది ఓ కానుక
వాగ్దాటికి పరవశించింది అమెరికా
నమ్రత ఉన్నత లక్ష్యాల లక్ష్యం
ఉపనిషత్తుల తాత్విక తత్వం
తాత్విక శిక్షణ ఆగిన చోటే
ఆధ్యాత్మిక ప్రవచనాలు రక్షణ.
మందలో ఒకడిగా కాదు
వందలో ఒక్కడివిగా ఉండు
దేనికి బీతిల్లక ఉండు మన్నాడు
సంచరించు ఖడ్గ మృగంలా
వలలో చిక్కని వాయువు లా
కలంక మంటని పద్మము లా
ధ్వనులకు కంపించని సింహంలా
మంచికి నీడనిచ్చే మనిషి
వట వృక్షంలో జీవించమన్నాడు
లేవండి! మేల్కొనండి!
గమ్యం చేరేవరకు విశ్రమించకండి!
వివేకానందుని భావజాల ఉద్బోధలు
భరత జాతికి ఎప్పుడు జవసత్వాలు
(12, జనవరి వివేకానందుని జయంతి)

–పి.బక్కారెడ్డి
9705315250




**చరిత్రలో నేటినిజం**




( జనవరి 12 ఎల్లా ప్రగడ సుబ్బారావు జయంతి..)

–రాధశ్రీ
సెల్:9494481210

# అసమానతలు పెంచేలా కేంద్రం వైఖరి: ఎమ్మెల్సీ కడియం శ్రీహరి



హనుమకొండ, జనవరి 11: కేంద్ర ప్రభుత్వం రిజర్వేషన్లు ఎత్తివేసే కుట్ర చేస్తున్నదని ఎమ్మెల్సీ కడియం శ్రీహరి విమర్శించారు. ఎస్సీ, ఎస్టీలపై వివక్ష చూపుతున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ నేతృత్వంలోని కేంద్రం వైఖరి అసమానతలను పెంచేలా ఉన్నదని ఫైరయ్యారు. దళిత మేధావులు, ప్రజాస్వామ్య వాదులు అప్రమత్తమవ్వాలని సూచించారు. హనుకొండలో ఎంపీ పసునూరి దయాకర్, మాజీ ఎంపీ సీతారాం నాయక్‌తో కలిసి ఎమ్మెల్సీ కడియం శ్రీహరి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా.. కులమతాల మధ్య బీజేపీ చిచ్చుపెడుతున్నదని ఆరోపించారు. 1961 నుంచి 2021 వరకు ఎస్టీ, ఎస్సీ రిజర్వేషన్లను పెంచలేదని వెల్లడించారు.

ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. తెలంగాణలో అన్ని వర్గాల ప్రజలకు సీఎం కేసీఆర్ పెద్దపీట వేస్తున్నారని చెప్పారు. దేశంలో ఎక్కడాలేనివిధంగా రాష్ట్రంలో దళితబంధు, గిరిజన బంధు అమలుచేస్తున్నామని వెల్లడించారు. తెలంగాణ మోడల్‌గా దేశవ్యాప్తంగా దళిత, గిరిజన బంధు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 18న ఖమ్మంలో జరిగే బీఆర్ఎస్ భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

# ప్రజల అభీష్టం మేరకే మాస్టర్ ప్లాన్ : ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాల, జనవరి 11: జగిత్యాల పట్టణంలో ప్రజల అభీష్టం మేరకు మాస్టర్ ప్లాన్ అమలు చేస్తామని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ స్పష్టం చేశారు. అసత్య ప్రచారాలను నమ్మవద్దని ఆయన కోరారు. బుధవారం పట్టణంలోని 10వ వార్డ్‌లో గంగ పుత్ర సంఘ భవన నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం కారణంగా పట్టణ మాస్టర్ ప్లాన్ అస్తవ్యస్తంగా తయారయిందని ఆరోపించారు.

యావర్ రోడ్డు విస్తరణ ను గతంలో మంత్రులు గా ఉండి ఏమి చేయలేక పోయారని విమర్శించారు. నేడు నూతన నిర్మాణాలు వంద ఫీట్లలల్లో జరుగుతున్నాయని తెలిపారు.మాస్టర్ ప్లాన్ ప్రజల సౌకర్యార్థం కోసమేనని వెల్లడించారు. గంగ పుత్రులు అభివృద్ధికి ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారని అన్నారు.మిషన్ కాకతీయ వల్ల చెరువుల్లో జల కల సంతరించుకుందని అన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణం వల్ల వరద కాలువ జీవ నదిలా మారి నియోజకవర్గంలో భూగర్భ జలాలు పెరిగాయని పేర్కొన్నారు.దీంతో మత్స్య సంపద పెరిగి గంగ పుత్రుల కుటుంబాల్లో ఆనందం వ్యక్తమవుతుందని తెలిపారు.

# నేడు మహబూబాబాద్‌కు సీఎం కేసీఆర్

హైదరాబాద్, జనవరి 11:తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ రేపు మహబూబాబాద్ పర్యటనకు వెళ్లనున్నారు. రేపు ఉదయం 11గంటలకు హెలికాప్టర్ లో మహబూబాబాద్ చేరుకుంటారు. తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాల వేసి.., పార్టీ పతకాన్ని ఎగురవేసి, భారత రాష్ట్రసమితి జిల్లాపార్టీ కార్యాలయాన్ని సీఎం కేసీఆర్ ప్రారంభిస్తారు. బీఆర్ఎస్ జిల్లా పార్టీ అధ్యక్షురాలు, మహబూబాబాద్ ఎంపీ మాలోత్ కవితను ముఖ్యమంత్రి కేసీఆర్ స్వయంగా కలవనున్నారు. అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్ బస్సులో బయలుదేరి రోడ్డుమార్గం ద్వారా ప్రయాణం చేసి మహబూబాబాద్ పట్టణాన్ని చూస్తూ నూతన సమీకృత కలెక్టరేట్ భవనానికి చేరుకుంటారు. అయితే సీఎం పర్యటన ఏర్పాట్లను మంత్రులు ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతి రాథోడ్ లు పరిశీలించారు.

# కవిత్వంలో అభివ్యక్తి ముఖ్యం –డా.ఏనుగు నరసింహారెడ్డి

'సత్యవాక్కులు' గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న 'మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్ డా॥ ఏనుగు నరసింహారెడ్డి. వేదికపై డా॥ రాయారావు సూర్యప్రకాశ్, సత్యవీణ మొండ్రేటి, రాధశ్రీ తదితరులు.

కవిత్వంలో అభివ్యక్తి ముఖ్యమైందని ప్రముఖ కవి, విమర్శకులు, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి అన్నారు. దర్పణం సాహిత్య వేదిక వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ రాయారావు సూర్య ప్రకాశ్ రావు అధ్యక్షతన ఆదివారం హైదరాబాదులో ఘనంగా నిర్వహించిన సత్య వీణ మొండ్రేటి 'సత్యవాక్కులు' గ్రంథ ఆవిష్కరణ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, గ్రంథాన్ని ఆవిష్కరించారు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో దర్పణం సాహిత్య వేదిక ఈ కార్యక్రమాన్ని నిర్వహించింది. చెప్పే విధానం వినూత్నంగా ఉంటేనే కవిత్వం చిరస్థాయిగా నిలిచిపోతుందని డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి అభిప్రాయపడ్డారు. కవిత్వాన్ని రాసేవారు ప్రపంచ వ్యాప్తంగా వివిధ భాషల్లో వస్తున్న సాహిత్యాన్ని నిరంతర అధ్యయనం చేయాలని ఆయన సూచించారు. కొత్త ఆలోచనలతో కవిత్వాన్ని రాయాలని పేర్కొన్నారు. ఆధునిక కవిత్వంలోని వివిధ రూపాలను ప్రక్రియలుగా పేర్కొనడం సరైంది కాదని ఆయన అభిప్రాయపడ్డారు.

సమాజంలోని అసమానతలపై కవయిత్రులు దృష్టిపెట్టాలని విశిష్ట అతిథిగా హాజరైన పాఠశాల విద్యాశాఖ సంయుక్త సంచాలకులు పాలడుగు సరోజినీ దేవి అన్నారు. వివిధ సమస్యల పరిష్కారం దిశగా కవిత్వ రచన చేయాలని ఆమె పేర్కొన్నారు. దర్పణం సాహిత్య వేదిక కొత్త కవులను ప్రోత్సహిస్తోందని సభకు అధ్యక్షత వహించిన వేదిక అధ్యక్షులు డాక్టర్ రాయారావు సూర్య ప్రకాశ్ రావు చెప్పారు. కవితలకు మెరుగులు దిద్దుతూ, కవితల ప్రచురణకు మార్గదర్శకంగా ఉంటున్నట్టు ఆయన వివరించారు. ఉత్తర భారతదేశంలో చాలా కాలం ఉన్న తాను జీవితంలో పొందిన అనుభవాలనే కవిత్వీకరించినట్టు కవయిత్రి సత్యవీణ మొండ్రేటి చెప్పారు. తన అనుభవాలతో వివిధ కవిత్వ రూపాలలో సృజన చేయడంతో పాటు కథలను కూడా రాసినట్టు ఆమె వివరించారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక నుండి ప్రభవించిన దర్పణం సాహిత్య వేదిక కవులకు ప్రోత్సాహం అందించడంలో ఎప్పుడూ ముందుంటుందని దర్పణం సాహిత్య వేదిక ప్రధాన కార్యదర్శి డా. చీదెళ్ల సీతాలక్ష్మి అన్నారు.

'సత్యవాక్కులు' గ్రంథంలో వివిధ కవిత్వ రూపాలలో సత్య వీణ మొండ్రేటి రాయడం కొత్త ప్రయోగమని పుస్తక సమీక్షకులు డా. దీపక్ న్యాతి అన్నారు. కవయిత్రి వ్యక్తిత్వం ఆమె కవితల్లో ప్రతిబింబిస్తోందని సినీ గేయరచయిత సాదనాల వేంకట స్వామి నాయుడు అభిప్రాయపడ్డారు. ఆధునిక అంశాల్లో నూ పద్య రచన చేయవచ్చని ప్రముఖ కవి డా. రాధాశ్రీ అన్నారు. అక్షరంతో సాంగత్యం చేయడం అన్ని అనుభూతులనూ ఇస్తుందని ప్రముఖ కవి డా. గంటా మనోహర్ రెడ్డి చెప్పారు. వచన కవిత్వ ధోరణులను కవులు అవగతం చేసుకోవాలని ఎస్. బి. ఐ. రిటైర్డ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ కందూరు చంద్రప్రకాశ్ గుప్తా సూచించారు. సభలో సినీ సంగీత దర్శకులు గోపాల్ ఆచార్య, రోల్ మోడల్ జాతీయ పురస్కార గ్రహీత వెనిశెట్టి రవికుమార్, డా. సరోజ వింజామర, జాలిగామ నరసింహారావు, రాంబాబు, సత్యమూర్తి, గిర్రాజి దామోదర్, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు. దర్పణం సాహిత్య వేదిక ఉపాధ్యక్షులు రామకృష్ణ చంద్రమౌళి, కవయిత్రి రాధాకుసుమ నిర్వహణలో జరిగిన కవి సమ్మేళనంలో 35 మంది కవులు పాల్గొన్నారు. కవులందరినీ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ప్రముఖ కవి ముదిగొండ సంతోష్ సభకు స్వాగతం పలికారు. రచయిత నక్క హరికృష్ణ వందన సమర్పణతో కార్యక్రమం ముగిసింది.

# కళ సేవలు అపురూపం

**– కళ పత్రిక దశాబ్ది ఉత్సవాల్లో సినీ నటుడు అలీ**

నెల్లూరు అడ్డా రాజకీయ రంగం లోనే కాదు కళా రంగం లోనూ గొప్ప గడ్డ గా ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిందని ప్రముఖ సినీ హాస్య నటులు, రాష్ట్ర ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారులు అలీ అన్నారు. ఇక్కడ నుంచి ఎందరో మహానుభావులు ఆవిర్భావించారని, తనకు నెల్లూరు తో మంచి అనుబంధం ఉందన్నారు. ఆదివారం నెల్లూరు టౌన్ హాల్ లో ఆంధ్రప్రదేశ్ భాషా సృజనాత్మక సమితి, కళ, కలయిక ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో కళ 10వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా శ్రీ అలీ విచ్చేసి వేడుకలను లాంఛనంగా ప్రారంభించారు. సమాజ సేవకులు డాక్టర్ కొండూరు హరినారాయణ రెడ్డి ట్రస్ట్ లోగో ను ఆవిష్కరించారు. కొండూరు హరి నారాయణ రెడ్డి ని సింహపురి సేవా సార్వభౌమ బిరుదు తో ఘనంగా సత్కరించారు. కళ అంతర్జాతీయంగా విశేష సేవలు అందిస్తున్నదని, కళాకారులకు ప్రభు త్వానికి గొప్ప వారధిగా వ్యవహరిస్తున్నదని, కళ సేవలు అపురూపం అని అభినందించారు.

కళ పత్రిక సంపాదకులు డాక్టర్ మహ్మద్ రఫీ అధ్యక్షత వహించిన సభ లో కలయిక ఫౌండేషన్ చైర్మన్ శ్రీ చేరాల నారాయణ, వాకర్స్ జాతీయ అధ్యక్షులు శ్రీ నేతాజీ సుబ్బారెడ్డి, నెల్లూరు జిల్లా ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీ వాకాటి విజయ్ కుమార్, సీనియర్ పాత్రికేయులు జయ ప్రకాశ్, రోటరీ గవర్నర్ వొమ్మిన సతీష్ తదితరులు పాల్గొన్నారు.తొలుత ప్రముఖ నర్తకి శ్రీమతి రోహిణి కందాల వహించిన ఈ నాటకం లో గాన గంధర్వ ఘంటసాల వెంకటేశ్వరరావు గారి జీవిత చరిత్రను అద్భుతంగా ఆవిష్కరించారు. విజయనగరం

వారాల జీవితం నుంచి సినీ జైత్రయాత్ర, స్వాతంత్ర్య సమర యోధుడు గా ఆయన చూపిన తెగువ, పొట్టి శ్రీరాములు తోలేటి వెంకట రెడ్డి కనుమూసినప్పుడు ఘంటసాల నాయకత్వం వహించిన తీరు, ఎన్టీఆర్ తో కలసి వరద బాధితుల సహాయార్థం జోలె పట్టిన వైనం, లత మంగేష్కర్, లీల, జాషువా, గులాం అలీ తో వున్న అనుబంధం, ఆనాటి ముఖ్యమంత్రి కాసు బ్రహ్మానందరెడ్డి తో సన్మానం, భగవద్గీత రికార్డ్, స్వరపేటిక అల్సర్ తగ్గించుకునేందుకు చివరకు చిత్తూరు నాటు మందు తిని అనారోగ్యం తో చనిపోయేంత వరకు అన్ని దృశ్యాలు ఆద్యంతం ప్రేక్షకులను హత్తుకున్నాయి. ఘంటసాల పాత్రలో ఇంద్రకుమార్ జీవించారు. సురభి సంతోష్ తన బృందాన్ని నడిపిస్తున్న తీరు చూడముచ్చటగా వుంది. దర్శకుడు సత్య జగదీష్ అన్నీ తానై ప్రదర్శనలు ఏర్పాటు చేస్తూ కొత్త అధ్యాయానికి శ్రీకారం చుట్టి అభినందనలు అందుకున్నారు. శనివారం కావలి లో, ఆదివారం నెల్లూరు లో, సోమవారం ఒంగోలు లో ప్రదర్శించిన ఘంటసాల నాటకానికి ప్రేక్షకులు జేజేలు పలికారు.శ్రీ ఎల్.శేష గిరీశం, శ్రీ బి. కృష్ణ, శ్రీ పి. వై. బాబు కళ వేడుకలకు సమన్వయకర్తలుగా వ్యవహరించారు. కళ పత్రిక ను పదేళ్ల పాటు ఆదరించి ముందుకు నడిపిస్తున్న కళాకారులకు, శ్రేయోభిలాషులకు, ప్రకటన కర్తలకు డాక్టర్ మహ్మద్ రఫీ కృతజ్ఞతలు తెలిపారు.

# ప్రధాని మోదీ హైదరాబాద్ పర్యటన వాయిదా..

హైదరాబాద్, జనవరి 11:రాష్ట్రానికి వందే భారత్ రైలు రాక మరింత ఆలస్యం కానుంది. ఈ నెల 19న సికింద్రాబాద్ స్టేషన్‌లో ప్రధాని మోదీ.. రైలుకు పచ్చజెండా ఊపాల్సి ఉంది. అయితే ప్రధాని హైదరాబాద్ పర్యటన వాయిదా పడటంతో ఈ అత్యాధునిక రైలు ప్రారంభంపై సందిగ్ధత ఏర్పడినట్లయింది.

మోదీ హైదరాబాద్ పర్యటన వాయిదా పడినట్లు ప్రధానమంత్రి కార్యాలయం (పీఎంవో) కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి సమాచారం అందించింది. ప్రధాని పర్యటన మళ్లీ ఎప్పుడు ఉంటుందనే విషయాన్ని త్వరలోనే వెల్లడిస్తామని తెలిపింది. షెడ్యూల్ ప్రకారం ప్రధానమంత్రి మోదీ ఈ నెల 19న హైదరాబాద్‌కు రావాల్సి ఉంది. వందే భారత్ రైలుతోపాటు సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులను ప్రారంభించాల్సి ఉంది. అదేవిధంగా సికింద్రాబాద్–విజయవాడ మధ్య రైల్వే ఆధునీకరణ పనులకు శంఖుస్థాపన, కాజీపేట కోచ్ ఫ్యాక్టరీకి సంబంధించిన పనులను శ్రీకారం చుట్టాల్సి ఉంది. అయితే మోదీ పర్యటన అర్ధాంతరంగా రద్దువడానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు.

# అంబేద్కర్ చిరునవ్వు నవ్వాడు

–మహాకవి డా. కత్తి పద్మారావు
9849741695

మంచు తెరల్లో కొత్త ఏడు
పురుడు పోసుకుంది
ఇసుక పొరల్లో దాక్కున్న సూర్యుడు
భూమి నుండీ పుడుతున్నాడు.
ప్రపంచమంతా జ్ఞాన తరంగాలు
ఒక అంచు నుంచి మరో అంచుకు
నడుస్తున్న అనుభూతి
మనుషుల్లో సంతోషం వెల్లివిరియడం
ఒక సందడి
నిజమే!
ప్రపంచంలో హద్దులు చెరిగిపోతున్నాయి
మనిషి ప్రపంచాన్ని
సొంత ఊరుగా చూస్తున్నాడు
ఇది ఒక గొప్ప పరిణామం
కులమత భావనల నుండి
విశ్వజనీనమవుతున్నాడు
మెదడులో గూడు కట్టుకున్న
అనేక కంచెలు తెగిపోతున్నాయి
పాతదాన్ని పోనివ్వండి
నదికి ప్రవాహశీలతే స్వచ్ఛత.
మనిషి నిన్న నుండి నేడుకు
మళ్లీ పుడుతున్నాడు
తనని తాను పునర్జీవింప చేసుకుంటున్నాడు
పాత వస్త్రాలు ధరిస్తున్నాడు
పాత భావాల్ని వదిలేస్తున్నాడు
అభద్రతను జయిస్తున్నాడు
నూత్న నగరాలు వెలుస్తున్నాయి.
జీవితమంటే పునరుజ్జీవనం
మూలిగే వారిని మూలగనివ్వండి
మేం గోడలు పగలగొట్టడం
సరిహద్దుల్ని చెరిపివేయడం
చర్యగా ముందుకెళ్తాం
యువత తమని
తాము గుర్తిస్తున్నారు
ప్రతిభకు పదును పెడుతున్నారు
సూర్యుడు ఎక్కడో లేడు
తనలోనే ఉన్నాడని తెలుసుకున్నారు
ప్రపంచమంతా మంచు ముత్యాలతో
అలంకరించబడుతుంది
ఉన్ని, తోలుకోట్లలో
తమ రక్షక శక్తిని చాటుకుంటున్నాయి
సముద్రాలపై నగరాలు నిర్మిస్తున్నారు
బుల్లెట్ ట్రైన్‌లో
సెకన్లు లెక్కిస్తున్నారు
శ్రమ యువతకు కిరీటమయ్యింది
మహిళ తన పరుగును పెంచింది
తానే సహచరుడిని ఎన్నుకుంటుంది
పరిణామం వేగవంతమైంది
యువశక్తి పర్వతాల
శిఖరాల్లో పతాకాల ఎగరేస్తున్నారు
నాట్లేసిన ఆమె కొడుకే
పచ్చ సంతకం చేస్తున్నాడు
కొండ చరియల్లో జీవించిన ఆమె
అత్యున్నత పీఠంపై
నల్ల కలువ అయ్యింది
అధికులుగా చెప్పబడుతున్నవారు
అర్భకులవుతున్నారు
తోసి వేయబడ్డవారు
మొదటి వరుసలో ఉంటున్నారు.
అక్షరాల పూల తోటలు
గుభాళిస్తున్నాయి.
అంకెలుతారు మారై
మళ్లీ సున్నాదే ఆధిపత్యం
మనుషులు అంతరాలను అధిగమించి
మనుషుల్ని ప్రేమించడం
ఒక మార్పు
అంబేద్కర్ చిరునవ్వు నవ్వాడు
ఈ శకం నాది అని ప్రకటించాడు
ఎందరో తలవంచారు
ఎందరో తల ఎత్తారు
అతడికి ఆ రోజు
అక్షరాలని దూరం చేశారు
ఇప్పుడు అతడు
అక్షర నక్షత్రాల వెల్లువయ్యాడు
ఆమెను ఆరోజు
చీకటి గుహల్లో ఉంచారు
ఇప్పుడు ఆమె
వెలుగు సముద్రాల
ఈతలో ముందుంది
అప్పుడు వారిని
గొర్రెలే కాయమన్నారు
ఇప్పుడు ఆ సూర్య కుమారుడు
ఆట స్థలంలో అష్టదిక్కులు చూపిస్తున్నాడు
అప్పుడు అతను కాందిశీకుడుగా
నడిచి వచ్చాడు
ఇప్పుడు అతను నటనా రంగానికి
పాదుషా అయ్యాడు
అప్పుడు ఆమెను
ముళ్లకంచెల్లోకి తోసారు
ఇప్పుడు ఆమె నాగిని నృత్యంలో
మణిపూస అయింది
అప్పుడు అతన్ని
చావుడప్పే కొట్టమన్నారు
ఇప్పుడు అతను సంగీత ప్రపంచానికి
సామ్రాట్ అయ్యాడు
మీరు అగాధాలలలోకి
తోసిన ప్రతి బొగ్గు కణం
ఇప్పుడు ఆకాశంలో
పాలపుంత
సహస్రాలు నిర్మిస్తుంది.
ఇది పిడికిళ్ల సవ్వడి యుగం
పోరాడే వారే విజేతలు.

**కణిక**

సాహిత్యం, సామాజిక సేవ, విద్యారంగ వేదిక నిర్వహిస్తున్న
(నేటినిజం ప్రతినిధి)

## 'బుధవారం బాద్షా'

పోటీ ఫలితాలు

అడ్మిన్: రమాదేవి కులకర్ణి

(ప్రథమ)

నిర్వహణ: శ్రీమతి సత్య నీలిమ వలిపే
ఈ సమూహంలో చేరదలచినవారు 89856131235కి మెసేజ్ చేయవచ్చు.

### చావుకు దగ్గరలో

సృష్టి విరచిత మెంతో విజ్ఞానమయం
రాతియుగం నుండి నేడు రాకెట్ దాకా.
విజ్ఞాననీ కొత్త పుంతలు తొక్కుతోంది
కాని నేడు విషక్షణ లోపించి మానవుని
మూర్ఖత్వం పలువింత పోకడల ఫలమే.
కలుషిత వాతావరణం అనుకూల స్థితి
కోల్పోయి నట్టి మానసిక దౌర్బల్యమే
దురాశ శాకోప శాకలై దుఃఖనీ మిగిలింది.
ప్రకృతి తనాకృతి రూపురేకలు మార్చుకునీ
విరుద్ధంగా వికటిస్తుంది అది తెలియకనే
మానవ మేధస్సు అదేదిశకు పయనిస్తుంది.
వినూత్న మార్గం ప్రకృతి విలయతాండవ
జాడలో అతివృష్టి అనావృష్టి సునామిలో
మునిగిపోతు అనారోగ్యాలతో
అకాల మృత్యువాతలు పడుతున్న గ్రహించక.
విపరీత ధోరణుల
సనీకుచిత నీడలో
బుసకొట్టే కాలనాగులా
పొంచి యున్న
ప్రమాదం అంచున
ఎరుగక నిల్చిఅదే
ప్రగతంటు
నిశ్చింత గున్నాడు నరుడు.
తానెక్కిన కొమ్మ తానే నరుక్కుని
మరణమృదంగపు
వాయించుకున్నట్టు
ఇకనైన కల్లు తెరవండి
తగుజాగ్రత్త పరులై
మంచి మనుషులుగా
మారండి ఎదగండి.

–విజయ కుమారి
9100634635

### అగాధపు అంచున

బ్రహ్మ చేసిన బొమ్మకు
అమ్మ ప్రాణం పోస్తే
ఏ నిముషానికి
ఏమి జరుగునో యన్నట్లు
మనిషి ఏ క్షణాన
ఏ అగాధపు అంచున
ప్రమాదపు సంద్రానలో
కొన ఊపిరితో....
కొట్టుమిట్టులాడుతాడో!!
పుట్టుక నుండి గిట్టేవరకు
ప్రమాదాల గిరులుదాటి
విజయ శిఖరాలు అధిరోహించినా
ఏ నిమిషానికి ఏమి జరుగునో
అన్నట్లు
అడుగడుగున క్షణ క్షణం
మృత్యువు కోరలుచాస్తూ
భయపెడుతూనే ఉంటుంది!!
పేగు బంధం లేకున్నా
ప్రేమ బంధాలు కొన్ని
అనుకోని విధంగా
విధిలా కాపాడుటకు
చెలిమి రూపంలో
చేయూతనిచ్చి
ప్రమాద ఊబినుండి
పైకి లాగుతూనే
ఊతమై ఊపిరి పోస్తాడు!!
ప్రమాద ఘటిలో
రక్తపు యేరులై
ప్రాణాపాయ స్థితిలో
పడివున్న అచేతనానికి
రక్తదానం చేసి
రక్త బంధం కాకున్న
రాగబంధంతో బ్రతికించే...
ప్రాణదాతలెందరో
ప్రమాదపు అంచునుండి
రక్షిస్తూనే ఉన్నారు కదా!!

–మద్దెల సరోజన

నేటినిజం
# సాహితీ కెరటాలు
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 12-1-2023

## నీవు సల్లగుండాలె

(వచన కథా కావ్యం-2)



తెలివెన్నెల

ఆకాశమంతా వెలితి లేకుండా పరుచుకున్నట్లు
కనుచూపు మేరంతా
భూదేవి పచ్చని పైరు చీరను అలంకరించుకున్నట్లు
నీలి సముద్రం
ఖాళీలేకుండా కన్నుల నిండా
ఒలికి పోతున్నట్లు పసిబిడ్డ
ఆమెలోని అణువణువూ నిండిపోయింది
మేని వీణలోని హృదయ తంత్రులను
సుతిమెత్తగా మీటుతూ
మౌన రాగాలను ఆలపిస్తున్నది !
గతానికి, వర్తమానానికి
రాగాల పూల వంతెనలా మారి
గుండె ఊయలను ఊపుతున్నది !
తనను ఈలోకంలోకి
తీసుకొచ్చిన తల్లికి
అయాచిత వరంలో ఒక కొత్తలోకాన్ని
అపురూపమైన కానుకలా ఇచ్చి చిరునవ్వుల
పువ్వుల బొకే ను అందిస్తున్నది !
'ఎవరు తల్లీ నీవు ?' అని
మురిపెంగా అడిగిన తల్లితో
'నీ తల్లినే! ' అని తడుముకోకుండా చెప్పి,
ముసి ముసి నవ్వులను దాచుకుంటూ ఎదగదిలో
ఒదిగిపోయింది !
'నా బిడ్డా! ఈ జన్మకదిచాలు!' అంటూ
బిడ్డను గట్టిగా హత్తుకొన బోయి
ఒక్క సారి ఉలిక్కి పడ్డది తల్లి !!
కలల అలల్లో ఓలలాడుతున్న ఆతల్లికి పొత్తిళ్ళలో
తన పేగు స్పర్శ లేదు !
కలలు, కలతనిద్రా కకావికలమైపోయింది !
'నా బిడ్డ ! ' అంటూ ప్రపంచమంతా వినిపించేలా
గట్టిగా అరిచింది.
ఆమె అరిచాననుకుందికాని,
అది సన్నని మూలుగులా మాత్రమే
లోకానికి వినిపించింది !
ఒడ్డున పడ్డ చేప పిల్లలా
గిలగిలా కొట్టుకుంటున్న ఆ తల్లికి
చల్లని అభయహస్తం ఆదెరువై తల నిమిరింది !

'ఏంది బిడ్డా !
నీ బిడ్డకోసం జూస్తున్నవా?' అంటూ
ఒక ప్రేమపూర్వకమైన నవ్వుతో.
సేద దీర్చింది...
జవాబు తల్లి పెదాలను దాటక ముందే.
'నీ బిడ్డకేం బయం లేదు !!
నర్సమ్మ కొంచవొయ్యింది.
డాగుటరు దగ్గర మందేపిచ్చుక రానీకె'
అని అభయ హస్త మిచ్చింది
ఆమె ఆతల్లికి మేనత్త
ఆపత్కాలంలో ఒంటరితనాన్ని తరిమేందుకు
వాత్సల్యం ఆయుధాన్ని వెంట తెచ్చుకున్న
అత్తలోని అమ్మ అత్తమ్మ.
ఆ చేతిలోని ఆత్మీయ స్పర్శ
లోపల ఎగిసి పడుతున్న
ఆటుపోట్లను శాంతపరిచింది
నమ్మకమనే చల్లని చూపు
వారిరువురినీ ఒక్కటి చేస్తుండగా
ప్రశాంతంగా కనురెప్పలు మూసుకుంది.
అంతసేపూ కనుపాపలతో పోరాడుతున్న
అనుమానపు అశ్రుబిందువులు
మేమిక ఉండలేమంటూ
కనుల కొలను నుండి కప్పల్లా
బయటికి దూకేసినయ్ !
ఆమె చేయిని తన గుండెలకు ఆనించుకొని
తృప్తిగా అనుకున్నది ఆతల్లి
అత్తమ్మా!
'నీవు సల్లంగుండాలి ! 'అని .

-దోరవేటి
సెల్:9866251679

## అరితేరిన ఆటగాడు

జీవితం ఆటలో అరితేరిన ఆటగాడివి ఐతే
సవాళ్ళను ధైర్యంగా ఎదుర్కోవటమే
ఓడినా పట్టుదల పెరుగుతుంది
మనసులో భయాన్ని వదిలి
మృత్యువుతోకూడా పోరాడుతావు
జీవితంలో పరిస్థితులన్నీ ఒక్కో పాఠం నేర్పేందుకే!
నీ బలహీనతల్ని చెరిపేసి వీరుడిగా నిలబెట్టేందుకే
నిద్రపోతున్న నీ ప్రత్యేకతలన్నీ మేలుకునేందుకే!
అవి నిన్ను గెలిపించి ఆనందానుభవాన్నిస్తాయి
ఆటంకాలతో పోరాడితేనేగదా
సహనం వికసించేది
నీ ఆత్మవిశ్వాసమే విజయసాధనమయ్యేది
అప్పుడు నీ కోసం..నీవారందరికోసం
జీవనపథం మరింత సులభం
ప్రపంచానికి మిగిల్చి వెళ్తావు
నీదైన శాశ్వత సంతకం!

హిందీ మూలం:
ముఖేష్ కుమార్ మోడీ,బికనీర్

తెలుగు అనువాదం:
-డా.సి.భవానీదేవి
9866847000

## వట వృక్షాలు !

చట్టం ఎవరికి చుట్టం కాదని
మైనర్లు డ్రైవింగ్ చేస్తే తల్లిదండ్రులను
నేరస్థులుగా కౌన్సిలింగ్ చేస్తున్నపుడు ...
విద్యార్థులుచేసే చిల్లర చిలిపి పొరపాట్లను
గాడిలో పెట్టాలని ప్రయత్నించే టీచర్లను
బాధ్యులు చేస్తున్నప్పుడు ... మరి ,
అదుపాజ్ఞలులేని మైనర్లు అత్యాచారంచేస్తే
అధికారంతో రక్షించే తల్లిదండ్రులను సైతం
నేరస్థులుగా ముద్రించి శిక్షించే చట్టంతో
అందరాలోచించి కట్టడి చేయాల్సిందే !
చెడు తిరుగుళ్ళకు ముగుదాడు పడేలా
నేరనియంత్రణ పగ్గాలు చేతబట్టాల్సిందే !

ఒకవైపు ...
గ్రామాల్లో చదివే పిల్లలకు మధ్యాహ్న
భోజన పథకంలో కనీసం ఎగ్స్ దిక్కులేవు !
పట్టణాలలో ఏ వీధి పిల్లలను చూసినా
విచ్చలవిడిగా అన్ని దిక్కుల్లో డ్రగ్సే !
విగ్స్ పెట్టుకుంటూ అసహ్యంగా ఉండే
పిగ్స్ మొఖాలతో ఖరీదైన పెగ్స్ కొడుతూ
విశృంఖల విన్యాసాలతో హగ్సే అంతట !
డబ్బులతో పబ్బుల్లో 'షీ' లతో జల్సాలుచేస్తూ
దొరికినోనికి దొరికినన్ని లెగ్సే అంతట !
విచ్చలవిడితనమే సోషల్ స్టేటసైతే
ఇక వెతికినా కనబడదు ఫ్యూచర్లో సక్సెస్ !
ఆఖరకు వారసత్వ ఆస్థులనమ్ముకొంటూ
ఫ్యాషన్ గా బ్రతకడమే ఆధునికతనుకొని
సమాజ నాగరిక నిర్మాణ విధ్వంసకులై
చరిత్రపుటలను చెదలు పట్టిస్తారు !

మరోవైపు ...
ఎక్కడలేనన్ని విలాస సౌకర్యాలతో
అభివృద్ధిపథంలో ఆకాశ హార్మ్యాలు
మరోవైపు ప్రకృతి మానస పుత్రికలైన
గిరిజన ఆదివాసీ అక్కచెల్లెళ్ళకు
నవారా మంచాలపై మైళ్ళ దూరం
పురిటి నొప్పులతో కాలినడకలు ,
ఎడ్లబండ్లు , ఆటోలు , ఆర్టిసి బస్సులే
వారి ప్రాణాలనాధరించే అంబులెన్సులు
కాన్పులకు కాదేదీ అనర్హం అన్నట్లు
నేటికీ చీరలడ్డంపెట్టి చేసేవే ICU లు !

అత్యున్నత చదువులతో పెద్దపెద్ద
హోదాల్లో ఉద్యోగాలెగబెట్టే
బడాబడా అధికారుల ప్రాణాలకు ,
రాజకీయ రాబంధులకు , విఐపి లకు
డబ్బున్నవాళ్ళకు సకల సౌకర్యాలతో ,
ఉచిత వసతుల సర్వమర్యాదల
హంగామాలతో అవయవ మార్పిడులు !

అడవుల్లోని పూరి గుడిసెల్లో , కోయ ,
గోండు గూడాల్లో, గిరిజన తండాల్లో ,
చెంచు పెంటల్లో , మన్నెం కొండల్లో
విష జ్వరాలతో గుండెలవిసిపోయే
మరణాలు మృదంగ విళయ తాండవాలు !
నా ఆదివాసి అక్కా చెల్లెళ్ళకు అన్నీ కరువాయె
నా అన్నాదమ్ములను ఆదుకునేవాడే లేడాయె !
ఇదేకదా మనం చేస్తున్న నాగరికాభివృద్ధి ?
ఇదేనా మానవత్వం మంటగలిపే హైటెక్ తీరు!

అందుకే ,
రాజ్యాంగంలో హక్కులే కాదు విధులున్నాయని
మరచిపోయి , వ్యవస్థ లొసుగుల్ని వేలం వేస్తూ
అధికార పీఠాలెక్కి అరాచకం చేస్తున్నారు .
ఏదేమైనా ,
మనల్ని నడిపించే రాజ్యాంగ నావకు
లెక్కలేనన్ని రిపేర్లు ,అనుకున్న వాటికన్నా
ఎక్కువ సవరణలు అవసరమనిచెప్పే
ఆచరణలేని పరిస్థితుల వివరణలతో
అందరి మెదళ్ళను పదును చేస్తున్నాయి.
ఏదోఒక రోజు అందరినీ కలిపి పాతర వేసి
ఊరూరా రాజ్యాంగ జనజాతర అవుతుంది !
రాజ్యాంగ నాగరిక అక్షరచెట్లు నాటుకున్నవి
ఏదో ఒకరోజు మానవ హక్కులు వటవృక్షాలై
అన్యాయాలను ,అరాచకాలను , అవినీతిని
అనెస్తీషియా లేకుండా నడి
బజారులో నిలబెట్టి
రంపాలతో ఊచకోతకోస్తాయి !

- డా. డి. రాజేశ్
9440460490

దివంగత సాహితీవేత్త నిజాం వెంకటేశం గారికి

అలిశెట్టి ప్రభాకర్ రాష్ట్రస్థాయి
సాహిత్య పురస్కారం-2023
ప్రదానం



: పురస్కార ప్రదానోత్సవ సభ :

తేది : 12-01-2023 గురువారం సా॥ 6.00 గంటలకు
వేదిక : ఫిలిమ్ భవన్, కరీంనగర్.

సభాధ్యక్షులు : కందుకూరి అంజయ్య, అధ్యక్షులు, తెరవే - కరీంనగర్
ముఖ్య అతిథి : కవి యాకూబ్, ప్రముఖ కవి, విమర్శకులు
విశిష్ట అతిథులు : జి.వి.శ్యామ్‌ప్రసాద్‌లాల్, అదనపు పాలనాధికారి, కరీంనగర్.
నారదాసు లక్ష్మణ రావు, మాజీ శాసనమండలి సభ్యులు & పురస్కార ప్రదాత, కరీంనగర్.
గౌరవ అతిథులు : గాజోజు నాగభూషణం, రాష్ట్ర అధ్యక్షులు, తెరవే
కొండి మల్లారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తెరవే
ఆత్మీయ అతిథి : అలిశెట్టి సంగ్రామ్, S/o. అలిశెట్టి ప్రభాకర్
కవి పరిచయం : అన్నవరం దేవేందర్, ప్రముఖ కవి
కార్యదర్శి నివేదిక : సి.వి.కుమార్, ప్రధాన కార్యదర్శి, తెరవే, కరీంనగర్.
సమన్వయం : డా॥ వాసాల వరప్రసాద్ & దామరకుంట శంకరయ్య

మెరుగు ప్రవీణ్
ప్రచార కార్యదర్శి
9989715531

తెలంగాణ రచయితల వేదిక, కరీంనగర్ జిల్లా

## ఆరని అక్షర జ్వాల అలిశెట్టి కవిత్వం

### వేశ్య

తను శవమై...
ఒకరికి వశమై..
తనువు పుండై..
ఒకడికి పండై..
ఎప్పుడూ ఎడారై..
ఎందరికో ఒయాసిస్సై..

సాధారణ పాఠకుడిపై సైతం కవిగా తనదైన విశేష ముద్రను వేసిన అలిశెట్టి ప్రభాకర్ కళా జీవితం చిత్రకారుడిగానే మొదలైంది. వరుసకు సోదరుడైన అలిశెట్టి మహారాజు చిత్రకళపై ప్రభాకర్ కు ఉన్న ఆసక్తి పరిశీలనలను గమనించి 'గీత' రహస్యాల్ని వివరించేవారు. అలా అబ్బిన కళతో ఇంటర్మీడియట్ చదివే రోజుల్లోనే ప్రభాకర్ పెన్సిల్ తో సినీ నటుల బొమ్మల్ని అచ్చుగుద్దినట్లు వేసేవాడు. అప్పుడాయన ఊర్లో అందరికి ఆర్టిస్ట్ ప్రభాకరే.

నేను, ఇతర సమీప సాహితీ మిత్రులతో కలిసి జగిత్యాలలో సాహితీ మిత్ర దీప్తి ని ఏర్పాటు చేసి 1975-77 ల మధ్య రచనల పోటీలు నిర్వహిస్తున్న కాలమది. ధరన్, గుండేటి గంగాధర్, రఘువర్మ దాని ప్రధాన సహసారథులు. అచ్చెరువొందే ప్రభాకర్ బొమ్మలు చూసి ఆయనతో మేము ఏర్పరచుకున్న పరిచయం పెరిగి, సన్నిహితమై, సాహిత్య ప్రవేశమై ఆయన్ని గీతల నుంచి రాతల వైపు తిప్పింది. ఇక మిగితాదంతా ఆయన సంకల్పంతో, సాధనతో, దీక్షతో తపోఫలం లా సృష్టించుకున్న సొంత కవితా సామ్రాజ్యం.

పట్టుదల, మొండితనం, సాహసం ప్రభాకర్ లోని రాజీ పడని తత్వాలు. అంచనా వేసి అడుగు వేశాడంటే వెనక్కి తగ్గేదే లేదు. గట్టిగా అనుకున్నాడంటే దాని సాధన కోసం అన్నిటికి సిద్ధపడ్తాడు. లోకానికి భిన్నంగా ఉండే ఈ లక్షణాలే కవిగా ఆయన విజయాలకైనా, వ్యక్తిగా అనుభవించిన కష్టాలకైనా కారణభూతంగా నిలుస్తాయి.

విజయాల విషయానికొస్తే ఆయన మంచి మిత్రుడిగా, నమ్మికకు నిబద్ధుడిగా, శ్రామిక పక్షపాతిగా, బహుజనవర్గ ప్రతినిధిగా తెలుగు కవిత్వంపై గాఢమైన తన ముద్రను మిగిల్చాడు. అయితే అభిరుచిగా , ప్రవృత్తిగా ఉండాల్సిన కవిత్వం, చిత్రలేఖనాలనే సర్వస్వంగా నమ్మి వాటి కోసం ఆరోగ్యాన్ని, ఆస్తిని పణంగా పెట్టి కుటుంబాన్ని ఏకాకి చేసి నడి ఈడులో బతుకులోంచే నిష్క్రమించడం విలువలతో కూడిన మహా విషాదం. ప్రభాకర్ కవిత్వమంటే ఆయనొక్కడిదే కాదు, ఆయన రాసిన ప్రతి అక్షరం వెనుక ఆయన భార్య, ఇద్దరు పిల్లల బతికి చెడ్డ నిస్పృహలు, వేదనలు కూడా ఉంటాయి. కవిత్వం కోసం కుటుంబ సభ్యులను ఇంతగా వేధింపుకు గురి చేసిన కవి మరొకరు కానరారు. చివరి రోజుల్లో 'భాగ్యలక్ష్మి' కి 'సిగరెట్ పీకలాంటి నన్ను/ నిగలో పువ్వుల తురుముకొని/ గాజుకుప్పెల్లాంటి నా కళ్ళలోనే/ ఆశల అగరొత్తులు వెలిగించుకుందే తప్ప/ తులతూగే ఐశ్వర్యమో/ తులం బంగారమో కావాలని/ ఏనాడూ ప్రాధేయపడలేదు' అని కితాబు ఇయ్యగలిగాడు. అయితే పిల్లలు పెరిగి ప్రయోజకులైన ఆయన కుటుంబం ఇప్పుడిప్పుడే కొంత సేద తీరుతోంది.

ప్రభాకర్ కవిత్వాన్ని చదివే నేటి తరం బహుశా అనుకుంటున్నట్లు రాయడం మొదలు పెట్టగానే ఆయనకు కవిగా గుర్తింపు లభించలేదు. ఆ రోజుల్లో పత్రికలు కవిత్వాన్ని ఇప్పటిలా ప్రత్యేక పేజీలతో అధిక సంఖ్యలో ప్రచురించేవి కావు. సాహిత్య పుటల్లో, వార పత్రికల్లో సైతం ఒకటి, రెండు కవితలు అప్పుటికే కవిగా గుర్తింపు పొందినవారివి మాత్రమే వచ్చేవి. ఆ రోజుల్లో తెలంగాణ కవులంటే సినారే, దాశరథి గార్లే. ఆబ్కారీ సూర్యప్రకాష్, రామా చంద్రమౌళి లాంటి కొందరు పత్రికలో కనబడే ఆనాటి యువకవులు. అలాంటివారి మధ్య చోటు పొందడానికి అలిశెట్టి ఓ యుద్ధమే చేశాడనవచ్చు. సుమారు రెండేళ్ల పాటు ఆపని దండయాత్రలా పత్రికలకు తన రచనలు పంపుతూనే ఉన్నాడు. 1975 లో తొలిసారిగా ఆయన రాసిన ఆరు వరుసల మినీ కవిత ఓ వారపత్రికలో వచ్చింది. ఆ రోజుల్లో అది ఓ ఘనకార్యమే. ఆనాటి నుంచి ప్రతి పత్రికలోనూ ఆయన మినీ కవితలు అచ్చయి 'అలిశెట్టి ప్రభాకర్' తెలుగు కవిగా గుర్తింపు సాధించాడు. ఆంధ్రజ్యోతి వారపత్రికల్లో వచ్చిన 'వేశ్య' కవిత ప్రభాకర్ ను కవుల సరసన నిలబెట్టి ప్రత్యేక స్థానాన్ని అందించింది. కవి శివారెడ్డి ముందుమాటలో ప్రభాకర్ తొలి సంకలనం 'ఎర్రపావురాలు' 1977 లో వచ్చింది.

జగిత్యాల ఉద్యమ స్ఫూర్తి ఆయనలో కొత్త భావజాలాన్ని నింపింది. తన చుట్టూ గ్రామాల్లో జరుగుతున్న 'సంఘం' కార్యకలాపాలు ఆయన కవిత్వంలో భాగమయ్యాయి. ఆ ప్రభావంతో దొరను ఉద్దేశించి 'నువ్వు/ ఉరిమి చూసినప్పుడేమో/ ఊరంతా పాలేర్లే/ వాళ్లే/ ఊరినుంచి తరిమికొడితే/ నీ బ్రతుకంతా పల్లెర్లే ' అని రాశాడు. 'చరిత్రకు రక్తపా తమే ఉపోద్ఘాతం/ చరిత్రకు చెమటబొట్టే ఆధారం/ చరిత్రకు ఆకలే ప్రేరణ' అని గళమెత్తాడు. నిర్బంధపు తుపాకీ మోత మీద జగిత్యాల ఉన్న రోజుల్లో సైతం 'కొమ్మ ఉండీ ఊగని/ కొలిముండీ మండని/ జీవితలెందుకని' తెగువతో ప్రశ్నించాడు. 'పీడితుల పక్షాన నిలిచి పోరుతున్న క్రమంలో నిస్సంకోచంగా నా కలమూ కుంచె రెండూ ఉంటాయ్' అని ప్రకటించాడు. అన్నట్లుగానే ప్రభాకర్ కవిత్వం భాష, శైలి, వ్యక్తీకరణలో నిగ్గుదేలుతూ శ్రామిక, యువక, మహిళల అంశాలే కేంద్రీకృతమై సాగింది. రాజకీయం పేరిట ప్రభాకర్ రాసిన కవిత 'ఒక నక్క/ ప్రమాణస్వీకారం చేసిందట/ ఇంకెవర్ని మోసగించనని/ ఒక పులి/ పశ్చాతాపం ప్రకటించింది/ తోటి జంతువులను సంహరించినం దుకు/ ఈ కట్టుకథ విని/ గొఱ్ఱెలింకా / పుర్రెలూపుతూనే ఉన్నాయ్' అనేది ప్రతి ఎన్నికల సమయంలో పత్రికలు గుర్తు చేస్తుంటాయి.

కవితా చిత్రాల ఆలోచన రాగానే డ్రాయింగ్ షీట్లపై ఎంపిక చేసుకున్న తన కవితలకు ఇండియన్ ఇంకుతో చిత్రాలు వేసి వాటి ప్రదర్శనను ఏర్పాటు చేశాడు. 1984 లో రక్త రేఖ సంపుటిని కొన్ని చిత్రాలు కలిపి తెచ్చాడు. అప్పటికి దేశ కాల, రాజకీయ పరిస్థితులపై పారదర్శక అవగాహన రావడంతో ఆయన కలాన్ని సమకాలీన పాలనపై ఎక్కుపెట్టాడు. 'స్వయంగా శవాలే/ రాబందుల వద్దకి నడిచొస్తుంటే/ అంతకంతకూ పెరుగుతున్న అజ్ఞాన పర్వతం/ చిన్న బ్యాలెట్ పెట్టెలో ఇమిడి పోతే/ మళ్లీ కోటీశ్వరుడే పుట్టలోంచి/ బుస కొట్టేదే ఈ దేశపు ప్రజాస్వామ్యం' అనే నిర్వచించాడు.

కవిత్వం దేదీప్యమానమవుతుంటే దానికి విలోమ దిశగా ఆర్థిక పరిస్థితులు దిగజారుతున్నాయి. గొలుసుకట్టుగా సిగరెట్లు తాగడం వల్ల ఊపిరితిత్తులకు క్షయ సోకింది. ఇన్ని ఇక్కట్లలోనూ ఆయన వెనక్కి పోవాలనుకోలేదు. కవిత్వం మరింత రాటుదేలుతూ కొనసాగుతూనే ఉంటే కుటుంబ, అనారోగ్య ఖర్చులను తట్టుకునేందుకు కరీంనగర్ మరియు జగిత్యాలలో ఉన్న ఇళ్లను అమ్మక తప్పలేదు. కొంత అశ్రద్ధ, మరింత పౌష్టిక ఆహార లేమి వల్ల క్షయ ఆయనపై పూర్తి పట్టును సాధించింది. ఇక బ్రతికే అవకాశం లేదని నిశ్చయించుకున్న ప్రభాకర్ జులై 1992 లో సిటీ లైఫ్ లో కొన్ని ఖండికలను ఎంపిక చేసి పుస్తకంగా తెచ్చాడు. ఆరు నెలల తర్వాత 39 వ ఏట పుట్టిన 12 వ జనవరి రోజునే 1993 లో అకాల మరణం చెందాడు. బి ఎస్ రాములు నేతృత్వంలో జగిత్యాలలో మిత్రులు జరిపిన అలిశెట్టి సంస్మరణ కలయిక ఓ బహిరంగ సభలా జరిగింది.

ప్రభాకర్ కవిత్వాన్ని చదివినవారెవరైనా ఆయన జీవితకాలం మరింత కొనసాగితే తెలుగు ఎంత బాగుండేది అని బెంగపడతారు. ఆయన రాసిన ప్రతి కవిత సమాజాన్ని పడకట్టినట్లు, మనిషి స్వార్థాన్ని నిలదీసినట్లు, రాజకీయాల్ని చెండాడి నట్లుంటాయి. అన్నీ తెలిసిన పదాలే, అందరికి అర్థమయ్యే రీతిలోనే ఉన్నా అనితర సాధ్య శైలి, ప్రకటన తాజాతనాన్ని ఇచ్చాయి. సామాన్య పాఠకుడు సైతం వాటికి అతుక్కుపోయే సరళత, సూటిదనం ప్రభాకర్ ను అజరామర కవిని చేశాయి.

1983 జూన్ 10న చిత్రలేఖ స్టూడియో ముందు
బైస దేవదాస, అలిశెట్టి ప్రభాకర్, అలిశెట్టి పెద్ద కుమారుడు
సంగ్రామ్‌లను కెమెరాలో బంధించిన ప్రముఖ చిత్రకారుడు చంద్ర

### పోరాటం

పురుషాహంకార సముద్రం మధ్యన
చిక్కి
తల్లడిల్లితే ఒక రమణీయ ద్వీపం
వరకట్న దురాచారపు అంధకారంతో
పోరేందుకు
సమాయత్తమైందొక చిరుదీపం

ప్రభాకర్ భౌతికంగా దూరమైనా పాఠకులకు ఆ స్పృహనే కలుగకుండా ఆయన కవిత్వం ద్వారా అందరి వెంట ఉంటున్నట్లే ఉంటుంది. తక్కువ పదాల్లో దట్టించి చెప్పిన ఆయన కవితలు ఉదహరింపులకు చాల అనువుగా ఉండడంతో కరపత్రాల్లో, ముందుమాటల్లో, పత్రిక కథనాల్లో వాడబడుతూ వాటికి పుష్టినిస్తుంటాయి. ఈ విషయాలలో ఆయన సుమారు యాభై ఏళ్ల క్రితం రాసిన 'తను శవమై.../ ఒకరికి వశమై.../ తనువు పుండై.../ ఒకడికి పండై.../ ఎప్పుడూ ఎడారై.../ ఎందరికో ఒయాసిస్సై...' అనే 12 పదాల 'వేశ్య' కవిత అగ్రపీఠంపై కూచుంటుంది. 'న్యాయాన్ని ఏ కీలు కా కీలు / విరగ్గొట్ట గలవాడే పకీలు' తదితర చురకలు ఆ రోజుల్లో గోడలపై అభ్యుదయ నినాదాలుగా కనబడ్డాయి.

ఆయన ప్రతిభను గమనించిన ప్రభుత్వం 2013 లో పదవ తరగతి మరియు ఇంటర్మీడియట్ లలో తెలుగులో పాఠ్యాంశంగా తీసుకొంది. 2017 లో నిర్వహించిన ప్రపంచ తెలుగు మహా సభల సందర్భంగా కవి సమ్మేళన ప్రాంగణానికి ఆయన పేరు పెట్టి ఘనమైన తోరణాన్ని ఏర్పాటు చేశారు. ప్రధాన సభ స్థలి అయిన ఎల్బీ స్టేడియంలో ప్రముఖ తెలుగు కవుల సరసన ఆయన చిత్రాన్ని ప్రదర్శించారు.

గత డిసెంబర్ లో పుస్తక మహోత్సవంలో సభావేదికకు ప్రభాకర్ పేరును పెట్టి, స్టాళ్ళ మధ్య ఆయన చిత్రంతో భారీ ఫ్లెక్సీని ఏర్పాటు చేసి అలిశెట్టి ఖ్యాతిని చాటి చెప్పారు. ఇలాంటి గౌరవం మరిన్ని రీతుల్లో, సందర్భాల్లో కొనసాగవలసిన అవసరం ఉంది.

సగం జీవితాన్నే చవి చూసిన, అందులో సగం కష్టాల కొలిమిలోనే గడిపిన ప్రభాకర్ కు 'మరణం నా చివరి చరణం కాదు' అనే సాధికారిత ఉందని ఆయన కవిత్వమే నిరూపి స్తోంది. కవిత్వం ఉన్నంతకాలం కవి గా 'అలిశెట్టి ప్రభాకర్' అనే పేరు దేదీప్య మానంగా వెలుగు తూనే ఉంటుంది.

-బి.నర్సన్
9440128169

## పద్యం హృద్యంగా ఎగిరే రెక్కలిచ్చిన కవి

పుస్తక సమీక్ష

సామాజిక స్పృహతో, సమాజం పట్ల బాధ్యతతో స్పందించి రాసే కవిత్వం, పాఠక హృదయాల్ని కదిలించే అనుభూతితో పాటు, హృదయాల్ని వికసింపజేసే అద్భుతమైన ఒకానొక సౌందర్యం ఆరవోస్తుంటుంది. మస్తిష్కంలో మథనానికి అదునిస్తూ, ఆదేశాత్మక అక్షర రూపంగా కవిత్వం విరజల్లుతుంటుంది. సంస్కారవంతమైన తాత్త్విక భాషతో రాసే కవితాభివ్యక్తి సజీవతను సంతరించుకొని చైతన్యవంతంగా పాఠకుణ్ణి పలకరిస్తుంటుంది. ఇటువంటి కవిత్వాన్ని అవ్వారు శ్రీధర్‌బాబు రాసిన "ఎగురుతున్నపద్యం" కవితా సంపుటిలో వీక్షించగలము. పరిమళిస్తున్న సుగంధాన్ని తనివి తీరా ఆస్వాదించగలము. భాష సరళత, భావగాఢతతో ఇందలి కవితలు పాఠకుణ్ణి కదిలిస్తాయి అనడం అతిశయోక్తికాదు.

"ఎగురుతున్న పద్యం" కవితా సంపుటిలో మొత్తం డెబ్బది కవితలున్నాయి. అన్నీ సమకాలీనతను సాదృశ్యపరచేవిగా గతానుగతమైన ముసలి భావాల్ని చుట్టి విసిరేసేవిగా, ఉత్తేజ పూరితమైన సంగీతంలో వినిపిస్తూ బతుకు కలవరింతలతో ఆలింగిస్తుంటాయి. హృదయాల్ని చిగురింపజేస్తూ, వెలుగులు కురిపించే భావప్రకటనలు స్వచ్ఛతకు నమఉద్దీగా నిలుస్తుంటాయి. ప్రగతిశీల భావావేశంగా మొలుస్తుంటాయి.

కవి ఆలోచన "నీకు నాకు ఒకటే దారి" కవితలో బహిర్గత పరచబడింది. ఇందులో కవి అంటాడు - **"కొన్ని కఠిన వాస్తవ గుళికలు / కొందరి మెదళ్లలో కూర్చాలిపుడు / శాంతితే నెలద్దిన మాటల / జల్లులతో పుడమినితడపాలి / సరిహద్దు రేఖల / అహంకార అభిజాత్యపు / ముష్టి యుద్ధపుగాలి / ప్రపంచ గమనంపై ముసరక ముందే / ఇగో"మనసుల గొంతు నొక్కాలి"** అంటూ మానవత్వాన్ని విరబూయించే సమానత్వాన్ని ఆవిష్కరిస్తూ **"ఇద్దరం భూమి పుత్రులమేకదా! / ఎక్కువ...తక్కువ... చింతనలెందుకు / ప్రకృతి పెంచిన మొక్కలమే కదా! / "** అంటూ పాకిస్తాన్, భారత్ మధ్య అప్పుడప్పుడు రగిలే దాయాది మత్సరాన్ని అణచివేయాలనే ఉద్దేశ్యంతో **"మనిషి తత్త్వంలో దాగున్న సునిసత్వాన్ని వెలికి తీసి హృదయ విశాలతా / పచ్చని పంటలు పండిద్దాం / యుద్ధం వలన కలిగే దైన్యస్థితిని విసర్జిద్దాం"** అనే భావనతో కవి శాంతి, అహింసలతో కూడిన విశాల భావాల్ని వ్యక్తపరుస్తాడు.

"లేలేత అభిమన్యులు" అనే కవితలో కార్పొరేట్ పాఠశాలల్లో భావితరాల్ని బంధిచేస్తూ ర్యాంకుల పరుగు పందేల జాతర్లో తల్లిదండ్రుల గ్రుడ్డిగా చప్పట్లు చరుస్తూ బాల్యాన్ని బలి తీసుకుంటున్న విధానాన్ని దుయ్యబట్టాడు కవి.

**"వెలుతురు లేనిదే / కుసుమమైనా వికసించునా / నాలుగు గోడల పంజరంలో / బాల పక్షుల నిర్బంధం / మూడు వసంతాల ముక్కుపచ్చలారని / అభిమన్యులు సరస్వతీ నదిలోకి తోసివేత / అమ్మా నాన్నల కలల సౌధానికి / ఇసుక రేణువులే వారు"** అంటూ మూడు సంవత్సరాలు నిండని పసివారిని చదువుల చదరంగంలోకి నెట్టే తీరును ఆవిష్కరించాడు కవి.

కార్పొరేట్ విద్యా విధానం ఏలాగుందో చెప్తూ - **"ఆంగ్ల మాధ్యమ కొండ చిలువ నడుమ / చిక్కుకొని ఊపిరిలాగుతున్నాయి. / ఆంగ్లభాష పట్టురాక / ఇటు తెలుగు భాష గట్టు జారి / త్రిశంకు స్వర్గంలో తేలియాడుతున్న లేతమొగ్గలు"** అంటూ రెండింటికి చెడ్డ రేవళ్లు' లా పిల్లలు తయారవుతున్నారనేది కవిభావన.

ఒక మంచి కవిత ఎలా ఉండాలో చెప్తూ కవి "కవిత చదువుతున్నప్పుడు" అనే కవిత రాశాడు. **"వెన్నెల ముఖమంతా పరచుకుంటుం దపుడు / తనువంతా మంచి గంధం పూసుకున్నట్లే / మిట్ట మధ్యాహ్నం పూట / వేప చెట్టు నీడను మనువాడి / ఒళ్ళు తేలిని ఆనందంతో / మునిగినట్లే / .... మల్లెనువాసన హృదయాంతరాలళ్ళోదూరి / దోబూచులాడుతుంది / దేహం సంక్రాంతి గాలిపటం అవుతుంది / ....మనసు మట్టిలోంచి అందమైన / అక్షరపూలు విచ్చుకుంటాయి / నేనే ఓ .... సరికొత్త కవితగా రూపాంతరం చెందుతూ / కవిత సూరీదైతే .... నేను పొద్దు తిరుగుడు పువ్వు నవ్వాలి"** అంటూ కవిత చదివితే కలిగే భావన వ్యక్తపరుసాడు కవి. కవి కవిత రాస్తే పాఠకుణ్ణి ఈ భావనల్లోకి తీసుకెళ్లాలి అనేది కవి భావన.

"కొలవలేనితరాలు" కవితలో తల్లిప్రేమను గూర్చి చెప్తూ అది అనంతం అనే భావనతో **"విశ్వం కొలత ఎంత?/ సముద్రపు లోతు ఎంత? / ఆకాశంలో చుక్కలెన్ని? / కొలవవేని తీరాలు కొన్ని ఉంటాయి / తల్లి ప్రేమ కూడా అంతే** అంటాడు కవి.

"ఎగురుతున్న పద్యం" ఈ కవితా సంపుటికి శీర్షికగా నిర్ణయించబడినది. ఇందులో కవి **"ఆకాశంలో తారాడుతున్న / మేఘంలా కనిపించిన పతంగాన్ని ఊహిస్తూ "నేనూ పదాలను సరి చేసుకొని / బలమైన ప్రశ్నల దారంతో / పద్యాన్నొకటి సాహితీ లోకంలోకి ఎగురువేశాను / మనసులను చేరిందేమో..../ పద్యం రెట్టించిన ఉత్సాహంతో / ఎగురుతోంది ఇంకా.... "** అంటూ తన కవిత్వం ఏ విధంగా సజీవతను సంతరించుకుందో చెప్పాడు, అవ్వారు శ్రీధర్ బాబు.

ఇందులో కవితలు ఎక్కువగా సమకాలీన సమస్యల మీద స్పందించబడినవే! ఛిద్రమైన బతుకుల్ని వదచిత్రాలుగా, ఊరికెక్కిన పూరిగుడిసెలే ప్రతీకలుగా, వలసవెతల చీకటి దారుల్లో ఆకలి కత్తి మొనలు గుచ్చుకొని హత్యలైపోతున్న జనం వలస, జీవిత కట్టెకు చెదలెక్కుతుంది అనే భావనతో కవిత్వమైసాగిపోయిన కవీయన.

"మనిషి నక్కజాతి సంతతిగా మారి మేధోయంత్రాన్ని వంచన విలువలతో నడుపుతూ మనిషి తత్వాన్ని వెక్కిరిస్తున్న వైనాన్ని దుయ్యబడుతూ, మనిషి మనిషిగా మారాలనే, మానవత్వంతో చెలామగా కావాలనే భావనతో కవిత్వమై కురిసిన కవీయన.

## సంక్రాంతి లక్ష్మికి స్వాగతం

మూడు రోజుల ముచ్చటైన పండగ
సంబరాలకు కొదవే లేదు,
పౌష్య లక్ష్మికి పుష్పాభిషేకం
చేయాలని
బంతి,చామంతులతో సింగా రించి
తెల్లవారక ముందే గుడిలో
మోగే గంటలు
ధనుర్మాస పూజలతో గోదాదేవికి
అంగరంగ వైభోగాలు
దద్దోజన నైవేద్యాలు
శ్రీకృష్ణుడితో గోపికల సయ్యాటలు
అర్చనలతో ఆళ్వారు దేవాలయాలు,
నెల రోజులు నుంచే
సంక్రాంతి వేడుకలు,
వీధులన్నీ ముత్యాల ముగ్గులతో
రంగవల్లులు తీర్చి దిద్దిన రమణులు,
ముగ్గుల్లోగొబ్బిళ్ళుబంతిపూల తోరణాలు
బొమ్మలకొలువులుపేరంటాళ్ళు
భోగి మంటలు,తలంటు స్నానాలు
పసిపిల్లలు భోగిపండ్ల పేరం టాళ్లు,
పడతి సౌభాగ్యానికి పసుపు
కుంకుమలు,
గంగిరెద్దులసన్నాయి
మేళాలు మ్రోగిస్తూ
హరిదాసులభజనసంకీర్తనలతో
ఆనందం వెల్లివిరిసే
అనుబంధాల లోగిల్లు
అందరూఒకచోటచేరిఆత్మీయంగా
జరుపుకునే సంక్రాంతి ఓకొత్త కాంతి,
సంక్రాంతి లక్ష్మికి స్వాగతం"

**–రాయవరపు సరస్వతి**
9885656356

## ఊరంతా సంక్రాంతి

ఊళ్లు చలి కాచుకుంటున్నాయి
వెచ్చెచ్చగా భోగిమంటలేసుకుని
ఇళ్లు సింగారించుకుంటున్నాయి
ముత్యాల ముగ్గుల మధ్య
గొబ్బెమ్మలతో
రైతులు సంబరపడిపోతున్నారు
గాదెల నిండా నిండిన
ధాన్యాన్ని చూసి
ముక్కుపుటాలు అదిరిపోతున్నాయి
కమ్మని పిండివంటల వాసనలతో
వీధులన్నీ సందడిగా మారాయి
హరిదాసులూ దూడూ బసవన్నలతో
కన్నె పిల్లల కళ్లు మెరుస్తున్నాయి
బొమ్మల కొలువులూ భోగిపళ్లతో
పల్లెలు కత్తులు దూస్తున్నాయి
పుంజు భలే రంజుగా ఉందంటూ
ఆకాశం రంగులు మార్చుకుంటోంది
ఎగిరెగిరి పడుతున్న పతంగులతో
సంక్రాంతి సంబరాలు చేసుకుందాం
సరికొత్త కాంతిని జీవితంలో నింపుదాం!

**–చెన్నాప్రగడ వీఎన్నెస్ శర్మ**
9440587567

## బోగి మంట - పాము పుట్ట

నగరంలో అదొక పెద్ద వృక్షం . ఆచెట్టుమీద అన్నిరకాల పక్షులున్నాయి . అక్కడి పక్షులకు నాయకుడైన పావురం పక్షుల సమస్యలను పరిష్కరించేది .

పావురానికి వయసుమళ్లడంతో పావురం కోరికమీద కొత్తనాయకుడిని ఎన్నుకొనడానికి పక్షులు అంగీకరించింది. ఆ చెట్టుమీదున్న పక్షులకు నాయకుడిగా ఈ సారి కాకిని ఎన్నుకొన్నాయి.

కొన్ని రోజులు గడిచింది. ఒకరోజు పక్షులతో "మనచెట్టుకింద వున్న పామును ఇక్కడినుండి వెళ్లిపొమ్మని చెప్పదలచు కొన్నాము." అన్నాడు కాకి నాయకుడు

"ఆ పాము చాలా మంచిది దానివలన పక్షులకు ఎలాంటి హానీ కలుగలేదు."అంది వృద్ధ పావురం

"దుష్టులకు దూరంగా ఉండటం మంచింది కదా" కాకి నాయకుడు

"సింహం, పులి కూడా దుష్ట జంతువు. అయినా వాటిలో మంచివి వున్నాయి. కొన్ని అడవుల కు రాజుగా పరిపాలిస్తోంది. అలాగే ఈ పాము చాలా మంచిది" అంది చిలుక

" మంచిపాము అయినా దానివలన మనకు ఎటువంటి ప్రయోజనం లేదు " అంది కొంగ

పామంటే భయం వున్న కొన్ని పక్షులు పాము వెళ్లిపోవడమే మంచిదని చెప్పాయి.

ఎక్కువ పక్షులు పాము వెళ్లడం మంచిదని చెప్పాయి . ఇక్కడినుండి వెళ్లిపొమ్మని కాకి నాయకుడు చెప్పగానే పాము సరేనంటూ అంగీకరించి వెళ్ళిపోయింది.

ఒక సారి వర్షం వచ్చినప్పుడు తడిగా నున్న పుట్టను ముక్కులతో పొడుస్తూ పుట్టను పడేలా చేసింది పక్షులు .

కొన్ని రోజులు గడిచింది .

ఒకరోజు వేకువ జామున పక్షులు లేవడానికి ముందుగానే చెట్టుకింద ఆ వీధి వారందరూ వచ్చి భోగి మంట వేయసాగారు .

మంటల వేడికి ,పొగకు, చెట్టుపై నున్న చిన్న పక్షులు విలవిలలాడాయి

పక్షుల వైపు చూస్తూ "మంచిపాము అయినా మనకేమి ప్రయోజనం లేదని వెళ్లిపొమ్మని చెప్పారు.పాముపుట్టను మీరంతా తొలగించడంతో ఇక్కడి వారికి భయం పూర్తిగా పోవడంతో మొదటి సారి చెట్టుకింది బోగి మంట వేశారు"

"చెట్టుకింద బోగి మంట వేయడం తప్పు అన్న ఆలోచన రాలేదా"

"అసలు ఇది చెరువుగా వున్న స్థలం. ఈ చెరువును ఆక్రమించి ఇండ్లు కట్టిన ఈ మానవులకు అంత గొప్ప ఆలోచన ఉండదు "

"వాళ్లకన్నా పెద్ద తప్పు నేను చేసాను .ఆ పాము పుట్ట ,పాము వుండి ఉంటే భయంతో ఎవడూ ఇక్కడ బోగిమంట వేసేవారుకాదు. మంచి వారిని దూరం చేసుకోకూడదు .మరలా ఆ మంచి పాము కనపడితే ఇక్కడకు వచ్చిపాము పుట్ట కట్టుకొని నివసించమని చెప్పాలి." అన్నాడు కాకినాయకుడు

**– ఓట్ల ప్రకాష్ రావు**
09787446026

## సంక్రాంతి..

నూతన సంవత్సరములో మొదలయ్యే.. తొలి పెద్ద పండుగ సంక్రాంతి...

ఇది మూడు రోజుల పండుగ..
ముగ్గుల పండుగ..
అమ్మవారిని నాద బిందు కళాధరి. అంటారు..
బిందు అంటే చుక్క..
చుక్కలతో మొదలయ్యే ముగ్గు దాని సూచికే...!

చుక్కా చుక్కా పెట్టి.. చక్కని ఆకృతిని సృష్టించడం ద్వారా స్త్రీ తనని తాను ఓ సృష్టిశక్తిగా తెలుసుకోవాలన్నదే ఇందులోని భావన..!

పెద్ద లోగిళ్ళు.. విశాలమైన వాకిళ్లు.. పేడతో కల్లాపి చల్లిన వాకిళ్ళలో.. రకరకాల తెల్లని ముగ్గులు.. వాటి మధ్యలో ఆవు పేడతో చేసిన గొబ్బిళ్ళు... వాటిని నవధాన్యాలతో.. పూలతో అలంకరిస్తే.. అక్కడ అమ్మవారు కొలువై ఉందా అనిపిస్తుంది..

పేడతో చల్లిన పచ్చనివాకిళ్ళు గ్రామాలలోనే...
పట్టణాలలో మాత్రం రంగురంగుల రంగవల్లులు..!
ఒకప్పుడు ముగ్గులలో మూడు రకాలు మాత్రమే ఉండేవి..
చుక్కలు పెట్టి వాటి మీదుగా మెలికలు తిప్పేవి... చుక్కల ను కలుపుతూ వేసేవి... చుక్కలు లేకుండా అచ్చంగా గీతలతోనే వేసేవి...!

పిడికిలితో ముగ్గ తీసుకుని ఒకేసారి రెండు మూడు గీతలు వచ్చేలా గీసేవారు.. ముగ్గుగిరకలా... ఇది అందరికీ రాదు.. ఈ గీతలతోనే రథం ముగ్గులు.. స్వర్గ వాకిళ్లు.. సిరి చాపలని రకరకాలుగా వేసేవారు..

ఇప్పుడు ముగ్గుల స్వరూపమే మారిపోయింది.. అంతరంగులమయం..!

నిజానికి ఇది ధనుర్మాస ప్రారంభం నుండి మొదలవుతుంది... ఈ నెల రోజులు పెట్టిన గొబ్బెమ్మల పిడకలతోనే ,..సంక్రాంతి రోజున పొంగలి చేస్తారు..

భోగి రోజున గోదాదేవి కల్యాణం.. పిల్లలకు భోగి పళ్ళు పోసుకోవడం చేస్తారు.. సంక్రాంతికి పొంగళ్ళు చేయడం.. కనుమ రోజున ధాన్య సంపదను పంచుకోవడం.. పశువులను పూజించటం ఆనవాయితీ...!

ఒకప్పుడు కనుమ రోజున స్త్రీలు పసుపు చీరలను కట్టుకొని.. కొత్త బియ్యం రేగుపండ్లు పూలు చిక్కుడు దోస వంటివి అన్నీ ఒకరికొకరు పంచుకునేవారు.. ఇప్పుడు అంతగా లేకపోయినా సంప్రదాయం సాగుతూనే ఉంది... మన పండుగలు సంప్రదాయాలు అన్ని ఆరోగ్యాన్ని ఆనందాన్ని ఇచ్చేవే..కేవలం మన ఇల్లు గడవటం మాత్రమే కాదు ఉన్నంతలో తోటి వారికి పంచాలన్న ఉద్బోధ..!

అందుకు ఇల్లాలి ప్రోత్సాహం ఉండాలన్న ఆలోచన ఇందులో ఉన్నాయి..

సంక్రాంతి లక్ష్మికి.. గృహలక్ష్మికి జేజేలు.. సంక్రాంతి శుభాకాంక్షలు..

**– వి. మంగతాయారు**
సెల్: 9949278483

## శ్రీమతికి సంక్రాంతి శుభాకాంక్షలు

ఆయుధం లేకుండా ఆకాశాన్ని జయించటానికి
అతడు ఆమె మెడలో మూడుముళ్ళు వేశాడు...
నడిచిన ఆ ఏడడుగులు ఏకంగా ఏకాంతానికి
మల్లెపూల దోసిల్లతో ఆహ్వానం పలికాయి
ఆ తొలిరాత్రి జరిగిన సరదాల సంతకాల తడి
ఒక నదీ ప్రవాహమై ఇప్పటికీ ప్రవహిస్తూనే వుంది
ఆ ఇంటి గుమ్మాల దగ్గర సేవలకు సిద్ధంగా
రోజంతా రతీమన్మథులు దీక్షతో కాపాల
శయన మందిరంనిండా రెప్పార్పని వెన్నెలదీపాలు
ఉద్దీపనాన్ని తాంబూలంలా అందిస్తూ వసంతహేలలు
వాళ్ల కబుర్ల కోసం ఎదురుచూస్తూ కాలం దరఖాస్తులు
ఇంటి దర్వాజాలకు తృప్తి, సంతోషాల తోరణాలు
అందమైన భవంతికి అంతర్జాతీయ బహుమతిని ప్రకటిస్తే
ఆ పతకాన్ని అందుకోవటానికి సిద్ధంగా
తన పట్టుచీర కుచ్చిళ్లను సర్దుకుంటోంది ఆ కుటీరం
అదేమిటో కాని వాళ్లిద్దరి శ్వాసకు ఒకే ఒక గుండె చప్పుడు
నాలుగు కళ్ళకు ఒక చూపు సొంతం కావటం
ఆశ్చర్యం కాదది... అన్యోన్యత సాధించిన విజయం
పత్రహరితంలాంటి ఆమె దరహాసం మీద
మెరిసే మంచు బిందువై అల్లరి చేస్తుంటాడు
నిత్యం అతడి విజయాల పట్టిక నమోదుకోసం
ఆమె నవ్వు ఒక శ్వేతపత్రమై వాలుతూ వుంటుంది
ఎవరన్నారు వాళ్ల శరీరాలు వేరు, వేరని
విడదీయండి వీలయితే వజ్రాయుధంతోనైనా సరే
ఇది సవాలు కాదుకాని, వాళ్ల సంసారం ఇచ్చిన భరోసా
వృద్ధాప్యంలో సైతం ఆనందానికి ఆయువు పెరుగుతోంది
ఇంతలో... ఆకాశంలో భయంకరమైన దేగా ఒకటి
అమాంతం అతడ్ని తన్నుకు పోవాలని చూస్తోంది
అయినా అతడిలో భయం మొత్తం శూన్యం
ఇప్పుడు అతడి చుట్టూ ఒక బలమైన రక్షణ కవచం
దాని నిర్మాణం ఆయుధాలతో కాదు...
సాక్షాత్తు ఆలి ఆలింగనాలతో
అందుకే అందిస్తున్నాడు దాంపత్యం సాక్షిగా
శ్రీమతికి సరదాల సంక్రాంతి శుభాకాంక్షలు...

**–డా. కె.జి. వేణు,**
98480 70084

## భోగిపళ్ళ పేరంటం

భోగి భోగాల భోగిపళ్ళ పేరంటం
భామలంత ఒక్కటై జరిపేటి సంబరం.

బంగారు పళ్లెములో బదరీ పళ్ళు
బదరీ నారాయణుకి ప్రియమైన పళ్ళు
ఆదిత్యుని రంగుతో అలరారు పళ్ళు
అందాల పాపలకు పోసేటి భోగిపళ్ళు.
పసిడి బంతిపూలు, నాణ్యమైన నాణాలు
రేగిపళ్ళతో కలిపిన భోగి పళ్ళు
భోగభగ్యాలు ఇచ్చేటి భోగిపళ్ళు
బుజ్జి పాపలకు దిష్టితీయు భోగిపళ్ళు .
అపురూప పాపలకు భోగి పళ్ళంట
సంక్రాంతి లక్ష్మి మురిసి చూసేనంట
మంగళ హారతులు ముదితలు పాడేరంట
శ్రీదేవి భూదేవి కలసి దీవించేనంట.

**–కందాళం రజనీ రాణి**
9487708043

## ఒక్కరు

తెలుగుగడ్డ నడిబొడ్డున బాలభానుడిలా ఉదయించి
తెలుగుజాతి ఔన్నత్యపు జయకేతనమౌతారు
కష్టాల రాకాసి అలల్ని ఇష్టంగా దాటేసి
కలల సామ్రాజ్యాన్ని కళ్ళముందు నిలుపుకుంటారు!

సినీ వినీలాకాశాన అస్తమించని రవిబింబమై
నిత్యం వెలుగులు చిందిస్తూ అమరత్వం పొందుతారు
అనితర సాధ్యమైన నటనాకౌశలంతో 'నటరత్న'మై
'పద్మభూషణు'లై 'దైవస్వరూపు'లై మనసుల్ని దోస్తారు!

నిరుపేదల కడుపు నింపాలనే ఏకైక ధ్యేయంతో
యేడాదిలోగా జన హృదయాలను గెలుస్తారు
'అన్న' అనే చిరుమొలకగా ప్రజా జీవితాన కాలిడి
'ఆదర్శనేత' అనే మహావృక్షంగా ఎదుగుతారు!

అట్టడుగు వర్గాల ఆశాజ్యోతిగా
అలసటెరుగని వీర సైనికుడిగా
పాలనలో నిజాయితీకి శాశ్వత చిరునామగా
జాతి చరిత్రలో తనదైన జాడని ముద్రిస్తారు!

దేవుడిచ్చిన అపురూప జీవన కుసుమానికి
వేయింతల విలువల పరిమళాన్ని జోడించి
అజరామర కీర్తితో గుండె.. గుండెలో
గుడికట్టుకుని కొలువై ఉంటారు!
ఆ..అరుదైన ఒక్కరు.. మన ప్రియతమనేత "ఎన్టీఆర్"!

**– ఎస్. కాశింబి**
సెల్: 9052216044

పుస్తక సమీక్ష

## అన్న తన్నీరుకు.. కవితా పన్నీరు!

జన హృదయనేత తన్నీరు హరీశ్‌రావు జన్మదిన అభినందన కవితా సంపుటిగా దాసరి (జంగిటి) శాంతకుమారి సంపాద కత్వంలో, కవితా సంకలనం రావడం, ఒక విశేషాంశం. రాజకీయ రంగంలో, తెలంగాణ రాష్ట్ర సమితి సారథ్యంలో సామాన్య కార్యకర్తలు, ఉద్యమ నేతలుగా ఎదిగి, రాష్ట్రా భివృద్ధికి ముందడుగులు వేయడం ఒక ఎత్తయితే, అరుదైన వ్యక్తిత్వంతో జనంలో కలిసిపోయే ప్రజాదరణ పొందుతూ, అందరి మనసులు చూరగొని మన్ననలందుకోవడం కొందరికే సాధ్యం అవుతుంది. "అన్నకు కవిత్వమంటే ఇష్టం" అంటూ 126 మంది కవుల కవితా హృదయాలను ఈ సంపుటిలో ప్రచురింపచేసిన దాసరి (జంగిటి) శాంతకుమారి సాహితీ కవితా సత్కృషి అభినందనీ యం.

'తన్నీరుకు.. కవితా పన్నీరు' సంకలనం నవ తెలంగాణలో రాష్ట్ర అస్తిత్వం, ఆత్మ గౌరవం, ఉద్యమ చైతన్యం, కవితా స్ఫూర్తి ఎంతగా వికసిస్తోందో స్పష్టం చేస్తోంది. ఎవ్వరినీ నొప్పించక, ఒప్పించి, మెప్పించి, రాజకీయాన్ని నడిపే నేర్పరితనం వున్న హరీశ్ రావుకు తెలంగాణలోని ప్రతిపక్ష పార్టీలలో కూడా అభిమానులు వుండటం నిర్వివాదాంశం. సుమతీ శతకకారుడు ఉదహరించినట్టు, హరీశ్‌రావు తప్పించుతిరిగే ధన్యత ఆశించేవారయితే, యింత మంది కవుల ప్రశంసాభి మానాలు దక్కేవి కావు. 'నవతర శిఖరం–తన్నీరు హరీశన్న' తొలి కవితలో, తెలంగాణ సాహిత్య కళాపీఠం సిద్దిపేట కవయిత్రి శాంతకుమారి "తన్నీరు హరీశన్న పేరు వింటేచాలు పన్నీరు తడిపిన తేనె జలజలా రాలు" అంటారు. 34 మంది మహిళా కవయిత్రులు హరీశ న్నను కవితాపరంగా ప్రశంసాయి తంగా ఆవిష్కరించడం ఈ కవితా వైజయంతిక సాధించిన కృతకృత్యత సూచిస్తోంది. మాటలలో ఆత్మీయత, మనసులో ఆత్మీయత హృదయంలో ప్రేమానురాగాలు, బాధ్యతల పట్ల నిబద్ధత, చిరునవ్వు చెదరకుండా సాధ్యమైనంతగా జనంలో కలిసి తిరిగే వ్యక్తిత్వంతో రాజకీయం నడిపిస్తున్న హరీశ్‌రావుగార్కి ఈ కానుక మరింత స్ఫూర్తిని అంది స్తుంది.




**ప్రతులకు:** దాసరి (జంగిటి) శాంతకుమారి, ఇ.నెం. 18-13-78, గాంధీనగర్, సిద్దిపేట-502 103 (తెలంగాణ).సెల్: 9652483644

**–జయసూర్య**
సెల్:90149 48336

## నానీలు

**–సుధా మైత్రేయ**
సెల్:9989042236

చంటోడికి
అక్షరాభ్యాసం అయింది
కాగితం నిండా
సకినాలు, చెగోడీలే



ట్యాంక్ బండ్‌కు
ఉత్సాహంగా వెళ్ళాను
ముక్కు మూసుకొని
తిరిగొచ్చాను



చిన్నప్పుడు తిట్టారు
గాలి తిరుగుడని
ఇప్పుడు
విమాన పైలట్



అన్నలో అనురాగం
మొలకెత్తింది
ఎప్పుడంటే
చెల్లి పుట్టగానే

నిద్దర్లోనూ
వీడని నేస్తం
గుండెలను హత్తుకొంది
పుస్తకం

## మరువని త్యాగానివి

ఛాందస సమాజాన్ని
అర్థంపర్థంలేని ఆచారాలతో
ఆడవాళ్ళు అబలలని
వంటింటికుందేళ్ళుగా చూసే
నాటి సమాజ మనస్తత్వాన్ని
నీచత్వాన్ని పగులగొట్టి
మహిళలందరినీ మార్చే
సరస్వతి రూపానివైనావు
నాటి ప్రతికూల పరిస్థితుల్లో
ఆడవాళ్ళంటే ఆదిపరాశక్తులని
ఎంతో గుండెనిబ్బరంతో
అవమానభారాన్ని
ఎదిరించిన ఓర్పుశిఖరానివైనావు
దురాచారాల్ని దునుమాడే
దేవతామూర్తివైయ్యావు
కుళ్ళిన సమాజంలోని కంపునంతా తరిమి
జ్ఞానపరిమళాల్ని వెదజల్లావు
గడపదాటిన నీ అడుగు
నింగినితాకే దారయ్యింది
స్త్రీ శక్తిని తట్టిలేపిన
ప్రేరణకిరణానివి
ఎన్నో జ్ఞానజ్యోతులను వెలిగించిన
సావిత్రిబాయిపూలే
మరువబోదు నీ త్యాగం
ఈ భారతదేశం

(సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా)

**–సి. శేఖర్(సియస్సార్),**
9010480557.

## నీ మది

కల్పితాలు లేనిది – నీ మది
కంగారు పెట్టనిది – నీ మది
కటువుగా మాట్లాడనిది – నీ మది
కంటి పాపలా కాపాడేది –నీ మది

కఠినంగా వుండనిది – నీ మది
కవ్వించే పనులు చేయనిది – నీ మది
కసాయి పనులు చేయనిది – నీ మది
కపటం తెలియనిది – నీ మది.

కలకండలా అలరించేది – నీ మది
కర్తవ్యం మరువనిది – నీ మది
కలకలం సృష్టించనిది – నీ మది
కర్కశుడిలా అలరించేది – నీ మది.

కల్మషం లేనిది – నీ మది
కలహాలజోలికి వెళ్లనిది – నీ మది
కలుపుగోలుగా వుండేది – నీ మది.

కష్టం తెలుసుకుని –
నీకు నేను న్నానుగా –
**దోస్త్ వఫ్రీ** అని –
నిన్న లేని అందాన్ని –
గంగా ప్రవాహ –
పారవశ్యంలా అలరించే
స్నేహ రేఖల–జీవనది–నీ మది

**–లంకా వెంకట సుబ్రహ్మణ్యం**
సెల్: 94404 48650

## నా పల్లె అందాలు

అందమైనది నా పల్లె
సౌందర్య మైనది పల్లె
అర్ధనారీశ్వరులకు
నెలవై ఉన్న నా పల్లె.
కోడి కూతతో లేచిరి
గజగజ వణుకగ లేచిరి
వాయిలి పొరకతొ ఊడ్చిరి
కళ్ళాపి జల్లి మురిసిరి.
అంగనులందరు గూడి
ఆటపాటలొన గూడి
రంగు రంగుల ముగ్గులు
వేసి ముదితలు మురిసిరి.
మంచుపొగను చీల్చుకుంట
అరుణ కాంతులతోడ ఇట
పల్లె సుఖమే తన సుఖము
అని భానుడు తలచాడిట
చల్లని వాతావరణము
తట్టుకోలేకయు జనము
గొంగడితో కొప్పెర
వెట్టి హాయి జెంద జనము.
రోటి పచ్చడి రొట్టెలు
అంబలావకారాలు
మజ్జిగ పులుసు తోటి
లొట్ట లేసిరి జనాలు.
పొలం పనులకు కొందరు
పనిచేత కాని వారు
ఆటపాట మాటలతో
కాలయాపనకు వారు.
పచ్చని పంటల పొలాలు
పచ్చని చెట్ల శ్రేణులు
కొండకోనల నడుమ
పశువుల మేపె కాపరులు.
ప్రకృతి ఇచ్చిన పూలు
గాలి, కూరగాయలు
వీరి సొంతం ప్రకృతి
కాంత హృదిన పల్లెలు.
నిర్మలమైన మనసులు
కఠినం కాని యెడదలు
వీరే కదా దేవుని
మనసుని గెలిచిన జనులు.
పచ్చల హారాలు చేలు
గలగల పారే వాగులు
నిండు ముత్యేదు వోలె
కనువిందు చేయు పల్లెలు

**–యం. వీరకుమారి**
8374728321

ఎక్కడా
ఎదురులేదనుకున్నాడు
కరోనా పంజరంలో
బందీ అయ్యాడు

అందుబాటులో వైద్యశాల
వంటిల్లు
ఔషధ డబ్బా
పోపుల పెట్టె

కలకాలం
విహరిస్తుంటూనే ఉంటా
భావనాంబుధిలో
అక్షరనౌకనై

అసంతృప్తి బీజాలు
మొలకెత్తాయి
విప్లవ వృక్షాలై
కదులుతున్నాయి

కరోనాకు
కనికరం లేదు
కరచాలనమిస్తే
అంతు చూస్తానంటోంది

కన్నీళ్లను మ్రింగి
ఒదారుస్తుంది
దిండు
ప్రతీ ఒక్కరి నేస్తం

తలుపులు, గడియలు
లేకున్నా తాళం
కరోనాతో
అన్నిదేశాలు లాక్‌డౌన్

## అక్షర ఆమని

కనిపించని దారిలో దాగున్న ముళ్ళను ,
రాళ్లను, కఠినమైన సవాళ్లను, ఎదుర్కొని
రహదారి నిర్మించిన తొలి అడుగు తనది
మహిళా విద్య కై మొదటి పాఠశాలను స్థాపించి
నిమ్న జాతి ప్రజల జీవితాల్లో వెలుగులు నింపిన విజ్ఞానజ్యోతి .
అట్టడుగు వర్గాలకు చెందిన స్త్రీల హక్కులకై పోరాడి,
దురాచారాలకు శిరోముండనం చేయించి
స్త్రీ జాతి చైతన్యానికి కదంతొక్కిన ప్రేరణ.
బాల్యవివాహాలను వ్యతిరేకిస్తూ మూఢనమ్మకాలను
పారద్రోలాలని సతీ సహగమనాన్ని రూపు మాపాలని,
పునర్వివాహ మద్దతు లక్ష్యంగా పోరాడిన స్ఫూర్తి.
మనిషి నిజమైన సత్యాన్ని గ్రహించాలని ,
సత్యశోధక సమాజాన్ని స్థాపించి
జ్యోతిబా సహకారంతో ముందుకు సాగిన సాహసి.
నిరక్షరాస్యతను రూపుమాపాలని,
కులాల కోటలు కూల్చాలని విద్యాహక్కు ఆవశ్యకతను వివరిస్తూ,
కావ్యపూల్ రచించిన గొప్ప విద్యాభావం .
ఆత్మస్థైర్యానికి ఊపిరి పోసి
స్త్రీ సాధికారికతకు ప్రాణం పోసిన పరిచయం తనది.
మానవత్వాన్ని పలకరించి హక్కుల సాధనకై
ఉద్యమాలు చేసిన ధైర్య శీలి.
భర్తకు తానే చితి పెట్టి నూతన ఒరవడికి
తెరలేపిన అభ్యుదయభావాజాలం.
చేతలతో మాటలు చెప్పి ప్రాణాంతక వ్యాధిగ్రస్తుల సేవలో మానవత్వానికి
ఆయువు అర్పించిన ఆత్మ త్యాగం.
సావిత్రి బాయి పూలే.. దశాబ్దాల క్రితమే
శతాబ్దాల చరితను మార్చి కొత్త శకానికి
నాంది పలికిన అక్షర ఆమని.

**–షేక్.నసీమా బేగం**
9490440865

పుస్తక సమీక్ష

## పరికిబండ్ల వేంకట నరసయ్య- వేములవాడ శ్రీ రాజేశ శతకం

ఆధ్యాత్మిక దైవజ్ఞాన జిజ్ఞాసి, గ్రంథపఠన, రచన, పర్యటనా, సాధు సాంగత్య సత్సీలి రాధాకృష్ణ ఉప్పల (శోభారాణి) దంపతులు, భక్తి, జ్ఞాన, ఆధ్యాత్మిక తపస్వి, తమ గురుదేవులైన స్వర్గీయ పరికిబండ్ల వేంకట నరసయ్య రచించిన వేములవాడ శ్రీ రాజేశ శతకాన్ని పునర్ముద్రణగా వెలువరించడం విశేషాంశం. సరళమైన భాష, మధురమైన భావాలతో, ప్రధానంగా ఇలవేల్పు అయిన వేములవాడ రాజరాజేశుని పట్ల ప్రగాఢభక్తి ప్రపత్తులతో ఈ శతక రచన కొనసాగింది.

**"అతి బీద జనుల కెప్పుడు**
**సతతము వాయువును, నీరు**
**సరిపడు మెతుకుల్**
**కుతుకమున కూర్చు మానవు**
**డతడే మాధవుడు సుమ్ము! హర**
**రాజేశా॥"**

అంటూరు స్వర్గీయ పరికిబండ్ల ఒక పద్యంలో, కవులు, గాయకులు, భక్తిధర్మ తత్పరులు, అయిన పరికిబండ్ల వేంకట నరసయ్య ఈ శతక పద్యాలలో

**"నా మాటలందు సత్యము**
**నా మాటల మధుర ప్రేమ!**
**నాటుము స్వామీ!**
**నా మాటల నీ రూపము**
**వేనూరు భజింతునయ్య! విను**
**రాజేశా॥"**

అంటూ ఆత్మ సమర్పణతో "పటుతర భక్తి నొసంగియు చిటికెలో దరి చేర్చుకొమ్ము" అంటూ శరణాగతిగాతనను అర్పించుకొంటారు. కవి సమ్రాట్ విశ్వనాథ వారు తమ నవల **'మ్రోయు తుమ్మెద'**లో పేర్కొన్న "గుండి రాజన్న శాస్త్రి ధర్మపురి" పరిచయ అక్షర సత్యాల ప్రస్తావన, ఈ శతక తొలిపుటలో ప్రచురింప చేయటం అపూర్వం.

**ప్రతులకు:** రాధాకృష్ణ ఉప్పల
శ్రీహరివాసం మోతీనగర్
హైదరాబాద్–500 018
సెల్: 98854 22354

**–జయసూర్య**
సెల్:9014948336
9394775088



# "చదువు మూడో కన్ను"

చాలా కాలం కింద ఒక పల్లె టూర్లో సంతానం లేని వృద్ధ దంపతులుండే వారు. "అందరూ విద్యలేని వారు వింత పశువులు, అక్షరం తెలియని వారు కళ్లున్న గుడ్డి వాళ్ళ కిందకే లెక్క" అని ఇలా అనేకమార్లు అంటుంటే, వారిలో చదువుకుందామనే కోరిక కలిగి,

ఒక రోజు వాళ్ళ ఊర్లోనున్న చిన్నబడికి వెళ్ళారు. వెళ్ళడంతోనే ఆ బడి మాస్టారుకు "గురువయ్యా! దండాలు" అని ఇద్దరూ నమస్కారం పెట్టుకుని వినయంగా నిలబడ్డారు.

ఇది గమనించిన గరువుగారు "ఏంటి పెద్దాయన ఎటొచ్చారు? మీ మనవడు మనవరాలెవరైనా ఉన్నారా?" అని అడిగారు.

"అబ్బే మాకు పిల్లలే లేరు బాబూ!" అంటూ జవాబిచ్చారు.

"మరి దేనికొచ్చారు?" అని మాస్టారు అడిగితే

"చదువు కుందామని" ఇద్దరూ ఒకేసారి జవాబిచ్చారు.

ముందుగా ఆశ్చర్యపోయినా మాస్టారు "మరి పలకా బలపం తెచ్చుకున్నారా?" అని అడిగాడు.

"లేదు సారూ!" అని అమాయకంగా జవాబిచ్చారు వృద్ధ దంపతులు.

"మరెలా?" అని ప్రశ్నించాడు టీచరు.

"కొన్నాళ్ళు మీరు చెప్పే విషయాలు విని ఆ తర్వాత.." వారి మాట పూర్తవక ముందే.

"అలాగే సరే అదిగో! ఆ శిశు తరగతిలో కెళ్ళి కూచోండి" అని క్లాస్ గదిని చూయించాడు టీచరు.

అలా చెప్పగానే ఆ క్లాస్‌లోకెళ్ళి కూచున్నాడు. వారిని చూసి పిల్లలు కొందరు నవ్వుకున్నారు. మరికొందరు ఆశ్చర్యపోయి చూశారు. ఏదైతేనేమి ఆ రోజు గడిచిపోయింది.

మరుసటి రోజు కూడా నీటుగా తయారై క్లాసు కొచ్చారు. బుద్ధిగా మాస్టారుకు నమస్కారం చేయగానే వారిని చూసి "వచ్చారా?" అని అడిగి "కూర్చోండి" అనిచెప్పగానే, కూచొని ఆ రోజు మాస్టారు చెప్పిన విషయాలు విని లాంగ్‌బెల్ కాగానే "గురువుగారూ వెళ్లొస్తామండీ" అని చెప్తుంటే

"వెళ్తున్నారా?" అని గురువుగారు అడగడం

"అవును" అన్నట్టు తలలు ఊపి ఇంటికి వెళ్లిపోయారు వృద్ధులు.

ఇలా ఆ వృద్ధ దంపతులు బడికి రావడం, ప్రతిరోజూ వారిని "వచ్చారా కూర్చోండి, వెళ్తున్నారా?" అని మాస్టారు పలకరించటం జరుగుతోంది. ఇలా ఈ మూడు మాటలు వాళ్లకు బాగా అలవాటై రాత్రుల్లో నిద్రలో కూడా కలవరిచేంత వరకొచ్చింది పరిస్థితి.

ఇలా ఒకనెల గడిచింది. ఒక రోజు అర్ధరాత్రి వీరింట్లోకి దొంగలు చొరబడ్డారు. వీరిద్దరూ గాఢనిద్రలో ఉండి అదే సమయంలో కలవరింత మొదలైంది.

"వచ్చారా?" అన్న మాటలు దొంగలు అడుగు పెట్టడంతోనే కలవరింతతో ఆ మాట దొంగలు విన్నారు. అది విన్న దొంగలు ఆలోచిస్తున్నంతలోనే "కూచొండీ" అన్న మాట వారికి వినబడింది. "అరే వీళ్ళ మెలకువగా ఉన్నట్టున్నారనే" అన్న అనుమానమొచ్చి ఇక లాభం లేదని వెళ్ళిపోవడమే బెస్టనీ వెళ్ళిపోతుంటే "వెళ్తున్నారా!" అన్నమాట వినగానే భయంతో కాలికి బుద్ధి చెప్పారు దొంగలు.

మరుసటి రోజు ఉదయం ఆ వీధిలోని 2,3 ఇండ్లలో దొంగలు పడి దోచుకెళ్ళారు అని తెలిసింది. కానీ వీరింట్లో.. దొంగలు పడలేదు. అందరూ ఆశ్చర్యపోయారు. కారణమేమిటని ఆరాతీస్తే తెలిసింది. వీరు బడిలో నేర్చుకున్న "వచ్చారా?, కూర్చోండి? వెళ్తున్నారా?" అన్న మూడుపదాల మహత్వమేయని అప్పుడు తెలిసింది బడికెళ్తే ఏమిటీ లాభమని.. చదువు మూడో కన్ను అని.

-దారం గంగాధర్
సెల్:9848384777

## కాల జ్ఞానం

నడుస్తూనే నడిపిస్తుంది
గురువు వలె బోధిస్తుంది
సెంపలేసుకునేలా చేస్తుంది
నడిపిస్తూ పాఠాలు నేర్పుతుంది
తీవ్రమైన గాయాలు చేస్తుంది
లేపనమై ఉపశమనాన్నిస్తుంది
కాల గర్భంలో చరిత్ర దాస్తుంది !

సమయం విలువ తెలిసినోడే..
సాఫల్య తీరాలను ముద్దాడేది
కదలడమే లక్ష్యసాధనకు..
తొలి అడుగు అని బోధిస్తుంది
కాలాన్ని సదాగా గడపవద్దని..
రేపటికి పెట్టుబడి పెట్టమంటుంది !

కాలానికి ఆది అంతమే లేదు
ముఖాన జయాల్ని పూయగలదు
ఆశల చిగురుల్ని తుంచేయగలదు
ముఖమ్మీదే వైఫల్య బురద రుద్దగలదు
కాలం పరీక్ష పెట్టి పాఠం నేర్పగలదు
గురువు పాఠం నేర్పి పరీక్ష పెడతాడు

కాలం సాదాసీదాగా బతకడానిక్కాదు
ఉత్తమ జీవితానికి కాలమే పెట్టుబడి
కాలానికి రక్త వాసనలే కాదు..
విజయ పరంపరలు విధితమే
అవిచ్ఛిన్న అనంత కాల మహిమ..
అనుకోని అద్భుతాల్ని అందించగలదు !

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## మేలిముత్యం

ప్రతి రోజూ వానకురిసి
తడిపివెళ్ళిపోయే చినుకులు
ఎన్ని ఎక్కడ పడితేనేం?

ఎంతవద్దనుకున్నా
మనసున కురుస్తాయి వానలు
ఊహలన్నిటిని తడిపేస్తూ.

ఒక్కోసారి అద్భుతమైన
అక్షరాల చినుకులు వర్షించి
భావాలను తడిపేస్తాయి.

చకోరపక్షి ఎదురుచూపులు
ఎందుకో తెలియనిదెవరికి?
జీవితాన్ని మురిపించే వాన కోసమేగా?

మనోసాగరాన కురిసే
స్వాతి చినుకొక్కటి చాలదూ?
మేలిముత్యమై మెరిసే కవనంలా.

ఆలిచిప్పలో స్వాతి జల్లు కురిసేలా
సాహితీ తీరాల నిలిచిపోయేలా
అందమైన హారంలో ఒదిగిపోయేలా

- డాక్టర్ చక్రపాణి యిమ్మిడిశెట్టి
9849331554

## నేను నిత్య చైతన్యాన్ని

నేను ప్రస్తుతాన్ని
గతానికి శిఖరాన్ని
భవిష్యత్తుకు ఆధారాన్ని...!!

నిన్నటి స్వప్నాన్ని
రేపటి జ్ఞాపకాన్ని
నేటి నిజాన్ని
యిజాన్ని కష్టపడే జీవాన్ని...!

గతాన్ని స్వగతంగా
భావితరానికి స్వభావంగా
కవన బలంగా కదిలే
కాలచక్ర గమన కష్టాల కిష్టయ్యను..!

అనుభవాల్ని ఆనందదాయకంగా
పారించె శ్రమజీవన
సౌందర్యానుభూతున్ని...!

నేనే నిత్య పరంజ్యోతిని
కాయకష్టాన్ని నమ్ముకున్న
కర్మయోగిని...!

నేను అక్షరాలతో సాగే క్షణాన్ని
క్షణంలో శుభ తరుణంగా
మార్చే ప్రస్తుతాన్ని!!

నిత్య చైతన్యాన్ని
దశాంశాల శతమానాన్ని
త్రికాలాలలో
త్రికరణ శుద్ధుల్లో...!

మానవీయతల
మమతాలాపన
ఆదర్శాల అనుక్రమాల
ఆనందోపదేశాల అపరిచితున్ని...!

నయగారాల
నవరసమయాల నాగరికున్ని
నవీనకాల శ్రమదోపిడికి గురైన
నిర్భాగ్యున్ని..
దేశ సార్వభౌమాధికారానికి
మూలధాతువున్ని
నిరంతర శ్రమజీవిని...!

సమున్నత గౌరవంగా
త్యాగమయ శీలంగా
చేతనమే వినిమయంగ జీవించే
నైతిక విలువల సౌరభాన్ని...!!

సౌభ్రాతృత్వాన్ని ఎదజల్లే
సగటు కష్టాల సనాతనాన్ని
సంస్కరణల వరవడిని
ఒడిసిపట్టే నడవడికాన్ని...!!

భరతవాస భాగ్యాన్ని
ఆత్మీయతల ఆహ్లాదాన్ని
చేయూతల స్నేహాన్ని
విశ్వశ్రేయ వినయాన్ని...!!

మనోవాక్కాయ కర్మల
కండల కొండల్లో
జాలువారే స్వేధ జలపాతాన్ని
దేశ దిశను మార్చె
తొలిమెట్టును నేను ..కష్టజీవిని...!

అణువణువు అనునిత్యం
ఆకాంక్షల ఆచరణకు
ఆదర్శపు నడవడికి
సహకరించె సాధారణ
ఘర్మజలపు కార్మికుడిని..!!

కాలచక్రగతిలో కర్మయోగుల
మూలధనపు మర్మయోగుల
న్యాయ ధర్మ సత్యసుధల
శ్రేయమెంచె శ్రేయోభిలాషిని..!

శ్రమజీవుల ధర్మాన్ని
కాలచక్ర సత్యాన్ని
సమస్తలోక గమకాన్ని
గీతామృతాన్ని అందించిన
సర్వ శ్రేయోవాదిని
నేనే భారతీయున్ని...!

-డా.పాండాల మహేశ్వర్
9912180054

## కైకాల...

అతడు ఏ పాత్రనైనా అవలీలగా నటించి చూపగల
ప్రతిభావంతుడు గొప్ప శక్తివంతుడు.

ఘటోత్కచుడు మాంత్రికుడు
తండ్రి పాత్ర ధరించగల నేర్పించగల నట శిఖరం

అతని ముఖములో నవరసాలు పండిస్తాడు
తన మాటల శక్తితో ప్రేక్షకుల గుండెల్లో
తండ్రిగా తాతగా ప్రతి నాయకునిగా.

యముడుగా ఏ పాత్రనైనా మెప్పించి ఒప్పించగల
నవరస నటసార్వభౌముడు.

జానపద చిత్రాల్లో ప్రతి ఫైటింగ్ చేసి
ప్రేక్షకుల గుండెల్లో ఉత్కంఠ రగిలించగల
నట శికామణి నట కిశోరుడు
ఆ నవ్వులో గలగల నదిలాపారే చప్పుడు ఉంటుంది.

అతడే కైకాల సత్యనారాయణ
అతని నటన చూసి అవార్డులన్నీ
అతని దరి చేరి మెప్పించిన మహానటుడు.

-డాక్టర్ సిహెచ్ ఆంజనేయులు
7702537453

## దేవుడు చేసిన తప్పు

ఒక రాజు పారిపాలన లో ఉత్తమమైన విధానాలు అనుసరిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. అయితే అతని ఒక అలవాటు ప్రజలకు ఇబ్బందిగా ఉంది. రోజుకు ఒక ప్రశ్న వేస్తూ సరియైన జావాబు చెప్పితే బహుమతులు తప్పు చేస్తే శిక్షలు వేసేవారు. అలా జరుగుతున్న క్రమంలో ఒక రోజు రాజు వింత అయిన ప్రశ్న అడగడం, ఆ ప్రశ్నకు జావాబు చెప్పే వంతు వచ్చింది. ఆ ప్రశ్న ఏమిటీ అంటే దేవుడు చేసిన తప్పు ఏమిటి అని అడగడం జరిగింది. దేవుడు ఏమి తప్పు చేస్తాడు. ఈ చిక్కు ప్రశ్న సమాధానం దొరక్క చాలా ఆందోళన పడి మానసిక శాంతి కరువు అయ్యింది. ఒక సామాన్యుడు దీనికి ఉపాయం చెపుతాడు. అప్పుడు మంత్రి రాజు మీ ప్రశ్నలు పై ప్రజలు చర్చించుకుంటున్నారు. మీరు మారు వేషంలో వచ్చి చూడడండి అని సమాధానం తెలుస్తుంది ,దాని ప్రకారం ఒక్కరోజు మారువేషంలో వెళుతుంటే ప్రజలు ఈ విదంగా అనుకుంటున్నారు. రాజు కు ఇదేమి బుద్ధి హుందాగా ఉండాలి ఇదేమి పిచ్చి ఆనందం. అసలు దేవుడు చేసిన తప్పు ఈ రాజును పుట్టించాడమే. అని అనుకుంటారు. తర్వాత రాజు ప్రశ్నలు అడుగడమే మానేశారు. అన్ని నాకే తెలుసు అనే భావన మంచిది కాదు

-ఉమాశేషారావు వైద్య
9440408080

పుస్తక సమీక్ష

## జక్కని గంగాధర్- చిక్కని చక్కని తెలుగు శతక సంపుటి




సాహిత్యరత్న 'జక్కని గంగాధర్' పద్య రచనలో దిట్టకవిగా జక్కనార్య శతకం రచించారు.

**"తల్లి నిన్నుదలచి తనయుడు రచియించె**
**జక్కనార్యు కవిత జయము గూర్చ**
**అమ్మ శారదాంబ మమ్ము దీవింపుము**
**సకల విద్యలందు సాగిపోవ!"**

అంటూ తల్లి స్తుతితో ప్రారంభించి **"తల్లి మాట వినుము తలనెత్తి తిరిగేవు"** మొదటి పద్యంగా ఆట వెలదిలో 124 పద్యాలు ఈ శతకంలో ప్రచురింపచేసారు. "జక్కనార్యు మాట జయము నొసగు" మకుటంగా సాగిన ఈ పద్య రత్నావళిలో తేటతెలుగు మాధుర్యం తో, వేమన బాటలో ఆణిముత్యాల లాంటి పద్యాలున్నాయి.

**"అమ్మ నాన్ననీకు ఆదర్శమయ్యరో**
**పంచుమయ్య ప్రేమ ప్రతి దినమ్ము**
**కదిలిపోయినంత కనలేవు వారినీ**
**జక్కనార్యుమాట జయము నొసగు"** మాతా, పితృభక్తికి నిదర్శనంగా, ఎన్నో జీవిత సత్యాలు నీతివంతంగా, సందేశాత్మకంగా కవి అందించారు. **"అప్పు చేయకయ్య అందరూ తిట్టేరు పనుల జేసినీవు పైకి రమ్ము"** అంటూ **"పుస్తకాలు చదువు బుద్ధికి బలమగు" "దొంగతనము వద్దు దొరలాగ బతుకుము"** అంటూ యువతను హెచ్చరిస్తారు. "తేనె లొలుకు భాష తెలుగు భాష పరభాష నేర్వు పలుకుము మన భాష" అంటారు. మాతృభాషాభిమానంతో "మహతీ సాహితీ చక్రవర్తి' 'ఇష్టపది శ్రేష్ఠ' ఎన్నో బిరుదులు, సత్కారాలు పొందిన జక్కని గం గాధర్ శతక సుమాలు అందరి మన్ననలు పొందుతాయి.

ప్రతులకు: జక్కని గంగాధర్
225/సి25, యశస్వి సిహెచ్ఎస్, గేరమ్-2
బోరివలి వెస్ట్, ముంబై-400 092
సెల్: 9076352347

-జయసూర్య
సెల్:9014948336
9394775088

## చూపు

ఇంకొంచెం తొంగిచూడు
నీ అవతల కొన్ని కళ్ళుంటాయి
మరికొన్ని చేతులుంటాయి
నీవు చూసిందే సర్వస్వమని
సంబుర పడుతున్నావు
ఇంకొంచెం తొంగిచూస్తే!
మరో లోకం కనిపిస్తది
నాకు అన్నీ
కనబడుతున్నాయని అనుకుంటున్నావు
కానీ! కనబడని విజ్ఞానాలు
అనేకంగా వున్నాయి
కళ్ళలో కాగడాలేసి చూడు
కనిపించని గుండె లోతుల్లో
తడితనం వుంటది
ఇంకొంచెం కళ్ళు
పెద్దవి చేసుకొని చూడు
ఒక కవిత సంపుటి వుంటది
దాన్ని ఎప్పుడైనా
శోధించావా? ఛేదించావా?
నీవు ఇటువైపు వున్నావు.
అటువైపు చూస్తే!
ఒక మనిషి వుండాలి
ఎప్పుడైనా అతన్ని గుర్తుపట్టావా?
అతన్ని గ్రహించావా?
అక్కడ కనిపించే మనిషిలో
ఒక పిట్ట వుంటది
అక్షరాల రెక్కల్ని కట్టుకొని
అది ఎప్పుడూ ఎగురుతూ వుంటది.
దాని అంతరాలు చూడాలంటే
నీ చూపూ...
ఇంకొంచెం పెద్దగా అవ్వాలి
నీవు గుర్తుపట్టని వాళ్లు
ఇంకెందరో వున్నారు
వాళ్లను అందుకోవాలంటే
వాళ్లను గుర్తు పెట్టుకోవాలిసి వుంటది
దృష్టి లోపిస్తే దిశలు
మారుతుంటాయి
నీవు చూసే చూపు
మరింతా విశాలమవ్వాలి.

-బొల్లారపు బాబన్న
9440654583

## వృద్ధ వ్యధ

ఎంత చేసిన
చింత తప్పలేదు
చచ్చి బతికిన
ప్రేమ మనిషిని.

ఉన్నదంతా
ఊడ్చి ఇచ్చితి
చింకి చాపలా
మూల పడితి.

చందమామలా
ఓ వెలుగు వెలిగితి
మంచిచెడుల
తీరు తెలిపితి.

ఎముకలు క్రుళ్లి
వయస్సు మళ్లె
నెత్తుటి వేడి
పరుగు తీయునా!.

కటిక చీకటి
దారులు నడిచితి
వెలుగు ఆశల
పులుగును కంటిని

మితాయి మాటలు
ఊతమివ్వవూ
నిజాల జాబిల్లీ
చేతికందదూ

-రేడియమ్
9291527757

## మరువబోకు యెన్నడు..!

అన్నిచ్చిన ప్రకృతిని
ఆగమాగం చేయకుము..!
అనాలోచిత నిర్ణయాలతో
అంతం చేయబోకుము..!

బతుకునిచ్చిన తల్లిని
బలి కోరబోకుము..!
అవసాన దశలోన
అరిగోస పెట్టకుము..!!

నడక నేర్పిన నాన్నను
నిలువునా కూల్చేయకుము..!

రక్షణ చేకూర్చి తండ్రిని
రందిలా పెట్టబోకుము..!

మెతుకు సృష్టించిన రైతును
మోసము చేయబోకుము..!
ఆకలి దప్పులు తీర్చే కర్షకుల
కడుపు మీద కొట్టబోకుము..!!

విద్య చెప్పిన గురువును
యెన్నడు మరువబోకుము..!
విలువలు బోధించినందులకు
కొలిచి మొక్కుతుండుము..!!

-పసుల.శంకర్
9542181301

## ఆఖరి మెట్టు

కడలి ఒడిలోని కెరటాలు
ఎగిసి పడుతూనే ఉంటాయి!
వాటి ఆరాటం
ఆకాశాన్నందుకోవాలనో...
తీరాన్ని తాకాలనో...

మట్టిలో పుట్టిన చిరు మొలకలు...
ఆకాశం వంక ఆరాధనగా చూస్తూ...
అంతెత్తుకూ చేరాలనే ప్రయత్నంతో
ఎగబాకుతుంటాయి!

రేయంతా కమ్మని
కలల లోకంలో విహరించి...
వాటిని సాకారం చేసుకునేందుకని...

నింగికి నిచ్చెనలు వేసుకుని...
నేలపై పచార్లు చేస్తుంటే...
కలలెప్పటికీ సాకారమవవు...

ఒక్కో మెట్టూ ఎక్కే క్రమంలో...
ఎదురయ్యే అవరోధాలనధిగమిస్తుంటేనే..
ఆఖరి మెట్టు జాడ కన్పిస్తుంది!

ఎప్పుడూ కలల లోక విహారియై...
ఊహా లోకంలో
సంచరిస్తూ ఉండిపోతే...
ఎవరైనా...
తీరం చేరని కెరటాలుగా
మిగిలిపోక తప్పదు!

-వెగ్గలం ఉషశ్రీ
9440370066

## నానీలు

మా నాన్న
మాకు కామధేనువు
అడగకముందే
వరాలు కురిపిస్తాడు.

మానాన్న
ఎంతమంది ఆకలి తీర్చాడో

తనకు తాను
పస్తులుండి.

మా నాన్న
మేలు పర్వతమై నిలబడ్డాడు
బిడ్డల
సంరక్షణకై

-చాపల మహేందర్
9949864152

## నాన్ను నన్ను క్షమించు...!!

(కథ)

చొక్కా లేక మాసిన గడ్డంతో, ముళ్ళు పొదల ఉన్న తల వెంట్రుకలతో, తిండి లేక ఎండి కండ కరిగిన అస్తిపంజరం లాంటి తనువుతో, పట్టుమని 26 ఏళ్లు నిండని ఓ యవ్వన కుర్రాడు కూటికోసం రోడ్డు పక్కనున్న మురికి కాలువలో ఏదో ఓ పని చేస్తూ ఉన్నాడు..

అప్పుడు అతనికి ఆరు అడుగుల దూరంలో టవఇ'వనిబి గా టతిణనితిబిఎ గా వేషధారణ ధరించి, కాళ్లకు బూట్లు తగిలించి, ఈ సువాసనను భరించలేక ముక్కును ఓ గుడ్డతో మూసుకుని, ఇతని వైపు దీటుగా, సూటిగా చూసి అసహ్యించుకుని, చక్రాల తగిలించిన మానవ యంత్రము వలె పరుగులు తీస్తున్నాడు.. అతన్ని అలా చూసిన ఈ కుర్రాడికి తన పాత జ్ఞాపకాలు భూమి మీద పడిన వర్షపు చినుకుల స్పర్శకు మొలకెత్తుతున్న విత్తనం వలె గుర్తుకొస్తున్నాయి...

నాన్న!! నువ్వు మండే ఎండలో రక్తపు స్వేదాన్నీ చిందించి అలసిన యంత్రముల బలిసిన వారి కింద, బానిస పనులు చేస్తూ, నీ మాసిన బ్రతుకును తలచి చింతిస్తూ, నీ కష్టాన్ని మా ఇష్టాలకు ఖరీదుగా కడుతూ, నీ బరువెక్కిన భారమైన బ్రతుకు వలె మా భవిష్యత్తు కాకూడదని, ఎలాగైనా మా తలరాతలు మార్చాలని, దానికి మార్గం చదువు ఒకటేనని గ్రహించిన నీవు.

ప్రైవేట్ కాలేజీలో చదివితే తొందరగా ఉద్యోగాలు వస్తాయని

మీ షావుకారి కొడుకు ఎక్కడో పట్టణంలో ప్రైవేట్ కాలేజీలో చదువుతున్నాడని, స్తోమత లేకున్నా ఆర్థిక ఇబ్బందులున్నా.

నన్ను మారుమూల ప్రాంతం నుంచి పట్టణానికి పంపించావు నేను గొప్పొన్ని అవుతానని ఆశతో, ఆశయంతో చెల్లి పెళ్లి కోసం పొదుపు చేసిన పైసలు కట్టి నన్ను ప్రైవేట్ కళాశాలలో చేర్పించావు.

బలిసిన వారి బాబులు వారి కొడుకులకు కోరిందన్ని కొనిచ్చారని, వారి ముందు నాకు అవమానం జరుగుతుందేమోనని గ్రహించి మెతుకులు తినే సమయంలో కూడా కష్టపడి,చదువు కోసమే కదా అని కోరినవన్ని కొన్ని తెచ్చావు ఈ కొరువు పెట్టే కొడుకు కోసం, నీ నిద్రను త్యాగం చేసి నాకు ప్యాకెట్ మనీ ఇచ్చావు. నీవు ఎండలో కష్టపడి నన్ను నీడలో చదివించావు, నీ పాదాలను నాకు బూట్లుగా అల్లావు, నీ కాళ్ళను నా మోటార్సైకిళ్లుగా చేసావు, నీ తనువును నాకు మెత్తటి పరుపుగా చేసావు, కష్టం తెలియక కాయం కరిగింపక నన్ను రాజకుమారుని వలె పెంచావు..

ఇన్ని ఇచ్చిన నీకు నేనేమిచ్చాను?!

పాఠాలు వినక, కళాశాలకు సరిగ్గా పోక, స్నేహితులతో విహారయాత్రలు తిరుగుతూ నీ పైసలుతో స్వర్గ సుఖాలు అనుభవించాను. మందేస్తూ, చిందేస్తూ సినీ థియేటర్‌లో సిటీ కొడుతూ, సిగరెట్ వెలిగిస్తూ తాత్కాలిక సుఖాలకు పుప్పుటి కోసం పూలు చూట్టు తిరిగే తేనేటిగలా బానిసయ్యాను..

కొవ్వెక్కి లవ్వంట్టూ చేతులు మొత్తం కోతలు వేసుకుని ఆమె చుట్టూ తిరిగాను. ప్రశ్నించిన అమ్మను తిడుతూ నిందించిన చెల్లిని కొడుతూ, నిలదీసిన నీకు కన్నీటిని బహుమానంగా అందించి ఆ కన్నీటికి కాలువ తీసి అందులో నీ ఆశయాలను పాతి పెట్టాను...

నీ కష్టం మొత్తం కాలిన ఇనుముపై పడి ఆవిరైన పన్నీటి బిందువయ్యింది, కడలి ఉదకము నందు కలిపిన పంచదార, తేనె అయ్యింది.. ఆరోజు నేను చేసినది తప్పని చెప్పిన అర్థం కాలేదు. దానికి ప్రతిఫలం ఈరోజు ఈ స్థితిలో దుఃఖాన్ని అనుభవిస్తుంటే అర్థమయ్యి ప్రయోజనం లేదు. ఎందుకంటే నా జీవితం ఇప్పటికే అర్థమై వ్యర్థమయ్యింది కదా. కాలిన బొగ్గు మళ్ళీ తన పూర్వపు కర్ర ఆకారము పొందునా.

నన్ను ఈ జన్మకు క్షమించు నాన్నా! నిన్ను మోసం చేస్తూ నన్ను నేను మోసం చేసుకున్నందుకు కాలం నాకు కఠిన శిక్షే వేసింది.

నా అనే వారు దూరమయ్యాక తెలిసింది, నడి సముద్రంలో ఈత రాక నగ్నంగా మునిగిన నిజం నేనని. మళ్లీ జన్మంటూ ఉంటే నీ కొడుకు గానే పుట్టి నా తప్పును సరిదిద్దుకునేందుకుప్రయత్నిస్తానాని ఆలోచిస్తూ.. పాపాలతో కూడుకున్న ఆ మురుకి కాలువలో తనవంతు ఒక కన్నీటి బొట్టును చిందించి అందులో కలిపేశాడు. ఇంతలో తన పక్కనున్న స్నేహితుడు "అరేయ్ భోజనానికి సమయమయ్యింది, అసలే ఈ రెండు రోజుల నుంచి పని లేక నీకు భోజనం లేదు కదా! ఉదయమే ఆకలన్నావుగా రా వెళ్దాం'' అని పిలుపునిచ్చాడు.

-సి. శ్రీకాంత్
9391702574

## విధి వంచితులు

వలవల వగచే వలస కార్మికులు
విలవిల లాడే విగత జీవులు
దారి తెన్ను తెలియని ప్రాణులు
విధి చేతులో కీలుబొమ్మలు.

కల్లాకపటం తెలియని మనసులు
కాలే కడుపుల కష్ట జీవులు
కన్నీటి కడలిలో కదిలే కెరటాలు
తీరం వెతికే వలస కార్మికులు.

గూడు లేని ఒంటరి పక్షులు
గాలికి ఎగిరే గాలిపటాలు
గమ్యం లేని బాటసారులు
గతి తప్పిన వలస కార్మికులు.

సొంత ఊరికి చేర లేక
ఉన్న ఊరిలో పనీ లేక
మృత్యువు కోరలో చిక్కుకున్న
జీవశ్చవాలు వలస కార్మికులు.

-కందాళం రజనీరాణి
బ్రిస్బేన్ - ఆస్ట్రేలియా
చరవాణి:- 9487708043

## అమ్మ నువ్వెక్కడ

అమృతనమే దూరమయ్యింది
జగతి భవిష్యత్తుకు
అమ్మ మూలమని మరచింది
అందమంటే మక్కువయ్యింది
సంపాదనకు బానిసాయ్యింది
కడుపుకోత కు దూరమయ్యింది
అద్దె గర్భం కానుకయ్యింది
నవమాసాలకు దూరం అయ్యింది
ఎవరో తెలియని తల్లి గర్భం
బిడ్డకు జన్మదాత అయ్యింది....

-పి.విశాలాక్షి..
9908435805.

## బ్రతుకు చౌరస్తా

ఆకాశంలో ఎన్నో తారలు
దారి చూపే ధృవతార
ఏదో తెలియక
బ్రతుకు చౌరస్తాలో నిలబడ్డాను!

ఎన్నో ఆలోచనా తరంగాలు
నా అంతరంగమేంటో చూసే
లోచనాలు లేక
తత్తరపాటుతో కూడిన చూపులు!

అవకాశాలు ఎన్ని ఉన్నా
అందుకునేంత ఎత్తుకు ఎదగని
నా కురుచతనం
నన్నిక్కడే నిలబెట్టింది!

ఉపాధి అవకాశాలు చూసుకోలేని
ఉద్యోగం లేని నిరుద్యోగిని!
పద్మవ్యూహం తెలిసినా
బయటపడని అభిమన్యుడను!!

-జగ్గయ్య.జి
9849525802

# బీఎన్ జీవితం..స్ఫూర్తిదాయకం

సభలో ప్రసంగిస్తున్న జస్టిస్ బి.చంద్రకుమార్

తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధులు భీమిరెడ్డి నర్సింహారెడ్డి (బీఎన్)జీవితం రాజకీయ, సామాజిక ఉద్యమాలకు స్ఫూర్తిదాయకమని ఎం సీపీఐ(యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ అన్నారు. బీఎన్ శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం ఎంసీపీఐ (యూ) ఆధ్వర్యంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం-రాజకీయ అంశాలపై బీఎన్ ప్రభావం అనే అంశంపై ప్రత్యేక సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రముఖ కవి జయరాజు, పూర్వ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్, కందిమళ్ల ప్రతాపరెడ్డి, సీపీఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, న్యూడెమోక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గసభ్యులు కె. గోవర్ధన్, చలపతిరావు, అరుణోదయ విమలక్క తదితరులు పాల్గొన్నారు.

## పెన్షనర్ల, ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తా-కేంద్ర మంత్రి జి. కిషన్ రెడ్డి

డైరీ, క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి తదితరులు.

రాష్ట్రంలో పెన్షన్‌దారులు, ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి హామీ ఇచ్చారు. సోమవారం తెలంగాణ రిటైర్డ్ ఎంప్లాయీస్ అండ్ టీచర్స్, అసోసియేషన్ (ట్రేటా) రూపొందించిన డైరీ, క్యాలెడర్‌ను జి. కిషన్‌రెడ్డి తన నివాసంలో ఆవిష్కరించారు. ట్రేటా అధ్యక్షుడు ఎన్.రాములు ముదిరాజ్, జయంత్‌రెడ్డి, బాలచందర్, రవిశంకర్, ఎం. అంజిరెడ్డి, అనిరుద్రరెడ్డి, ముత్కంరెడ్డి పాల్గొన్నారు.

## గాయని సుశీలమ్మకు సత్కారం

ప్రఖ్యాత సినీ నేపథ్యగాయని పి. సుశీలమ్మను సోమవారం సత్కరించారు. అనంతరం శతాభిగాయకుడు ఘంటసాల పేరిట రూపొందించిన పుస్తకాన్ని బహూకరించారు. కిన్నెర ఆర్ట్స్ నాదవినోద సంగీత అకాడమీ నిర్వహించిన కార్యక్రమంలో ప్రభుత్వ రిటైర్డు ఉన్నతాధికారులు రాధాకృష్ణ దంపతులు, చల్లా సుబ్బారాయుడు దంపతులు పాల్గొన్నారు

పుస్తక సమీక్షలు

# గొప్ప అనుభూతిని పంచే అబాబీలు...!




**అంతరిక్షాన అడుగుపెట్టిన**
**సంబరాలు అంబరాలకు..**
**మనిషితనం మచ్చుకైనా లేదు**
**పొరుగొంట్లో పస్తులుంటే నీకు**
**పరమాన్నమా?** అంటూ ప్రశ్నిస్తూ.. సామాజిక చైతన్యమే పరమావధిగా కవయిత్రి, రచయిత్రి, అనువాదకురాలు, సామాజిక కార్యకర్త, ఆలిమా ధార్మిక పండితురాలు శ్రీమతి బతూల్ హుమైర్వీ "విసుర్రాయి" పేరుతో తమ తొలి కవితా సంపుటిని 'అబాబీలు' ప్రక్రియలో ప్రకటించి అందరి దృష్టినాకర్షించడం అభినందనీయం. ఇస్లాంవాద సిద్ధాంతాలను ఆలంబనగా చేసుకుని.. కవయిత్రి హుమైర్వీ మృదు మధుర భావాలను చోటు కల్పిస్తూ రాసిన ఇందలి అబాబీలు అందరినీ ఇట్టే ఆకట్టుకుంటాయి. హృదయాలను తట్టి లేపుతాయి. ఇస్లాంవాద కవి కరీముల్లాగారు రూపొందించిన (మినీ కవితలు) అబాబీలు ప్రక్రియ అనతి కాలంలోనే గ్రంథాల రూపంలో వెలువడటం ఆహ్వానింపదగినది. జీవితాల్లోంచి.. జీవితానుభవాల్లోంచి ఆవిష్కృతమయ్యే అబాబీలు.. సామాజిక రుగ్మతలు రూపమాప దోహదపడతాయి. కవయిత్రి హుమైర్వీగారి కవితల్లో ఆమె ఉత్తమ సంస్కారాన్ని ఉన్నత వ్యక్తిత్వాన్ని అడుగడుగునా చూస్తాం.. నైతిక విలువలకు పట్టం కట్టాలన్న ఆమె ఆరాటాన్ని గమనిస్తాం. సమాజంలోని అసమానతలను.. అక్రమాలనను.. అన్యాయాలను ఎంతో సంయమనంతో కవయిత్రి తమ అబాబీల్లో ఆవిష్కరించారు. మనిషి యొక్క ప్రాపంచిక జీవితం భావ స్ఫోరకంగా ఉండాలని ఆకాంక్షిస్తూ ఆమె రాసిన కవితలు చైతన్య దీపికలుగా పనిచేస్తాయి. ఇస్లాం వాదంలోని గొప్పదనాన్ని.. చక్కగా ప్రస్తావిస్తూ ఇందలి కవితలకు అక్షరాకృతినిచ్చారు. ముస్లిం మహిళల పక్షాన నిలిచి.. వారికి సాంత్వన కలిగించేలా ఎంతో సంయమనంతో.. బాధ్యత గల దేశ పౌరురాలిగా ఆమె ప్రకటించిన భావాలు కొన్ని ప్రశంసనీయంగా ఉన్నాయి. మరికొన్ని ఆచారణాత్మకంగానూ.. అనుసరణీయంగానూ ఉన్నాయి. అవమానాలకు.. అవరోధాలకు.. కృంగిపోవద్దని ఆమె అబాబీలు హితబోధ చేస్తాయి.

**విద్వేషం, విచ్ఛిన్నం**
**విసుర్రాయిల విన్యాసాలు**
**స్నేహం, సౌభ్రాతృత్వాలతో**
**బతూలా!**
**రాళ్లను రహదారిగా మలుచుకో"**

అంటూ హితవు పలుకుతూ కవయిత్రి ఈ గ్రంథంలో అనేక సందేశాత్మక కవితలకు చోటు కల్పించారు. ఇస్లాం ఒక జీవన వ్యవస్థ అనీ.. ప్రత్యేక జీవన విధానమనీ.. ముస్లిం సమాజం శ్రేష్టమైందని వివరిస్తూ కవయిత్రి తమ కవిత్వాన్ని అబాబీలు (మినీ కవితలు) ప్రక్రియలో ఆలోచనాత్మక భావాలతో ఆవిష్కరించారు. నైతికతా విలువలకు దృక్పథాలకు దర్పణంగా నిలిచే దేదీప్యమాన ధర్మమనీ.. అటువంటి విలువలు విశ్వాసాలను విస్మరిస్తున్న నేటి ముస్లిం సమాజాన్ని జాగృత పరచడానికి.. ఆమె చేసిన కృషి ప్రశంసనీయం. దారి తప్పుతున్న సమాజాన్ని సంస్కరించడంతో పాటు.. మిగతా ప్రపంచానికి మనిషి యొక్క జీవిత పయనం ఏమిటో.. వాస్తవ గమనం ఏమిటో తెలియ పరచడం అబాబీల ప్రత్యేకత అని కవయిత్రి వివరించిన తీరు బాగుంది. నేడు సమాజంలో జరుగుతున్న అలజడిని ఎత్తి చూపేందుకు అబాబీలు ఎంతగానో దోహదపడగలదన్న అభిప్రాయాన్ని సొంతం చేసుకున్న ఆమె ఇందలి కవిత్వంలో బాధ్యాయుతంగా తమ భావాలను ప్రకటించారు.

కవయిత్రి బతూల్ హుమైర్వీగారి మాతృభాష ఉర్దూ అయినప్పటికీ.. తెలుగు భాషపై ఆమెకున్న పట్టును అభినందించి తీరుతాం.

**సాంకేతిక విజ్ఞానం ఆకాశంలో**
**మానవతా విలువలు**
**పాతాళంలో**
**సహ జీవనం పేరిట సంస్కారాలు**
**బతూలా!**
**అనైతిక మార్గాలకు సోపానాలు!**

అంటూ కవయిత్రి సహజీవనం పేరిట జరుగుతున్న ఆకృత్యాలపై ధ్వజమెత్తారు. గత పన్నెండు సంవత్సరాల నుండి జమా అతే ఇస్లామిక్ హింద్ క్రియా శీలక వివిధ బాధ్యతల్లో సభ్యురాలిగా కొనసాగుతున్న ఆమె.. మహిళా చైతన్యానికి చేస్తున్న కృషి అభినందనీయం..

పౌష్టికాహారం కరువైన దేశంలో
శాఖాహారమే సమగ్రమనే
శాసనాలు.. అంటూ ఆహారపు అలవాట్లపై అదుపు చేస్తున్న రాజకీయాలను ఎండగడుతూ కవయిత్రి తమ అభిప్రాయాలను నిర్మొహమాటంగా ప్రకటించారు.

**లజ్జా విహీనుల లాభాలు**
**అతివల అందాల పోటీలు**
**అశ్లీలాలకై అర్రులు చాచే విపణి**
**బతూలా!**
**ఆడదంటే ఆటబొమ్మ కాదని**

చెప్పుమంటూ హితవు పలికారు.

దేశంలో ఉద్యోగం, ఉపాధి కరువై యువత పడుతున్న వ్యథలకు అద్దం పడుతూ..

**ఆకలి సూచీలో అగ్రస్థానం**
**అప్పుల కుప్పగా భారతయానం**
**నిరుద్యోగ నిప్పుల కుంపటిలో**
**బతూలా!**
**యువత బుగ్గి పాలవుతోంది!**

అంటూ వాపోయారు.

**ఒంటికి అత్తరు, కంటికి సుర్మా**
**ప్రతిబింబాలు కావు కలిమా..**
**వేషం కన్న వ్యక్తిత్వమే మిన్న**
**బతూలా!**
**తలగడ టోపీలతో మోసపోకు**

అంటూ మరో అబాబీ ద్వారా సూచించారు.

**కొట్టాల్లో పశువులు**
**ఫారాల్లో కోళ్లు**
**బుల్లి పెట్టెలో అంగాంగ**
**ప్రదర్శనలు బతూలా!**
**స్త్రీ జాతి స్వేచ్ఛకు సంకేతం ఇదేనా?** అని మరో అబాబీలో నిలదీవారు.

బంధాలను- అనుబంధాలను బలపరచాలని కాంక్షిస్తూ..

నైతిక విలువలు వావివరుసలు నాస్తి
స్వార్థపీఠమే సమాజానికి ఆస్తి
అనురాగం ఆప్యాయతలతో
బతూలా!

బంధాలను బలపరిచి చిరకాలం జీవించుమని ఇంకొక అబాబీలో హితవు పలికారు.

**మరో అబాబీలో..**
**అదనపు భారమేసి**
**ఆధునిక స్త్రీ అంటున్నారు**
**అంగాంగాల వస్తువును చేశారు**
**బతూలా!**
**చర్నాకోలా అందుకో** అంటూ పురమాయించారు.

**అణుకువ నీ అసమర్థత కాదు**
**ఆదరణనీ అమాయకత్వం కాదు**
**ఆకాశము నీ హద్దు కాదు**
**బతూలా!**
**నువ్వు అబలవుకావు సబలవే!**

అంటూ అతివల్లో స్వాభిమానాన్ని నింపారు.

**మరో అబాబీలో..**
**చాదరులో స్వర్గాన్వేషణ**
**పేదోటి చలిలో నిద్రాన్వేషణ**
**స్వర్గం సోమరులకు కాదు**
**బతూలా!**
**దాతృత్వంతో దైవ ప్రసన్నతను పొందు** అంటూ హితవు పలికారు.

ఆంగ్ల భాషా వ్యామోహంలో పడి మనభాషకు దూరమవుతున్నామంటూ.. ఇంకొక అబాబీల రూపుదిద్దారు.

**గుడ్‌మార్నింగ్ గుడ్‌నైట్‌లతో**
**చిన్నబోయింది సలామ్**
**తెల్లోడి సంస్కృతి**
**బతూలా!**
**మనల్ని చేసేసింది గులామ్!**

అంటూ వ్యాఖ్యానించారు.

**జీవితం క్షణభంగురం**
**ప్రతిక్షణం మధుర వీక్షణం**
**పరలోక పయనమే విశ్వాసి లక్షణం**
**బతూలా!**
**ప్రాపంచిక ప్రగల్భాలు పరిత్యజించుమంటూ** కవయిత్రి తమ తాత్త్వికతను ప్రకటించారు.

ఇలా.. 'విసుర్రాయి' సంపుటిలో ఎన్నో కవితా పంక్తులు ఉదహరించదానికి యోగ్యంగా ఈ సంపుటిలో ఉన్నాయి. అయితే కొన్ని అబాబీల్లో కవయిత్రి ప్రకటించిన భావాలతో అందరూ ఏకీభవించక పోయినప్పటికీ..నిర్మొహమాటంగా.. మనసులోని ఆలోచనలకు ఆమె అక్షరాకృతినివ్వడాన్ని అభినందించి తీరుతాం..

ముమ్ముందు సమాజహిత రచనలు ఆమె కలం నుండి జాలువారాలని కోరుకుందాం.

ప్రతులకు:హుస్నాబతూల్
వై/ఆఫ్. మహ్మద్ జహీద్
డో.నెం. 17-2-83/బి
ఆనంద్‌పేట
సుద్దపల్లి డొంకరోడ్
ఎం.ఎం.ఫౌల్ట్రీఫార్మ్ దగ్గర
గుంటూరు-522 003
సెల్: 98489 10901

**- దాస్యం సేనాధిపతి**
సెల్: 94405 25544

## కవితా మొగ్గలు

ఆలోచనలు అలుగు దూకుతుంటే ..
మూడు పంక్తుల్లో భావాన్ని ముకుళించుకునేవి మొగ్గలు.
మిత అక్షర సమూహమైనా, అపరిమిత తలపుల గుభాళింపు 'మొగ్గలు'.

మూడు పంక్తి రెక్కలతో ముడుచుకొన్నా..
ముక్కోటి వికాస పుప్పొడి రేణువులు గలవి మొగ్గలు.
ఆలోచనా ప్రత్యుత్పత్తి పుప్పొడి కవితా మొగ్గల్లోనూ కలదు !

భాషా తేనియలు తమలో నింపు కొని..
పండిత భ్రమరాలను ఆకర్షిస్తున్నవి కవితా మొగ్గలు
విప్పారకనే మెప్పుపొందు మన తెలుగు 'మొగ్గలు'

**- సుధీంద్ర భార్గవ**
9949120690

# విందు విలాసా(పా)లు

వరుస తవ్వకాలతో ఏదో ఒక రోజు నేలమట్టం కావచ్చని తెలియక తన ఎత్తును చూసి పొంగిపోయే కొండకు మిడిసిపాటు సహజం. ఉన్నదానికన్నా కుంగడానికి ఇంకేమీ లేని లోయకెందుకు ఉలికిపాటు. అవసరమా లోయకు కొండతో పోటీ? పులిని చూసి నక్క వాతలు పెట్టుకున్నట్లు, 'ఉన్న' వారితో పోల్చుకుంటూ అంతంత మాత్రమే ఉన్న దిగువ, మధ్యతరగతి వారు కూడా ఒకరిని మించి ఒకరు తమ తాహత్తుకు పొంతన లేని అనవసర పోకడలతో విందులు ఏర్పాటు చేయడం ఈ రోజుల్లో తరచూ పరిపాటి. సందర్భం ఏదైనా విందులతో పాటు చిందులు (విలాసాలు) తప్పనిసరిగా మారాయి. దురదృష్టం ఏమిటంటే సంప్రదాయంగా నిర్వహించాల్సిన శ్రాద్ధాలకు, గుంభనంగా కుటుంబ పరిధిలోనే నిర్వహించాల్సిన ఇతరత్రా పవిత్రమైన కార్యాలకు కూడా విందుల శని పట్టుకుంది!

పుట్టినరోజు, పెళ్లిరోజులతో సరిపుచ్చుకోక పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయెన్నో ఎప్పుడూ కనీవినీ ఎరుగని పండుగలు. సంవత్సరం పొడుగూతా మామూలుగా వచ్చే పండుగలు, పబ్బాలు సరే సరి. ఇవే గాక గ్రహాలు అనుగ్రహించేవి మరికొన్ని! సత్తా ఉన్నవారికి సంవత్సర కాలమూ పండుగలే పండుగలు, విందులే విందులు. పండుగ అంటే విందు భోజనాలే కదా!

## 'అతిథి దేవో భవ!'

వడ్డించేది అరటి ఆకులోనైనా, బంగారు పళ్లెంలోనైనా తిండి రుచి మారదు. వడ్డించేవాడి తాహత్తు తప్ప ఆత్మీయత ఇనుమడించదు. ఆడంబరం తప్ప అనుబంధం గోచరించదు. డాంబికం ప్రదర్శనే ప్రధానంగా ప్రస్ఫుటం. 'అతిథి దేవో భవ!' అనేది ఉచ్చారణకే తప్ప మనసా, వాచా, కర్మణా ఏ కోశానా ఆచరణలో కానరాని ఆధునిక కాలమిది. 'పప్పన్నం'తో పది మందికి భోజనం' వడ్డించడం లాంటివి నెమరు వేసుకోవాల్సిన రోజులివి. ఆశీర్వచనాలకు కాదు, కొత్త ఆదాయ మార్గాలను వెదికే విందులివి. స్వార్థమే తప్ప మరే అర్థం లేని వ్యవహారాలు ఈ విందుల జిమ్మిక్కులు. అరువు తెచ్చిన ఎరువును బురద మడుగులో చల్లినట్లు, పైసా లేనివాడిని కూడా లేని పోని ప్రతాపాలకు ఉసికొల్పే ఉల్కలు.

ఆర్థిక, సామాజిక ఎదుగుదలకు సమాంతరంగా మనిషికి ఏదో ఒక సందర్భం పేరిట విందు ఏర్పాటు చేయాలనే తపన. అవును... విందులు చేయాలి. సమాజంతో మమేకం కావాలి. తన ఎదుగుదలను సంతోషంగా పదిమందితో పంచుకోవాలి. కానీ మరచిపోవద్దు, ఆతిథ్యానికి అభిమానం కొలమానమని. విందుకు విలువ ప్రమాణం, పరిమాణం కాదని. ఉన్నంతలో ఏర్పాటు చేస్తేనే ఉన్నతంగానూ, గౌరవంగానూ ఉంటుంది. ఉదర స్వాగతం కన్నా ఆత్మీయ ఆలింగనం శ్రేష్టం.

సన్నిహితులకు, బంధుమిత్రులకు విందు ఇవ్వడం సర్వ సామాన్యం. కానీ అహర్నిశలు మన ఉన్నతికి కృషిచేస్తూ మన చుట్టూ అంటిపెట్టుకుని ఉన్న పని వారిని సైతం అతిథులుగా భావించి, వారిని కూడా కలుపుకొని ఇచ్చేదానికి ఎక్కువ పరమార్థం. సందర్భమేదైనా ఉన్నవాళ్లు ఉన్నవాళ్లకిచ్చే విందుకన్నా దీనులకు, నిస్సహాయులకు (పేద వారికి కాదు), అనాథలకు ఇచ్చే విందును తథాస్తు దేవతలు కూడా ఆస్వాదిస్తారు. అన్ని వేడుకలు కాకపోయినా, కొన్ని విందులు అనాథ శరణాలయాలలో, సత్రాలలో (కుల సత్రాలు కాదు) ఏర్పాటు చేస్తే పుణ్యం పురుషార్థం రెండూ సిద్ధిస్తాయి. ఆకలికి అన్నం, వేదనకు ఔషధాన్ని మించిన అమృతం లేదంటారు కదా!

## ఉన్నంతలో మెదిలితే మేలు!

నేటి పొదుపు రేపటి బలం. ఏదైనా ఉన్నంతలో మెదిలితే మేలు! వేదిక వైశాల్యమెరిగి చేసేదే మంచి నాట్యం. పైకి ఎదగాలనుకోవడంలో తప్పు లేదు. కానీ 'సూపర్ మ్యాన్'లా ఆకాశహర్మ్యం పై అంతస్తు నుండి అమాంతంగా గాలిలోకి ఎగరడానికి ప్రయత్నించడం అవివేకం. అనుకరణ సైతం అన్ని విషయాల్లో వాంఛనీయం కాదు. ఎవరెస్ట్ ఎక్కే ముందు చిన్న చిన్న కొండలు ఎక్కే ప్రయత్నం చేయాలి. ఏరు దాటడమే చేతకాని వాడు ఏకంగా సముద్రాన్నే ఈదాలనుకున్నట్లు, తాహత్తుకు మించిన 'దావత్'లు సాహసమే! అవసరమా?

మనిషి నైజం చాలా విచిత్రం. పండు కావాలని కోరుకుంటే చాలు ముళ్ల చెట్టైనా ఎక్కడానికి వెనుకాడడు. పట్టుదల మంచిదే కానీ దానికి తగిన పరిశ్రమ లేకుంటే అడ్డదారులు తొక్కడానికి, అవినీతికి పాల్పడడానికి బీజం పడేది ఇక్కడే. పొదుపు సూత్రం గాలికి వదిలేసి ఇలాంటి అక్కరకు రాని అవసరాలకు ఎంత అప్పు చేయడానికైనా వెనుకాడని గొప్ప నీతి మానవుడిది.

మనం నిత్యం కొలిచే వేంకటేశ్వర స్వామి తన పెళ్లికి కుబేరుని వద్ద తెచ్చిన అప్పుని, భక్తులు ఎన్ని కానుకలు, ముడుపులు చెల్లించినా, ఇంకా తీర్చలేక వడ్డీ చెల్లిస్తున్నాడని పురాణాలు ఘోషిస్తున్నాయి. అందుకే స్వామికి వడ్డీ కాసుల వాడని పేరు! మరి మీరు చేసిన అప్పుకు ఎవరిని బాధ్యులు చేస్తారు? పరిస్థితులు సహకరించనప్పుడు అప్పు చేసి పప్పు కూడు వడ్డించడం అవసరమా? దానం చేయడం అన్ని వేళలా పుణ్య కార్యం కాదు, అది ఏ అవిటి వారికో, నిస్సహాయులకో అయితే తప్ప. అభివృద్ధి పేరిట అప్పులు చేసి పేదలకు పంచడం, వారిలో సోమరితనాన్ని పెంచడమే కానీ పేదరికాన్ని తుంచడం కాదు.

**స్వార్థమే తప్ప మరే అర్థం లేని వ్యవహారాలు ఈ విందుల జిమ్మిక్కులు. అరువు తెచ్చిన ఎరువును బురద మడుగులో చల్లినట్లు, పైసా లేనివాడిని కూడా లేని పోని ప్రతాపాలకు ఉసికొల్పే ఉల్కలు.**

ఆవిరి ఘనీభవించిన మేఘం మళ్లీ కరగి వర్షించినట్లు..

ఐశ్వర్యవంతులు చేసే విందులు ఎంతో ఆడంబరంగా ఉంటాయి. అది సహజం. ఉండాలి కూడా. ఆవిరి ఘనీభవించిన మేఘం మళ్లీ కరగి వర్షించినట్లు, వారు కూడబెట్టిన ఆదాయంలో కొంతైనా ఏదో ఒక రూపంలో మళ్లీ విడుదలై మార్కెట్లో చలామణిలోకి వస్తుంది. రావాలి కూడా. ఎందరికో ఆ విందుల వలన జీవనోపాధి లభిస్తుంది.

నేటి రోజుల్లో విందులంటే విలాసాలకు వేదికలు. నిస్సందేహంగా అలాంటివెన్నో (అన్నీ కాకపోవచ్చు) నాగరికతను నట్టేట ముంచేవిగా, సనాతన సంస్కృతిని వెక్కిరించేవిగా మారాయి. తినేది తక్కువ తగిలేసేది ఎక్కువ. రుచి, శుచి సంగతి దేవుడెరుగు.. వడ్డనకు మాత్రం వంద రకాల తిండి పదార్థాలు. వాటికి తోడు 'తాగుడు మూతలు' లేకుండా విందుకు ముగింపు ఉండదు. 'ద్రవ తారల' విందుల్లో ద్రవ్యానికి లేదు కొదవ! ఆతిథ్యం ఇచ్చేవారి అంతస్తుకు తగినట్లు అతిథులు సేవించే ద్రవాల గుణాలకు గణనీయ గుణకారం. సరఫరా సరిపడా.. పుచ్చుకునే వారికి పుచ్చుకున్నంత! నిశ్చింత వాతావరణంలో 'నిషా' కుషీలు.

పంచుకుంటే పదింతలవుతుందంటారు సంతోషం. విందు ధ్యేయం అదే కావాలి. విలాసం జోడిస్తే ధ్యేయం మారిపోతుంది. వికారమైన విత్త ప్రదర్శనకు ('వల్గర్ ఎగ్జిబిషన్ ఆఫ్ వెల్త్') వేదిక అవుతుంది. దాంబికానికి, దర్పానికి దర్జాగా పరదా లేపినట్లవుతుంది. ఇది ఒక పార్శ్వం. ఇంకో దిశలో ఆలోచిస్తే.. ఇలాంటి వాటి వలన కొన్ని కుటుంబాలకు ఆలంబన దొరుకుతుంది. ఒకరి ఆడంబరం జీవన విధానం మరొకరి జీవనానికి ఆలంబనం. వేదిక అలంకరణ మొదలుకొని వంటావార్పు వరకు సంబంధించిన వారి కుటుంబాలకు జీవనాధారం అవుతుంది. ఇక మరో కోణంలో నుంచి వీక్షిస్తే.. విందులతో వినోదం కలుగుతుంది. అంగడి బెదిరితే దొంగలకు లాభం! వినోదానికి విలాసం తోడైతే, అనేక అనైతిక, నిషేధిత (మాదక ద్రవ్యాల) వ్యాపారాలకు మార్గం సుగమం. ఆ మత్తు ఉచ్చులో చిక్కుకొని బలహీనులెందరో బలిపశువులయ్యే అవకాశం. సర్వత్రా ఇలానే ఉండకపోవచ్చు. కానీ ఏ కొన్ని చోట్ల ఇవి జరిగినా ప్రమాదమే కదా.

నైతికమో, అనైతికమో... ఇలాంటి విందులు ఎన్నో ఒప్పందాలకు ఆదర్శ వేదికలు. కొన్ని ప్రత్యేక వ్యాపార లావాదేవీలకు అనువైన సందర్భాలు. మందు లేని విందులు ఈ రోజుల్లో ఉన్నాయంటే ఆశ్చర్యమే. దురదృష్టం ఏమిటంటే వీటితో ప్రభుత్వ ఖజానాకు లాభం, ఏర్పాటు చేసేవాడి జేబుకు బొక్క. 'ఒకరికి ఖేదం.. ఒకరికి మోదం..' అన్నట్లు ఇది అందరికీ తెలిసిన వినోదం! ఇదే నేటి విందు-విలాసా(పా)ల మాయాజాలం. ఏదైతేనేం.. అనుమతికి, అనైతికానికి సంధి కుదిరిన విచిత్రమైన సందర్భం! విందుకు వేంచేసి సందర్భాన్ని పావనం చేసిన అతిథి దేవుళ్లకు మాత్రం ఆ విందు అట్టహాసం గుర్తుండేది ఎంత కాలం? ఆరగించింది అరిగే వరకు.. పుచ్చుకున్నది దిగిపోయే వరకు!

## వేడుక ఏదైనా ఘనంగానే...

శుభకార్యం అంటే పప్పన్నం పెట్టే రోజులు పోయి, 'పబ్'ను తలపించే పద్ధతులు రాజ్యమేలే రోజులు వచ్చాయి. తాహత్తు పెరిగిన వారికి తాయెత్తుతో పని లేదు. పొంగి పొర్లిపోయేటంత ఆత్మ విశ్వాసం వారిది. ప్రతి విందును తమ వ్యాపారానికి అనుగుణంగా మలుచుకునే సమర్థులు వారు. పెట్టిన దానికి ఎన్నో రెట్లు తిరిగి పొందగల దక్షతనెరిగిన నిష్ణాతులు వారు.

అసహజంగా, అసహ్యంగా ఉండకుండా, సందర్భాన్ని బట్టి కొన్ని మార్పులు చేయడం అవసరం. వేడుక ఏదైనా ఘనంగానే జరిపించడం ఈ రోజుల్లో భారతీయ సంస్కృతిలో భాగమైపోయింది. ఆర్థిక స్తోమతను బట్టి, సామాజిక సంప్రదాయాలకు లోబడి ఉన్నంతలో ఏది జరిపించినా గౌరవప్రదమే. కానీ అట్టహాసం పేరిట తలకు మించిన సర్కస్ తలపెడితేనే సమస్య. గౌరవం కూడా అనిపించుకోదు. సత్తువ లోపించినప్పుడు చతికిలబడటంలో తప్పులేదు. జీవితాంతం నటిస్తూ గడపడం అవసరమా? సమాజ నడవడికి కొన్ని పట్టింపులు, ప్రాతిపదికలు ఉన్నాయి. వాటికి మారు పేరు.. నీతి నియమాలు. డబ్బు, హోదా ఉండి చట్టమే చుట్టమైన వారికి ఏ అడ్డూ కాని ప్రహసనాలు. ఏమీ లేని వారికి అవి దాటకూడని కట్టుబాట్లు.. లక్ష్మణ రేఖల్లాంటి సమాజ రేఖలు. "Morality... thou art not the day, thou art not the night, but thou art the dusking welkin at twilight!" తాత్త్వికంగా చెప్పాడో ఆంగ్ల కవి. నైతికత అంటే ఓ పగలూ కాదు, రాత్రీ కాదు. అదొక సంధ్యా కాలంలో అగుపించీ అగుపించని ఆకాశం! సులభ రీతిలో అనిర్వచనీయం. పాము-కప్పల విషయంలో న్యాయాన్యాయాల నిర్ణయ మీమాంస!

సమాజంలో భాగమైన మనిషి మనుగడకు ఎన్నో 'వాదాలు' పుట్టుకొచ్చాయి. అన్నీ ఆదర్శ వాదాలే. దేని తీరు దానిదే! ఏ వాదం ఎలా ప్రవచించినా అపాత్రదానంతో ఆర్థిక సమతుల్యత సాధించడం అసాధ్యం. చేపలు ఇవ్వడం కన్నా చేపలు పట్టడం నేర్పించడం ద్వారా స్వయం సమృద్ధి సాధించవచ్చు. జనాలను మార్చాల్సింది 'పరాన్నజీవులుగా' కాదు 'పని జీవులుగా'. సంపదను పంచిపెట్టి కాదు సంపాదించే మార్గాన్ని చూపించి. విందుల ధ్యేయం అలాగే ఉండాలి.

## ఎవరి తీరు వారికి ముద్దు!

మనిషి తనను తాను అప్పుడప్పుడు ప్రశ్నించుకోవడానికి ప్రత్యేకంగా సృష్టించుకున్నదే అంతరాత్మ. ఎందుకంటే ఇది మనిషి లోపల, మనిషి చేత, మనిషి కొరకు సృష్టించబడినది. దారి తప్పుతున్నప్పుడో, సందిగ్ధావస్థలో ఉన్నప్పుడో ఆ మనిషి ప్రమేయం లేకుండానే తన ప్రతి చర్యను నియంత్రిస్తూ హెచ్చరించడానికే తనలో మేల్కొనే అభూత శక్తి. అయినా ఈనాటి మనిషి నటనలో ఎంత ఆరితేరాడంటే తన అంతరాత్మనే బుజ్జగించి నిద్రపుచ్చేటంత. అందుకే మనిషి నేడు జీవించడం లేదు.. జీవిస్తున్నట్టు నటిస్తున్నాడు. అలా నటిస్తూనే నిష్క్రమిస్తున్నాడు!

వినోదాల పేరుతో సంప్రదాయాలను, సంస్కృతినీ తుంగలో తొక్కుతున్నారు నేటి నాగరికులు. పదిమంది ఏది అనుసరిస్తే అదే ప్రమాణం అన్నట్లుగా, నేటి మితిమీరిన పోకడలతో కాపాడుకోవాల్సిన మూలాలను కాలరాస్తున్నారు. ఎవరి ఒళ్లు వారే దాచుకోవాలి. మన సంస్కృతికి మనమే కాపలాదారులం కావాలి. ఖండం, దేశం, ప్రాంతం ప్రకారం అక్కడి పర్యావరణ పరిస్థితులను బట్టి తరతరాలుగా అనుసరిస్తున్న సంప్రదాయ భిన్నత్వాన్ని గౌరవించుకోవాలి. భూగోళం ఉపరితలం మొత్తం ఒకే లాగా ఉండదు. అలాగే జనజీవన స్థితిగతులు. ఉదాహరణకు, మంచు బడే ప్రాంతంలో ఆరుబయట స్నానం కుదరదు. మచ్చుకు ఇలాంటి ఒక్క వృత్తాంతం చాలు.. తూర్పు పడమరలు ఎదురెదురు మాత్రమే కాదని, అనుసరించే సంప్రదాయ, సంస్కృతులు కూడా వేర్వేరని గ్రహించడానికి, బలపర్చడానికి.

పక్షులకు పంజరం, మృగాలకు బోను. కార్లలో, విమానాల్లో వెళ్ళే సత్తా ఉన్నవారు కాలినడకన ఎందుకు వెళ్లాలి? ఐదు నక్షత్రాల విందు ఇవ్వాలనుకునే వారు పంక్తి భోజన స్థాయికి ఎందుకు దిగి రావాలి? ఎవరి తీరు వారికి ముద్దు. అదే మనిషి తత్త్వం. ఒక్క విందుకే వర్తించదు. ఆడంబరాల ప్రదర్శనకు ఎన్నో అనువైన సందర్భాలు. ఎలుగుబంటికి ఒళ్లంతా జుట్టే, సింహానికి మెడపైనే! అదే సృష్టి తత్త్వం. అందమైన పూలు పూచే గులాబీ కొమ్మకు ముళ్లెందుకున్నాయి? మల్లె తీగకెందుకు లేవు? తర్కం అన్ని చోట్లా తగదు. కొన్ని ప్రశ్నించడం సులువు, సమాధానం కష్టం. అనుభవమూ సరిపోదు.

ఆతిథ్యానికి అవధులు లేవు. మనిషి సంస్కారమే హద్దు. మర్యాదనే మన్ననకు పర్యాయం. ఉన్నంతలో ఇంటి ఆవరణలో ఏర్పాటు చేసే పంక్తి భోజనం ఆత్మీయ ఆతిథ్యానికి అందమైన నిర్వచనం. నిజమే.. పాతకాలం నాటిదైనా వన్నె తరగని ఆచారం. హోదాను మరిచి ఉన్నపళంగా పంతానికి పోతే ఉన్న పరువుకు వాతలు తప్పవు.

'కొంచెం' కడుపుకి కొంచెమే కదా కావాలి? మరి విందుల పేరిట ఎందుకంత పారవేత? గుక్కెడు నీళ్ల తాగడానికి బొక్కెడు కుమ్మరించాలా? అధిక సంపాదన అట్టహాసానికి నెలవు. జీవితాంతం సంపాదన వేట. ఆకాశమంత అందుబాటులో ఉన్నా, అనుభవించేది మాత్రం అందులో వీసమంత. మరి వేటకు అంతమెక్కడ? తృప్తికి పరిధులేమిటి? ఎవరు నిర్ణయించాలి? గాలి అదే.. చెట్టును బట్టి దాని ప్రభావం. వాయిద్యం లాగా విందు కూడా అంతే. దాన్ని వాయించే వారిని బట్టి సంగీతం!

**- ఆచార్య కదారు వీరారెడ్డి** 9392447007

# మంచి స్నేహితులు (కథ)

గంగవరం గ్రామంలోని కాళన్న, రంగన్న ప్రాణ స్నేహి తులు. కాళన్న తెలివిగలవాడు. రంగన్న అమాయకుడే కాకుండా అవివాహితుడు. అతనికి దూరపు బంధువులు తప్ప నా అన్న వారు ఎవరు లేరు .రంగన్న ఆస్తమానం కాళన్న ఇంటికే భోజనానికి వచ్చేవాడు. రానూ రానూ కాళన్న ఇంటి వారు ఆ రంగన్న గురించి విసుక్కోవడం మొదలుపెట్టారు . "మీకు ఎంత ప్రాణ స్నేహితుడైతే మాత్రం ఆ అమాయకుడు తరచు మన ఇంటికి భోజనానికి రావడం ఏమీ బాగాలేదు. అందుకే అతనితో ఎవరు స్నేహం చేయడం లేదు. ఒక మీరు తప్ప" అని అంది కాళన్న భార్య. అప్పుడు కాళన్న "నా మిత్రుని గురించి మరొక్కసారి ఏ మాట మాట్లాడినా నేను సహించను. అతడు అమాయకుడే కావచ్చు. కానీ చాలా మంచివాడు .కల్మష హృదయం లేనివాడు" అని అన్నాడు. భర్త మాటకు భయపడి అతని భార్య మౌనంగా ఉండిపోయింది .

ఒకరోజు కాళన్నకు ఒక రహదారి ప్రమాదం జరిగింది. ఆ సంగతి ఇంటి వారికి తెలియదు. ఎవరో వెళ్లి అతని ప్రాణ మిత్రుడైన రంగన్నకు చెప్పారు. రంగన్న వెంటనే వెళ్లి అతనిని ఆస్పత్రిలో చేర్పించాడు. అతనికి తీవ్ర గాయాలు అవడం వల్ల శస్త్ర చికిత్స అవసరమని,అందుకు కొంత డబ్బు ఖర్చు అవుతుందని వైద్యులు సూచించారు. అప్పుడు రంగన్న తన వద్ద ఉన్న మూడు లక్షల రూపాయలు అతని కొరకు ఖర్చు పెట్టాడు. ఆ తర్వాత ఇంటివారికి ఈ ప్రమాదం గురించి చాలా ఆలస్యంగా విషయం తెలిసి పరుగు పరుగున వచ్చారు .అప్పటికే అతనికి శస్త్ర చికిత్స జరిగిపోయింది .కొన్ని రోజుల తర్వాత కాళన్న మామూలు మనిషై ఆసుపత్రి నుండి విడుదలయ్యాడు .

ఈ విషయం తెలుసుకున్న రంగన్న బంధువులు అతనితో "ఏమిరా రంగన్నా! నీవు కూడబెట్టుకున్న ఆ డబ్బు మొత్తం ఆ కాళన్నకు ఖర్చు పెడతావా !అతడు నీకు తిరిగి ఆ డబ్బును చెల్లిస్తాడా! నీకు రేపు ఏదైనా అయితే డబ్బు ఎక్కడినుంచి వస్తుందిరా!" అని అన్నారు . అప్పుడు రంగన్న చిరునవ్వు నవ్వి" నాకు ఆ దేవుడే దిక్కు. నా ప్రాణ మిత్రుడు కష్టాల్లో ఉన్నప్పుడు నా దగ్గర ఉన్న డబ్బునే ఖర్చు పెట్టాను తప్ప అప్పు తేలేదుగా! ఇది నేను కష్టించి పనిచేసి సంపాదించిన డబ్బు .నేను ఒంటరిని .నేనేం చేసుకోవాలి? నా మిత్రుని బతికించుకున్నానన్న తృప్తి నాకు ఉంది. నాకు అంతే చాలు" అని అన్నాడు.

ఆసుపత్రి నుండి ఇంటికి వెళ్లి తర్వాత కాళన్న తన ఇంటి వారితో "చూశారా! మా రంగన్న వల్లనే నేను బ్రతికాను. మీరు ఆందోళన పడతారని అతడు మీకు సమాచారం చెప్పకుండా రాత్రంతా కూడా తాను నిద్ర పోకుండా నా దగ్గరే గడిపాడు. నాకు ఏదో అవుతుందని భయపడిన అతని ఏడుపు చూసి నాకే జాలి వేసింది. నేనే నాకేం కాదని అతనికి ధైర్యం చెప్పాను. మీరు ఎంతో, నాకు అతడు కూడా అంతే. నా ప్రాణ స్నేహితుడు భోజనానికి వస్తే మీరు విసుక్కున్నారు. అతడు మీకు కూడా ధైర్యం చెప్పాడు. అతని మూడు లక్షల డబ్బును మనం అతనికి తిరిగి చెల్లించవలసి ఉంది" అని అన్నాడు .

అప్పుడే అతని ఇంటికి వచ్చిన రంగన్న "ఏమిత్రా !నా డబ్బును నీవు నాకు చెల్లించేది ఏమిటి? నేను నీవు వేరనుకున్నావా! నీవు ఆ దేవుని దయవల్ల బ్రతికావు .నాకు అంతే చాలు. చెల్లెమ్మా! వీడి మాటలు పట్టించుకోకు" అని కాళన్న భార్యతో అన్నాడు.

తర్వాత కొన్ని రోజులకు కాళన్న ఆ డబ్బును ఇవ్వబోతే రంగన్న నిరాకరించాడు. అప్పుడు అతని భార్య " మీరు అన్నది నిజమండీ! అతడు లేకపోతే మీరు నాకు దక్కే వారే కాదు. అతనిని రోజు భోజనానికి రమ్మనండి. అతను మన కుటుంబ సభ్యుడే "అని అంది. ఆమె మాటలకు కాళన్న ఎంతో సంతోషించాడు .ఇలా రంగన్న, కాళన్న ఒకరికొకరు చేదోడు వాదోడుగా ఉంటూ జీవితాంతం మంచి స్నేహితులని అనిపించుకున్నారు.

**-సంగనభట్ల చిన్న రామకిష్టయ్య,**
9908554535

## శ్రీపద మణిపూసలు

కన్నవాళ్లు చెప్పినట్టి
గురుదేవులు నేర్పినట్టి
సుద్దులు మర్చిన వారి
బ్రతుకొనిల బురదగొట్టి!

మంచిని చెవి పెట్టనోడు
అధిక ఖర్చు జేసెటోడు
కష్టాల కడలిలోన
తప్పకుండ మునుగుతాడు!

వృద్ధుల సేవించడం
దీనుల సేవించడం
దైవపూజ కన్న మిన్న
పిల్లల సేవించడం!

మాట జారి పోయినచో
మనసు విరిగి పోయినచో
ప్రగతి రథం వెనుకబడును
మమత తరిగి పోయినచో!

**-వడిచర్ల సత్యం**
9441350137.

మితిమీరిన కోరికలు
సుఖశాంతుల చీలికలు
జీవితాన్ని మబ్బులోకి
నెట్టి వేసె పాచికలు!

సుతుల పట్ల కన్న తల్లి
హృదయమెపుడు పాలవెల్లి
ఆమె ఋణం దీర్చుకొనగ
సేవింపుము మళ్ళి మళ్ళి!

మంచినీటి కున్న గుణం
మంచి గాలి కున్న గుణం
ఆత్మీయుల మాటకుంది
ఆయుష్షును పెంచే గుణం!

నీవు, నేను కూడిపోతె
కూర్మి తోడ సాగి పోతె
జీవితమే శాంతిమయం
ఈర్ష్యలన్ని దాటిపోతె!

## దిష్టిబొమ్మ !?

దేశంలో రోజూ ఎన్నెన్నో
దిష్టిబొమ్మలు తగలబడి
పొగ పొగగా
హిమాలయం నుండి కన్యాకుమారికి
కుముటు కుముటు రాజకీయ కాలుష్యం

ప్రతి దిష్టిబొమ్మకూ
ఒక నాయకుని పేరు !
దిష్టిబొమ్మకు ప్రతిష్టో అప్రతిష్టో
దీర్ఘాయువో అల్పాయువో

చౌరస్తాలో దిష్టిబొమ్మ
దహనమౌతుంటే అటూ ఇటూ
ట్రాఫిక్ జామ్
అంబులెన్స్ మొత్తుకు చస్తోంది
హారన్ . . . హారన్ . . .
లోపలి పేషెంట్ హరీ హరీ !

పాతబడ్డ ప్యాంటు షర్టు
లోపల ఇంత గడ్డివాము
అగ్గిపుల్లలు పెట్టెకు పెట్టె తగలడితే
దిష్టిబొమ్మ దహనం
కొందరికి ఇది హవనం !
అందరికీ ఉచిత వినోదం !
ఎన్ని దిష్టిబొమ్మలుగా ఊరూరా
ఆ నాయకుడు అగ్ని ప్రవేశం చేస్తే
అంతగా ప్రసిద్ధి !
చాణుక్య నీతిలో దిష్టిబొమ్మ దహనం
అధ్యాయమా? అధ్యయనమా?
ఏం చేస్తుంది దిష్టిబొమ్మ
రాజకీయ చతురతకు
చచ్చినట్టు తగలడిపోతుంది



**- కందాళై రాఘవాచార్య**
8790593638

## చెడుగుణాలు చేటు...!

కోపమిలనునీవు కోరరాదెన్నడు
పాపహేతువయ్యు పాడుచేయు
శాంతగుణమెపుడునుసవ్యజీవికగాను
సంఘమందుకీర్తి సఫలమిచ్చు!

ఓర్పువలనను పనులొనగూరుజగతిలో
నేర్పుతోడ మనసు నెమ్మదియగు
ఓర్పుతీర్పులున్న నొజ్జవై జ్ఞానమ్ము
పదుగురికిలపంచుపరమప్రజ్ఞ!

ధనమువల్ల గలుగు దర్పంబుగర్వంబు
తగినడబ్బుతోడతపనదీరు
ఆశయధికమైనహాయినికోల్పోవు
చక్కనైనబ్రతుకుసాధ్యపడదు!

మదముమనిషికెపుడుమర్యాదనీయదు
మత్సరంబుకూడ మనకు చేటు
మదమువల్లగజముమదిలోన"కల"యందు
సింహముకనచ్చుచిత్రముగను!

ఈర్ష్యగుణమువల్ల నిబ్బంది లెన్నియో
నరుడునరకుడౌను నాడు నేడు
చెడ్డపనులన్ని చేటునే చేయును
హితముగూర్చువాడె హితుడు సతము.

మనసు మంచిదైన మనుగడ కెదురేది
నీచగుణము నిన్ను నిండముంచు
తేలుకొండినుండి తేనెలువచ్చునా?
మనిషివలెను బ్రతుకు మహినినీవు!

మోసమెపుడుచేసిమొనగాడుకాలేదు
దొరుకువరకు తనది దొర తనంబె
పాముకోరలెపుడుపాలనుపంచవు
నీతిలేని బ్రతుకు నిష్ఫలంబు!

దానధర్మములను దయ తోడచేయక
దాచిపెట్టుకొనగ ధరణిలోన
పరులపాలుగాదెపాపిష్టిధనమంత
లోభగుణమువల్లలుబ్ధుడౌను!

అల్పకాంక్షల కిల నారటపడబోకు
స్వల్పజీవితాన స్వార్థమేల?
కోరుకొనకు పెక్కుకోర్కెలనెప్పుడు
దుఖమేను నీకు సౌఖ్యమేది!?

కులమతాలచూడకుత్సితభావాలె
సమతమమతభావసరణిజచ్చు
విశ్వమందునున్నవిషతుల్యతల నిల
సమసిపోవునాడుసర్వమొకటె!!!

**-డాక్టర్ గన్నోజు శ్రీనివాసాచారి**
8555899493

## మట్టికథ

మట్టి చెట్టు
మట్టిచెట్టుదగ్గర
దయ్యాలుంటా యంటారు
మట్టి నీడన
ఏ మొక్క మొలవదంటారు
ఈ మూగ మట్టి ఊడలకు
శరీరాలు వేలాడాయి
నెత్తురు కారుతున్న శరీరాలు
శత్రువులతో పోరాడి
ఓడి చెరబడ్డ వీరుల శరీరాలు
రాంజీ గోండు రాజు గుండె ధైర్యం
తమతెగ అస్తిత్వం కోసం
దేశవముక్తి కోసం
ఆంగ్ల నిజాం సైన్యంతో పోరాడి చిక్కి
మట్టికి ఉరితీసి వేలాడబడ్డారు
ప్రక్కనున్న గోదావరి
నెత్తురు నురగలు కక్కుతూ
వీరులకు కన్నీటి వీడుకోలు పలుకుతూ
పరుగులు తీస్తుంది
నిర్మలమైన నిర్మల్ ప్రాంతంలో
ఎల్లం పల్లి దారుల్లో
పట్టుపడ్డ వీరులను
చిత్రహింసలకు గురిచేసి
మౌనంగా సర్వజీవులకు నీడనిచ్చే
తపోవనంలోని మౌని లా ఉన్న మట్టికి
వందపదుల వీరులను
ఉరితీసారు
ఆ మట్టి నేడుఉరులమట్టి అయ్యింది
త్యాగధనుల
గాధలకు ప్రతీక నిలిచింది
విప్లవాలకు నాంది గా మిగిలింది

**-రేడియమ్**
92915277577

## సమయం

సమయం
ఒక అమూల్యసంపద!
చకచకా దాన్ని వాడుకో
వృథా చేస్తే వ్యథ తప్పదు
ముందుగానే జాగ్రత్తపడు
పోయిన సమయం తిరిగిరాదు
ముందుకు సాగే నీరు వెనుకకు రాదు
క్షణమైనా అది అమూల్యమే
ఒక్క క్షణమే జీవితాన్ని మారుస్తుంది
సంవత్సరాలు క్షణాల్లా గడచిపోతాయి
మేలుకోకపోతే ఏదీ మిగలదు
సమయమే సత్యం
సమయమే నిత్యం
సమయమే తులలేని ఆణిముత్యం!

డా॥ అయాచితం నటేశ్వరశర్మ
9440468557.

# పదునైన అక్షర కవిత్వ సూర్యుడు

కుంచెని, కెమెరా లెన్సుని,కలాన్ని ఏకం చేసి తెలుగు కవితకు పుష్టి చేకూర్చి, అనేకమైన కవిత పంక్తులతో సంక్షిప్తతనీ, వస్తువులో జీవిత విస్తృతినీ, సమాజ లోతుల్నీ, నర్మగర్భంగా పదునైన పంక్తులను నరనరాల్లో రుధిరాన్ని కాల్చే కొలిమిలా, విస్ఫోటనం గావించిన సామాన్య అక్షర మాంత్రికుడు. గజ్జె కట్టి కరాళ నృత్యం చేస్తున్న క్షుద్ర రాజకీయలపై ఉక్కుపాదాన్ని తూటాల్లా పేల్చిన సమర శంఖం. ఆకాశమంత అనంత భావాల్ని, నవ యుగానికి ధిక్కార కవిత్వముతో స్ఫూర్తి రగిలించిన సాహిత్య ప్రభాకరుడు. సామాజిక రుగ్మతలపై, విప్లవ కిరణాల ప్రసరింపచేసి కష్టజీవి కన్నీటి చెమట చుక్కలను చరిత్ర రక్తాక్షరాలతో చురకలను అంటించి, జనుల నాడులను తదైక దూర దృష్టితో దర్శించి బాధితుల పక్షాన నిలబడి గుండెల్లో గుచ్చుకునేలా చెంప చెళ్ళు మనేలా సూటిగా వాడుక పదాలతో వ్యక్తపరచి ప్రభజంనం సృష్టించిన నిత్య కార్మిక అక్షర భాస్కరుడు అలిశెట్టి ప్రభాకర్.

1954 జనవరి 12న జగిత్యాలలో అలిశెట్టి చినరాజం, లక్ష్మి దంపతులకు జన్మించాడు. భార్య భాగ్య, కుమారులు సంగ్రామ్, సంకేతులతో నివాసం. యుక్త వయస్సులోనే మొదట పత్రికలకు , సినీ నటుల బొమ్మలను గెస్టూ ఆర్టిస్ట్ గా ఎదిగాడు. తర్వాత సాహితీ మిత్రదీప్తి పరిచయంతో కవిత్వ రంగంలోకి ప్రవేశించాడు.జీవనం కోసం జగిత్యాలలో స్టూడియో పూర్ణిమ , కరీంనగర్ జిల్లాలో స్టూడియో శిల్పి, హైదరాబాద్ లో స్టూడియో చిత్రలేఖ ఏర్పాటు చేసి ఫోటోగ్రాఫర్ గా జీవిత ప్రస్థానం సాగించాడు. కుంచె బొమ్మల్నీ, కెమెరా బంధించిన ఫోటోల్నీ తన కవిత్వానికి ఆసరా చేసుకున్నాడు. తాను చెప్పే భావాల్నీ వెలిగించే దివిటీలుగా మార్చుకున్నాడు.తన కవిత్వ అక్షరాలతో సృజనాత్మకతతో సునాయాసంగా ప్రజలకు అర్థమయ్యేలా,నిర్మోహ మాటంగా కలంతో అక్షర సిరాలను అందించడం చేశాడు. విభిన్నమైన కవిత్వాలు వెలువడుతున్న సమయంలో పేదరికంలోని మరింత పేదరికానికి, బాధల నుండి మరింత బాధలకి కన్నీళ్ళను కవితావస్తువుగా చేసుకొని కవితలు రాశాడు. ఎర్ర పావురాలు,మంటల జెండాలు, చురకలు, రక్తరేఖ, ఎన్నికల ఎండమావి, సంక్షోభ గీతం, సిటీలైఫ్.. మొదలలైనవి రాశాడు.

అలిశెట్టి ప్రభాకర్ కవితల పుస్తకంలోని మచ్చుతునక రవ్వలు కొన్ని ... **గొంతు కోస్తే/పాట ఆగిపోదు/ అది..ముక్తకంఠం/గొలుసు లేస్తే/పోరు నిలిచిపోదు/ అది ప్రజాయుద్ధం** అని ఒక కళాకారుడి మీద హత్యాయత్నం జరిగినప్పుడు చలించి అతని సిరాలోంచి జనించిన కవిత్వ పంక్తులివి. 'భయం' అనే కవితలో **భాంబుని చూడగానే / బెంబేలు పడితే / అదెప్పుడూ /నీ గుండెల్లోనే పేలుతుంది..** అని దేనిని చూసి భయాందోళన చెందకూడదని ధైర్యాన్ని భయపడితే అది నీ గుండెల్లోనే రోజు పేలుతుందని ఉద్ఘాటించారు. **తన శవమై / ఒకరికి వశమై /తనువు పుండై /ఒకడికి పండై /ఎప్పుడూ ఎడారై / ఎందరికో ఒయాసిస్సై** ...ఒక వేశ్య గురించి ఇంత గొప్పగా ఏ కవి చెప్పలేదని చిన్న పంక్తులతో అనంతభావాల్ని కవితలను పేర్చడం ఒక్క అలిశెట్టి ప్రభాకరుడికే సాధ్యమని నిరూపించిన తెలంగాణ అక్షర ఆయుధం.

మరో కవితలో- **దేవుళ్ళు తమ గుళ్ళకి రాత్రిళ్ళంతా/తాళాలు వేసుకుంటున్నారెందుకో/బహుశా మనుషుల మీద నమ్మకం పోయిందేమో..!** అని నిర్మొహమాటంగా వ్యక్త పరుస్తాడు. **న్యాయాన్ని ఏ కీలు కా కీలు / విరగొట్ట గలవాడే వకీలు (వకీలు కవిత),**

**కోచింగ్ లేని మ్యాచికి/చప్పట్లు కొట్టే సన్నాసులు**
**(సినిమాలు-ప్రేక్షకులు)**

**కొవ్వెక్కి ఉండటం /కొవ్వొత్తులూదటం (బర్త్ డే పార్టీలు)**...మొదలగు చురకలు అందించారు. నగరాల్లో అత్యధికంగా/ అత్యద్భుతంగా/ అస్థి పంజరాల్ని చెక్కే /ఉలి /ఆకలి ... హైదరాబాద్ నగరంలో బతుకు కోసం వచ్చి ఎన్నో ఇబ్బందులకు గురైవుతూ ఆకలి నింపుకోవడం కోసం అహర్నిశలు శ్రమించే పేద మధ్య తరగతి మనోగథాలను అద్భుతంగా ఆవిష్కరించారు అలిశెట్టి ప్రభాకర్. మరో కవితలో - **గడియారం పెట్టుకున్న/ ప్రతివాడూ/ పరిగెడుతున్న/ కాలాన్ని/ పట్టుకోలేడు...కుక్కలూ లేని/కుక్కురూ లేని / ఇల్లే - ఒకింత ప్రశాంతత...అని, విద్యార్థుల ఎగుమతి / నిరుద్యోగుల దిగుమతి / చేయగల / చదువుల రేవులు / యూనివర్సిటీలు...**అంటూ 'సిటీలైఫ్' సంకలనంలో కవితలు రాశాడు.

ఏ కవిత రాసిన దానిలో పరమార్థంతో నిజ నిజాలను నర్మగర్భంగా గోచరిస్తుంది. నిజనిజాలను రాయడంలో అందెవేసిన చెయ్యి. కవిత్వమునే శ్వాసగా ఆశగా అనుభూతి, భక్తి ,ముక్తి ,సరసం వినోదానికి పరిమితమైన పాఠకుల మనసులను ప్రగతిశీల ఆలోచనా దృక్పథంలోకి మళ్ళించగల నేర్పరి అనడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు. వర్తమాన కవిత్వానికి కాయినేజ్ పెంచిన కవినతడు.కవిత్వముతో తను తానుగా వుండిపోతూ ఆరోగ్యాన్ని పట్టించుకోకుండా టీబీ సోకి ఒంటిని కబళిస్తున్నా లెక్క చేయలేదు. ఆరోగ్య విషయంలో చాలా నిర్లక్ష్యంగా ఉండేవాడని అలిశెట్టి దగ్గరి మిత్రులు చెబుతుంటారు. ఎన్నో అద్భుతమైన కవితలను శిల కాగితంపై అక్షరాల ఉలితో చెక్కి చెదరనివ్వని ముద్రలా నిలిచిపోయాడు. **డబ్బు మనిషిలా నువ్వు / జబ్బు మనిషిగానేను / అందుకే... / నువ్వెప్పుడు డాక్టరువి / నే పేషెంటుని** అంటూ వ్యంగ్యమైన పంక్తుల్ని అలవొకగా అనేకమైన మినీకవితాలు రాస్తూనే 1993 జనవరి 12 న కన్నుమూసిన పదునైన అక్షర సూరీడు అమరుడైన అలిశెట్టి ప్రభాకరుకు జోహార్లతో సాహిత్యాభి వందనములు అందించడం , స్మరించుకోవడము మనందరి కర్తవ్యం.

( నేడు అలిశెట్టి ప్రభాకర్ జయంతి - వర్థంతి సందర్భంగా ప్రత్యేక వ్యాసం )

**-డాక్టర్ పగిడిపల్లి సురేందరు**
80748 46063

## ప్రజా విప్లవం-అలిశెట్టి

సమాజంలోని
అన్యాయాలకు చలించి
రక్తాన్ని అక్షరాలుగా మార్చి
అనుభవాలను
ఆయుధాలుగా చేసుకుని
దౌర్జన్య వ్యవస్థ పై
సంధించినఅస్త్రాలే ..
అలిశెట్టి కవిత్వాలు !
మధ్యతరగతి జీవితాల్లో
జరిగే సంఘర్షణలను
తూటాల్లా పేర్చి
అశేష పాఠకులను
సంపాదించుకున్న
నిరాడంబర శీలి ..
అలిశెట్టి ..!
వృత్తిరీత్యా చిత్రకారుడై
తన కుంచెతోరంగులద్దుతూ..
రంగుల ప్రపంచంలో గల
కుళ్లును ఎండగడుతూ ..
శిథిల ప్రపంచాన్ని
తన మాటల ఇటుకలతో
పునర్నిర్మించిన అక్షర నిర్మాత .
అలిశెట్టి ప్రభాకర్ .!
జీవ శక్తిని కోల్పోతున్న
కవితా శక్తికిఆయువు పోసి ..
అక్షరాలతో ...
అలుపెరుగని పోరాటం చేస్తూ
ముందు తరాలకు ఆదర్శంగా
నిలిచిన మహోన్నత
కవితా శక్తి అలిశెట్టి ..!
స్వార్థ రాజకీయాలను నిరసిస్తూ
నిప్పు కణిక లాంటి
ధిక్కారాక్షరాలతో
బడుగుల కన్నీటి
బతుకుల వెతలని
వెలుగులోకీ తెచ్చిన
అక్షర సూరీడు ..!
మరణం నా చివరి
చరణం కాదని చెప్పి ..
ఏ రోజైతే జన్మించారో
అదే రోజు అందరినీ విడిచి
అనంత లోకాలకు
వెళ్ళిన అలిశెట్టి..
మరణం తర్వాత కూడా
ఆయన భావజాలం..
కవితలు నిత్యం జీవిస్తూ
నేటికీ .. ప్రజా క్షేత్రం లో..
యుద్ధం చేస్తున్నాయి..!
అజరామరం ..అలిశెట్టి
సజీవ వాస్తవాలు..
వారి కవితలు..!

**-సునీత బండారు**
9440671530

### ఎమ్మెల్యే ఈటలకు సత్కారం

హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ను ఆదర్శ కిరణం సంస్థ తరఫున వంగా బాల్‌రాజ్‌గౌడ్ మంగళవారం సత్కరించారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ సమాజంలో సగభాగం ఉన్న బీసీల అభ్యున్నతికి కృషి జరగాలని ఆయన పిలుపు నిచ్చారు. బీసీలు రాజ్యాధికారి దిశగా ముందుకు సాగితేనే వారు అన్నిరంగాల్లోనూ వారు అభివృద్ధి చెందుతారన్నారు. రామ్మోహన్, సాంబయ్య, బీజేపీ నేతలు బూరుగు శ్యాం సుందర్, సారంగపాణి నరేందర్,లింగం పాల్గొన్నారు.


ఆహ్వానం
తెలంగాణ భాషా సాంస్కృతిక మండలి (Regd. No. 1522)
ఆధ్వర్యంలో

తెలంగాణ దారిదీపాలు
వివిధరంగాలలో విశేషకృషిచేసిన ప్రముఖుల పరిచయాలు
సంపుటి-1
ఆవిష్కరణ - అంకితం - గ్రంథ విశ్లేషణ

తెలంగాణ పారిశ్రామిక రంగానికి విశేష సేవలందించిన కీ॥శే॥ సమ్మిడి వీరారెడ్డి గారికి అంకితం

స్వీకృతి
డా. సమ్మిడి ఆనందరెడ్డి
మేనేజింగ్ డైరెక్టర్, సాగర్ సిమెంట్స్



తేది : 17-01-2023, మంగళవారం, ఉ॥ 10 గం॥ల నుండి రా॥ 8.00 గం॥ల వరకు
వేదిక : శ్రీ దేవులపల్లి రామానుజారావు సమావేశ మందిరం, తెలంగాణ సారస్వత పరిషత్తు, బొగ్గులకుంట, హైదరాబాద్.

తేది : 17-01-2023, మంగళవారం
ప్రారంభ సమావేశం
ఉ॥ 10.00 గంటలకు
ముఖ్యఅతిథి, ఆవిష్కర్త : గౌ. శ్రీ గుత్తా సుఖేందర్ రెడ్డి చైర్మన్, తెలంగాణ రాష్ట్ర శాసనమండలి
అధ్యక్షులు : డా. అమ్మంగి వేణుగోపాల్ ప్రముఖకవి, తెలంగాణ రాష్ట్రప్రభుత్వ కాళోజీ తొలి పురస్కార గ్రహీత
విశిష్ట అతిథులు : శ్రీ గోరటి వెంకన్న ప్రముఖ సాహితీవేత్త, తెలంగాణ రాష్ట్ర శాసనమండలి సభ్యులు
ఆచార్య ఆర్.లింబాద్రి చైర్మన్, తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యామండలి
శ్రీ ఉప్పల శ్రీనివాస గుప్త చైర్మన్, తెలంగాణ రాష్ట్ర పర్యాటక సంస్థ
గౌరవ అతిథులు : డా. జె.చెన్నయ్య కార్యదర్శి, తెలంగాణ సారస్వత పరిషత్తు
శ్రీ ఎం.వి.గోనారెడ్డి ప్రముఖ విద్యావేత్త
శ్రీ బైస దేవదాసు సంపాదకులు, 'నేటినిజం' దినపత్రిక
డా. ఎం.మధుసూదన్ రెడ్డి ప్రముఖ విద్యావేత్త
స్వాగత వచనం : డా. గంటా జలంధర్‌రెడ్డి వ్యవస్థాపకులు, అధ్యక్షులు, తెలంగాణ భాషా సాంస్కృతిక మండలి
సమన్వయకర్త : డా. పోరెడ్డి రంగయ్య అధ్యక్షులు, 'తేజ' సాహిత్యసేవా సంస్థ

మొదటి సమావేశం / ఉ. 11.30 గంటలకు
ఉమ్మడి మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్
అధ్యక్షులు : శ్రీ టి.ఉదయవర్లు సీనియర్ జర్నలిస్ట్, గౌరవ కార్యదర్శి, శ్రీ కృష్ణ దేవరాయ తెలుగు భాషా నిలయం
గౌరవ అతిథి : డా. బుక్కా బాలస్వామి ప్రముఖ రచయిత
ఆత్మీయ అతిథి : డా. కె.విద్యావతి ప్రముఖ రచయిత్రి
ప్రత్యేక అతిథి : డా. నాళేశ్వరం శంకరం ప్రముఖకవి
వక్తలు
మహబూబ్‌నగర్ : శ్రీ హెచ్.రమేశ్ బాబు సినీ, చారిత్రక పరిశోధకులు
రంగారెడ్డి : డా. తూర్పు మల్లారెడ్డి పూర్వప్రధానాచార్యులు, శ్రీ లక్ష్మీనరసింహా డిగ్రీ మరియు పీ.జీ. కళాశాల, భువనగిరి
హైదరాబాద్ : డా. రాపోలు సుదర్శన్ ప్రముఖ సాహితీవేత్త
సమన్వయకర్త : డా. భీంపల్లి శ్రీకాంత్ ప్రముఖ రచయిత

భోజన విరామం : 1.00 నుండి 2.00 వరకు

రెండవ సమావేశం / మ. 02.00 గంటలకు
ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం, వరంగల్
అధ్యక్షులు : డా. సంగిశెట్టి శ్రీనివాస్ ప్రముఖ విమర్శకులు, చరిత్ర పరిశోధకులు
గౌరవ అతిథి : ఆచార్య చంద్రవల్ల తిరుపతిరెడ్డి ప్రముఖకవి, USA
ఆత్మీయ అతిథి : శ్రీ ఆర్.గురువారెడ్డి సీనియర్ జర్నలిస్ట్
ప్రత్యేక అతిథి : అనిశెట్టి రజిత ప్రముఖ రచయిత్రి
వక్తలు
నల్లగొండ : డా. తండు కృష్ణకౌండిన్య, ప్రముఖ రచయిత
ఖమ్మం : శ్రీ తాటికొండల నరసింహారావు, ప్రముఖ రచయిత
వరంగల్ : డా. టి.శ్రీరంగస్వామి, ప్రముఖ రచయిత
సమన్వయకర్త : శ్రీ పానుగంటి రామమూర్తి, ప్రముఖ రచయిత

మూడవ సమావేశం / మ. 03.30 గంటలకు
ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్
అధ్యక్షులు : డా. గండ్ర లక్ష్మణరావు ప్రముఖ రచయిత
గౌరవ అతిథి : డా. నలిమెల భాస్కర్ ప్రముఖ భాషావేత్త
ఆత్మీయ అతిథి : డా. సంగనభట్ల నరసయ్య ప్రముఖ సాహితీవేత్త
ప్రత్యేక అతిథి : శ్రీ జి.గిరిజా మనోహరబాబు ప్రముఖ సాహితీవేత్త
వక్తలు
కరీంనగర్ : శ్రీ బూర్ల వెంకటేశ్వర్లు ప్రముఖ రచయిత
ఆదిలాబాద్ : డా. ఉదారి నారాయణ ప్రముఖ రచయిత
నిజామాబాద్ : డా. వి.శంకర్ ప్రధాన కార్యదర్శి, తెలంగాణ రచయితల సంఘం
మెదక్ : డా. పొన్నాల బాలయ్య కవి, రచయిత
సమన్వయకర్త : శ్రీ మాడిశెట్టి గోపాల్ ప్రముఖ వ్యాఖ్యాత

ముగింపు సమావేశం
సా॥ 05.30 గంటలకు
ముఖ్యఅతిథి : గౌ. శ్రీమతి పి.సబితా ఇంద్రారెడ్డి విద్యాశాఖామాత్యులు, తెలంగాణ ప్రభుత్వం
అధ్యక్షులు : డా. నందిని సిధారెడ్డి ప్రముఖకవి, తెలంగాణ సాహిత్య అకాడమి తొలి అధ్యక్షులు
విశిష్ట అతిథులు : డా. ఏనుగు నరసింహారెడ్డి ప్రముఖకవి, అదనపు కలెక్టర్, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా
ఆచార్య వి.బాలకిష్టారెడ్డి నల్సార్ విశ్వవిద్యాలయం, షామీర్‌పేట్
డా. ముదిగంటి సుజాతారెడ్డి ప్రముఖ రచయిత్రి, తెలుగు విశ్వవిద్యాలయ విశిష్ట పురస్కార గ్రహీత
గౌరవ అతిథులు : ఆచార్య సూర్య ధనంజయ్ పూర్వ తెలుగు శాఖ అధ్యక్షులు, ఉస్మానియా విశ్వవిద్యాలయం
డా. సుంకిరెడ్డి నారాయణరెడ్డి ప్రముఖ రచయిత
డా. గుమ్మన్నగారి బాలశ్రీనివాసమూర్తి పాల్కురికి సోమనాథ పరిశోధక సంఘం చైర్మన్, తెలుగు శాఖ, తెలంగాణ విశ్వవిద్యాలయం
స్వాగతవచనం : డా. గంటా జలంధర్‌రెడ్డి వ్యవస్థాపకులు, అధ్యక్షులు, తెలంగాణ భాషా సాంస్కృతిక మండలి
సమన్వయకర్త : శ్రీ ఘనపురం దేవేందర్ వైస్ ప్రెసిడెంట్, తెలంగాణ రచయితల సంఘం

ఈ వ్యాససంపుటిలో పాల్గొన్న రచయితలకు
అభినందన సత్కారం

డా. ఉదారి నారాయణ, డా. గద్దం మోహనరావు, శ్రీమతి ఆవాల వీణ, శ్రీ గోవగాని రవీందర్, డా. దవాగాం సాంబమూర్తి, శ్రీ నల్లా ప్రవీణ్‌రెడ్డి, డా. తిరువరగ శరత్‌చంద్ర, శ్రీ టి. ఉదయవర్లు, శ్రీ కొత్త అనిల్ కుమార్, డా. టి. శ్రీరంగస్వామి, డా. బి.వి.ఎన్. స్వామి, శ్రీమతి బి. కళాగోపాల్, శ్రీ మాధవ్ గుర్రాల, డా. కాంచనపల్లి గోరా, శ్రీ దాస్యం లక్ష్మయ్య, శ్రీ కటుకోజ్వల మనోహరాచారి, శ్రీ దారం గంగాధర్, శ్రీ హెచ్.వి.ఎల్. ప్రసాదుబాబు, శ్రీ తాటికొండల నరసింహారావు, డా. గుణ్ణం సీతారాములు, శ్రీ తిరునగరి శ్రీనివాసస్వామి, శ్రీ కందాళై రాఘవాచార్య, డా. లింగంపల్లి రామచంద్ర, డా. పెద్ది వెంకటయ్య, డా. కొండపల్లి నీహారిణి, శ్రీ పానుగంటి రామమూర్తి, శ్రీ మండువ రవీందర్‌రావు, శ్రీ దండమూడి శ్రీచరణ్, డా. బన్న అయిలయ్య, డా. భైరోజు శ్యామసుందర్, శ్రీ సంబరాజు రవిప్రకాశ్‌రావు, డా. బుక్కా బాలస్వామి, డా. తండు కృష్ణకౌండిన్య, శ్రీ వేము సంకోజు, శ్రీ పున్న అంజయ్య, డా. బి. కళ్యాణి, శ్రీమతి గంటా రమాదేవి,
శ్రీ అంబటి వెంకన్న, శ్రీ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, డా. వినోభాచారి, డా. బోడ జగన్నాథ్, శ్రీ వేదార్థం మధుసూదనశర్మ, శ్రీ వైద్యం వేంకటేశ్వరాచార్యులు, శ్రీ జి. యాదగిరి, డా. రాపోలు సుదర్శన్, శ్రీ భైరోజు చంద్రశేఖర్, శ్రీ వనపట్ల సుబ్బయ్య, అనిశెట్టి రజిత, డా. సరోజ వింజామర, శ్రీ వి.పి. చందన్‌రావు, శ్రీమతి వేల్పుల శ్రీలత, శ్రీ తల్లావఝ్జుల మహేష్‌బాబు, శ్రీ తొగర్ల సురేశ్, శ్రీ ముదిగొండ సంతోష్‌శర్మ, డా. మలయశ్రీ, శ్రీ మాడిశెట్టి గోపాల్, డా. అమ్మిన శ్రీనివాసరాజు, డా. మద్దెర్ల రమేశ్, శ్రీ పాతూరి రఘురామయ్య, శ్రీ అమ్‌గోత్ వెంకట్ పవార్, డా. ఎస్వీ రామారావు, డా. భీంపల్లి శ్రీకాంత్, డా. పి. భాస్కరయోగి, శ్రీమతి ఎన్. నిర్మలకుమారి, శ్రీ బెతా చంద్రయ్య, శ్రీ కె. కృష్ణయ్య, శ్రీ గంగ కాశీనాథ్, శ్రీ ఘనపురం దేవేందర్, శ్రీ బండారి ప్రేమ్‌కుమార్, డా. కర్నాటి లింగయ్య, శ్రీ శ్రీరామోజు హరగోపాల్, డా. పోరెడ్డి రంగయ్య, శ్రీ శ్రీపాద శివప్రసాద్, శ్రీ రెబ్బ మల్లికార్జున్,
శ్రీ బొడ్డు శంకర్, డా. ఫణీంద్ర, డా. నలిమెల భాస్కర్, శ్రీ జెట్టి శంకర్, డా. అడువాల సుజాత, డా. కె. విద్యావతి, శ్రీమతి నిదానకవి నీరజ, శ్రీ యల్లంభట్ల నాగయ్య, డా. చీదెళ్ళ సీతాలక్ష్మి, శాంతి ధనావత్, డా. తుర్పు మల్లారెడ్డి, శ్రీ తుమ్మూరి రాంమోహన్‌రావు, శ్రీ బిల్ల మహేందర్, శ్రీ అంపశయ్య నవీన్, డా. జె. చెన్నయ్య, శ్రీ మౌనశ్రీ మల్లిక్, డా. వల్లేరు వీరస్వామి, శ్రీ మహ్మద్ షరీఫ్, శ్రీ వాసరవేణి పరశురాం, శ్రీ గుళ్ళపల్లి తిరుమలకాంతికృష్ణ, శ్రీ దాసరి శాంతకుమారి, డా. చెన్నమనేని పద్మ, శ్రీ కట్ట రంజిత్‌కుమార్, డా. దాసోజు పద్మావతి, డా. సుంకిరెడ్డి నారాయణరెడ్డి, డా. సూరారపు భిక్షం, డా. ఎం. పురుషోత్తమాచార్య, డా. సూరేపల్లి గురునాథం, శ్రీ బండి సూర్యారావు, శ్రీ నల్లాన్ చక్రవర్తుల రోజా, డా. ఏనుగు నరసింహారెడ్డి, శ్రీ సంగినేని రవీంద్ర, డా. సురభి లక్ష్మీశారద, డా. అప్పం పాండయ్య, డా. శ్రీభాష్యం అమరథ, డా. సంగిశెట్టి శ్రీనివాస్

డా. గంటా జలంధర్‌రెడ్డి
వ్యవస్థాపకులు, అధ్యక్షులు, తెలంగాణ భాషా సాంస్కృతిక మండలి
సెల్ : 98482 92715, e-mail : jalanderreddy65@gmail.com


మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 720వ రోజు 'చలి' అనే అంశంపై పలువురుకవులు తమ కవితలను పంచుకున్నారు. 'చలి' అనే అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా...

-సంపాదకులు

*మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సమూహం*
*ఏకాంశ కవిత్వం నిర్వహణ:*
*-డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు, 9441046839*

### నెచ్చెలి

గాలి లీలగా వీస్తుంది మంచుతెరల్లో
మంద్రంగా అరకులోయ
అందంలా విందుచేస్తూ
చేమంతి పూలు పూసినంత
తనువంతా చలిలో వణికించేంత.
అమ్మ
తలకు అరికట్లం కట్టింది
కుంపట్లో పిడుక మెల్లగా కునుకు తీస్తుంది
యాసంగి పొలం తాను పనుల్లో
లీనం కమ్మంటుంటే
ఎద్దులే చలిమాపుకు దాపులేకున్నా
రైతన్నతో రెడీగా బురదలో నడక.
కాలం
ఎప్పుడూ బువ్వకుండే తెల్లమల్లోలే
మక్కంకి వెచ్చగా చేతిలో చేరి
నోటికి చేతికి వెచ్చదనమైంది.
చెలి చూపులో
ఏవో రామప్ప శిల్పాల రమణీయత
గులాబీ బుగ్గలపైన వెచ్చని కవ్వింత.
తాతయ్యకు ఏదో హుషారొచ్చింది
పాత యాదిలో మునకేసి
ముసిముసి నవ్వులు పూయించాడు.
కందికాయ నల్లనిఛాయను పొగరుగా
కప్పుకుని ఊరిస్తుంది
కొత్త పెళ్లికూతురోలే
కొత్తిమీర చేలో తలపై కొప్పేసుకుని
వెన్నెల్లో కమ్మగా ముస్తాబు.
సూరీడే తన వెండి కిరణాలను
నేతన్న జరీచీరలోంచి ఒంపుతున్నాడు
మా ఊరి చెరువు తడలు తడలుగా
ఉదయం పొగలు కక్కుతూ
అల్లిపూలతో
చిన్నపిల్లై శుభోదయం.

**- ఏడెల్లి రాములు**

### వసంతాన్ని వెలివేయకు

ఎత్తైన గిరులపై
ఆవరించిన పొగమంచు
నీ మనసును కమ్మనీయకు!
వణికించే చలి
నీ శరీరానికే తప్ప
భయాందోళనల వణుకు
మనసును తాకనీయకు!.
మొదటగా తాకిన నీటిచుక్కలకే
దేహం జలదరించేది
నిండా మునిగితే చలి
జాడకు చోటేది!.
ఎదురైన సమస్యలకు
భయపడి డీలా పడకు
ప్రశాంత చిత్తంతో పరిష్కార
దిశగా పయనం సాగించు!.
ముడుచుకు పడుకుంటే
మిగిలేది నిస్తేజమే
పని చేస్తూ ఉంటేనే
పల్లవిస్తుంది చైతన్యం!.
చిన్నపాటి కష్టాలకే కుమిలిపోయి
కుంగిపోతే కుంగుబాటు ఖాయం!
ఆశావాద ఆమనిని విడచి
నిరాశా శిశిరానికి చోటీయకు
దవ్వులలో దాగి దరిచేరనున్న
వసంతాన్ని వెలివేయకు!!!.

**- చంద్రకళ దీకొండ**

### పులి!

చలికాదు బాబోయ్- పులి!
కంటికి కన్పడని పంజావిసిరే
బెబ్బులి!
పేదాగొప్ప తేడాలేక
విరుచుకు పడుతుంది
గజగజ వణికిస్తుంది
కాలుచేతులు కొంకర్లు!.
స్వెట్టర్ మఫ్లర్ సాక్స్ తో
ఎస్కిమో అవతారాలు!
దుప్పటి ముసుగులో ఒద్దికగా
హత్తుకుపోయే పిల్లలు!
గరంగరం కాఫీ చాయ్ చుక్క
అలా అలా గొంతులో జారుతేనే
శరీరానికి చురుకు!.
ఆస్మా రోగులకు బేజారు
చలిజ్వరాలతో దవాఖానాలు!
బిడాయించి కిటికీ దర్వాజాలు
వేడినీటితో గుటకలు!.
మంచుకొండల్లో వీరజవానులు
దేశభక్తి కర్తవ్య దీక్షలో
అడుగడుగునా ఎదుర్కొనే సవాళ్లు!
వారిని స్మరిద్దాం
చలిపులిని ఎదుర్కొందాం
చలిచీమలలా ఐక్యతతో
సాగిపోదాం!.

**-ఎ. రాజ్యశ్రీ**

### చలిపులి

చలితో వణుకు
పులి ఎదురైనా ఎదలో వణుకే
అందుకేనేమో చలిపులి!
చలికాలంలో చలి ఎక్కువ
వంటిని వణికిస్తోంది
పంటికి పనిచెపుతుంది.
మంటలు రాజేయడం
చేతులు కాపుకోవడం నిత్యకృత్యాలు
సంక్రాంతికి చంకలెత్తనివ్వదు
శివరాత్రికి శివశివ అంటుంది
ఉగాదికి ఉడ్చుకొని పోతుంది
స్వెట్టర్లు మఫ్లర్ చేతి గ్లౌజులకు
భలే గిరాకీ
ఎక్కడ చూసినా దుకాణాల దర్శనం
బ్లాంకెట్లకు డిమాండ్లు
మూలన పద్దవి కూడా
ముచ్చటగా బైటికి
అస్తమా రోగులకు గడ్డుకాలం
వేడి పదార్థాలకే డిమాండు
మంచు కొండలలో పరిస్థితి
వర్ణణాతీతం
ధ్రువ ప్రాంతాలలో పరిస్థితి
మరీ అధ్వాన్నం
సూర్యాస్తమయం నుండి
మరుసటి సూర్యోదయం వరకు
ఇంట్లోకి గాలి రాకుండా
తీసుకునే జాగ్రత్తలు పసందు
శరీర వేడికి
రకరకాల కసరత్తులు
వేడి నీటికి విలువ
తాగడానికి
స్నానానికి
కాళ్లు చేతులు కడగడానికి
చలి బారిన పడకుండా
అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి
ఆహార నియమాలను సైతం
అనువుగా మార్చుకోవాలి
భోగిమంటలను ఉధృతం చేసి
చలి రాకాసిని పంపించేయాలి.



**-గుండం మోహన్ రెడ్డి**

### చల్లని సెగ

హిమం చేస్తున్న హోమంలో!
చలికి వణికి!
జీవం ప్రకృతి రాగం!
సకల ప్రాణం!
శీతల గీతంలో!
అతలా కుతలం!!
చలి!
రగ్గులో వెచ్చదనం!
విడలేని సుఖం!
చలిలో చెలి చెలిమి!
వదలలేని మోహపు కొలిమి!
నిమ్మ చేరిన
బరువు ఊపిరి తిత్తి!.
ఆడని శ్వాసకు
అల్లాడే ప్రాణిలెన్నో!
చలి చేసే
జలుబు సడికి
మిరియం రసం!
శొంఠి గంధం!
మిత ఆహారం!
ఆరోగ్య సూత్రం!
ఆండాళు తల్లి వ్రతం!
అయ్యప్ప పూజా భక్తి సారం!
అన్నింటా శుభం!!.



**-జె.నరసింహారావు**

### భావగర్భితమైన బాధ

భోగిమంటల్లో
చలికాచుకుందామని కొండంత ఆశ
ఆశగానే మిగిలిపోయింది
ముందే ఆగ్రహించిన ఆకాశం
ఏం తప్పు జరిగిందో
ఎదలోని బాధని
ఎడతెరిపి లేకుండా
కార్చింది కన్నీరు
కరిగిపోయిన యెదలా!
కారణమేదైనా
కరిగిన మనిషికి
తప్పదు ఆటుపోట్ల ప్రభావం
అణిగిపోకా తప్పదు"
"చలి చలి చలి- చలి చమ్మక్క
కుంపటి తేవే గురువక్కా" !
చిన్ననాటి పాట మళ్ళీ తెరపైకి!!!.
కప్పడాలున్న ప్రాణులకు సుఖం
కట్టు గుడ్డలేని వారి గతి పైవానికెరుక
పశుపక్ష్యాదుల బతుకేమీ కడకు
ఏల ఇంత నిర్దయ!
మేమేమి చేశాం!!
జాలితో అర్థించా
దరి చేర్చే హస్తమేది,!!
చూచి సంతోషిస్తే
చినుకంత సమయమేది
ఎందుకో ఈ విపరీతం!.
నిజజీవితంలో
చలికాలమే పండుగ
పండ్లు రక రకాల విందులతో
పక పకా నవ్వు
దేనికైనా పద్ధతి కద్దు
తప్పితే ఇదే సుమీ అంది ఆకాశం!!
చలి వేళ
వేడి వేడి శనక్కాయల రుచి
అమ్మ నేర్పిన
తీపి తీపి గురుతులు మదిలో
దాగున్నదే ప్రకృతి మమతల లోగిలి!!!.

**-కె.కె.తాయారు**

### శీతలంలో భూతలం

శీతాకాలంలో భూమాత
మెరిసి మురిసిపోతుంది
మంచుపూల వానలో తడిసి ముద్దై
మామిడి పూతతో మిసమిసలాడుతూ
శీతాఫలాలను అందించే భూతలం!!.
చలి పులికి
పక్షుల జంటలు వెచ్చగా
మంచు దుప్పటి కప్పుకొని
సరసాలాడి మురిసిపోతే
పుడమితల్లి పులకింత!!.
పారిజాత సుమాలు
పరిమళాలు వెదజల్లుతూ
భూదేవి ఒడిని తాకి
శ్రీకృష్ణుని చేరేందుకు
విప్పారి ఎదురుచూపులు!!.
మంచు పూల సొగసులతో
సూర్యకిరణము సోకగానే
సప్తవర్ణ శోభితమై
పచ్చని ఆకుల మెరుపులు!!.
ముడుచుకొని పడుకుని
రగ్గులన్ని కప్పుకొని
చలిని కాచుకొని జనులంతా
తుషారా హుషారుతో నిద్ర
తెల్లవారి మేలుకొని నోరుతెరిస్తే
మంచు పొగ చూసిన పిల్లలు
సంతసాన పరవశం!!.
శీతాకాలం భూతల స్వర్గం
పగలు తక్కువై రాత్రి ఎక్కువై
ఆధ్యాత్మిక భావనతో
దీపాల కాంతి తళతళలతో
భూతలమంతా మెరుపులు
గగనతలందాకా విహారం
తారలతో సయ్యాటలాడే చందమామ
చల్లని వెన్నెలలు!!
కాలంతో పాటే భూమాత ఒడిలో
హాయిగా ఆడుతూ పాడుతూ
సేదతీరాం
శీతలంలో భూతలం చల్లగా
సకల జీవరాసులూ
చల్లగా!!.

**-డా.చీదెళ్ళ సీతాలక్ష్మి**

### రాక్షసి

చలి రాక్షసి దినదినమున
చెలరేగుతు బాధ పెట్టి జగమున్ చూడన్
చెలి కౌగిలి కంబళ్లను
చలిమంటల చరణమాయ జనముకు చూడన్.

**- రావినూతల జగదీశ్వరి**

### శీతాకాలం

పల్లవి: శీతాకాలం చల్లనికాలం
ఊహల్లోన నందనవనం
వెచ్చని నీ మదిలో
నిలిచిపోయే మత్తుగా
జీవనరాగం సయ్యాటలో
నీ మనసే ఊయల ఊపే
చరణం1: స్వరం స్వరం కలిశాయి
కలలో పంటలు పండాయి
కదిలే మనసంతా నీవేగా
ఆనంద సుమాలై నిలిచే
నవనవ వేదమా
ఈ అల్లిన కలయిక
మనసులో నిలిచీ
కలకాలం మవ్వాలి
చరణం2: మువ్వలా నువ్వు
ఆ నవ్వు చిరుగాలై
పెదవిలో వికసించి
చూపుతో కట్టేసి
సోయగమై నిలపాలి
మనసంతా మురిపించి
నీ హృదిలో నిలవాలి.



**-వి. సంధ్యారాణి**

### చక్కిలిగిలి

చలి.. చలి
వెచ్చని చలి
గిలి గిలి
చక్కిలిగిలి
చలి వేస్తుంది
చంపేస్తుంది
వణికి పోవాలా!
రగ్గు కప్పేసుకుంటే పోలా!
సినిమా వాళ్ళు
చలి పాటలతో తెగ వణికించేస్తారు
మనం అంత వణికి పోవక్కర్లా
శీతాకాలం శీత వాయువులు
పడిపోయిన తాపమాన కొలతలు
కురిసే మంచు వానలు
మురిసే తరువులు
మురిపించే సుమాలు
బద్ధకించె సుదతులు
అదీ ఒక్క క్షణమే.
చలి పులి
పంజా విసిరితే
రాత్రి పగలు తేడాలేదు
చలి ఒక్కటే
ఉత్తరాది రాష్ట్రాలకు
మరింత వణుకు
చలి పులి
కర్ఫ్యూ విధించి నట్టు
బయటకిరాని జనం
పొగ మంచు స్వైరవిహారం
వాహన ప్రమాదాలకు అవకాశం
చలి మంటలతో ఉపశమనం
రెక్కడితేగాని డొక్కాడదు
చలి చలి హాయ్ హాయ్
అనుకుంటూ
పని లోకి దిగక తప్పదు.

**-మోటూరి శాంతకుమారి**

## సీనియర్ కవి, నవలా రచయిత రేగులపాటి కిషన్ రావు ఇకలేరు...

స్వగృహంలో మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంగా ఉన్న ఆయన గురువారం నాడు తుది శ్వాస విడిచారు. సంఘసంస్కరణే ధ్యేయంగా అభ్యుదయ భావాలకు చోటు కల్పిస్తూ ఆయన ఆరు కథా సంపుటాలు, నాలుగు నవలలు, పదమూడు కవితా సంపుటాలను వెలువరించారు. 1976లో "ఆమె వితంతువు కాదు", 1978లో పతివ్రత ఎవరు", 1981 లో "సంఘర్షణ", 1982లో "ప్రేమకు పెళ్లెప్పుడు" నవలలు రాసి పాఠక లోకంలో నవలా రచయితగా సుస్థిర స్థానాన్ని పదిల పరుచుకున్నారు.

2008 -16 మధ్య కాలంలో విరివిగా కథా సంపుటాలు వెలువరించారు. 2008లో "కథక చక్రవర్తి", 2012లో "సంస్కారం కథలు", 2013 "ఈతరం పెళ్లికూతురు", 2014లో "అన్వేషణ", "పరిమళించిన మానవత్వం", 2016లో "నవచైతన్యం" పేర్లతో కథా సంపుటాలను వెలువరించారు. శ్రీ కిషన్ రావు గారు 1982లో "ప్రగతి పాటలు", 1984లో "కవితా పుష్పాలు ",1985లో "కొత్త పాటలు", 1986లో "మల్లె మొగ్గలు", 1989లో "రవిబింబం", 1996లో "పాడవే కోయిల", 1997లో "సజీవ సత్యాలు", 1999లో "కాంతిపుంజం", 2001లో "గెలుపొందిన పావురం", "ప్రగతి రథం" 2010లో "అక్షర సౌజన్యం" వంటి పేర్లతో కవితా సంపుటాలను వెలువరించారు.

ఆయన 1989లో "వ్యాస సంపుటిని", 2002లో "సాహితీ సౌరభం" పేరుతో సమీక్షా వ్యాసాలు రాశారు. 1986 -89 లో " యాత్ర సాగనీ" పేరుతో న్యూఢిల్లీ యాత్రను రాసారు.ఇది కథాంజలిలో సీరియల్ గా వెలువడింది.

1985లో తెలుగు సాహితీ సమాఖ్య కాకినాడ వారి ద్వారా ఉత్తమ కవితా బహుమతిని పొందారు. 1995లో సిరిసిల్ల సంస్థ వారిచే సినారె సాహితీ పురస్కారాన్ని అందుకున్నారు. 2005లో మచిలీపట్నం భావ తరంగిణి మాసపత్రికే వారిచే ఉత్తమ కవితా అవార్డును పొందారు. 2009లో నవ్య సాహిత్య పరిషత్ కరీంనగర్ వారిచే మలయశ్రీ ప్రగతి శీల సాహితీ అవార్డును స్వీకరించారు. 2012లో ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా ప్రభుత్వ పురస్కారాన్ని, 2017 లో సిరిసిల్లలో రంగినేని సుజాత మోహన్ రావు ట్రస్ట్ ద్వారా బాల సాహితీ మూర్తుల ఆత్మీయ సత్కారాన్ని అందుకున్నారు.

2013లో కరీంనగర్ ఈగల్ ట్రస్ట్ ద్వారా ఉగాది పురస్కారాన్ని, 2013లో నారదాసు లక్ష్మణరావు ఉగాది పురస్కారాన్ని కిషన్ రావు గారు సొంతం చేసుకున్నారు.

1946లో ఆయన ఇప్పటి రాజన్న సిరిసిల్ల జిల్లాలోని చింతల టానాలో డిసెంబర్ 1 జన్మించారు.1970 నుండి 2004 వరకు వృత్తిరీత్యా ఉపాధ్యాయునిగా సేవలు అందించారు. తర్వాత కరీంనగర్ లో స్థిర నివాసం ఏర్పరచుకొని విశ్రాంత జీవితాన్ని సాహితీ రంగాన్ని సుసంపన్నం చేయడానికి వినియోగించారు.

కిషన్ రావు గారి స్ఫూర్తి, ప్రేరణతో ఆయన సతీమణి రేగులపాటి విజయలక్ష్మి గారు కూడా కవిత్వం , కథా గ్రంథాలను వెలువరించడం విశేషం.

రేగులపాటి కిషన్ రావు గారికి భార్య,కూతురు (కవిత), అల్లుడు (ఆనంద రావు) ఉన్నారు.

కిషన్ రావు గారి మృతి పట్ల సాహితీవేత్తలు డాక్టర్ నలిమెల భాస్కర్, దాస్యం సేనాధిపతి, అన్నవరం దేవేందర్,డాక్టర్ గండ్ర లక్ష్మణరావు, గాజుల రవీందర్, నంది శ్రీనివాస్, డాక్టర్ వైరాగ్యం ప్రభాకర్, మాడిశెట్టి గోపాల్, శ్రీ దాస్యం లక్ష్మయ్య, కె. ఎస్.అనంతాచార్య, కందుకూరు అంజయ్య, సి.వి. కుమార్, కూకట్ల తిరుపతి, బూర్ల వెంకటేశ్వర్లు, గాజోజు నాగభూషణం, డాక్టర్ బి. మధుసూదన్ రెడ్డి, అనుముల దయాకర్, డాక్టర్ అడువాల సుజాత, కొత్త అనిల్ కుమార్ నీలగిరి అనిత, బుర్ర విజయలక్ష్మీనాగరాజ్,స్వప్న కృష్ణ, వెగ్గలం ఉషశ్రీ, కె .బి . శర్మ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

**-బుర్రవిజయ లక్ష్మీనాగరాజ్**, 9966559567

## కెప్టెన్ డా: బుర్ర మధుసూదన్ రెడ్డికి స్ఫూర్తి పురస్కారం

ప్రముఖ కవి, పాఠ్య పుస్తక రచయిత, కాలమిస్టు, సంఘ సేవకులు, విశ్రాంత ప్రధానాచార్యులు లయన్: కెప్టెన్: డా: బుర్ర మధుసూదన్ రెడ్డి విస్తృత సేవలను గుర్తించి జిల్లా కలెక్టర్ ఆర్ వి కర్ణన్ చేతుల మీదుగా స్ఫూర్తి పురస్కారం అందుకున్నారు. కొండూరి జగన్మోహన్ రావు వ్యవస్థాపక అధ్యక్షుల నేతృత్వంలో కరీంనగర్‌లో స్ఫూర్తి స్వచ్ఛంధ సేవా సంస్థ నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఈ పురస్కారాలను జిల్లా కలెక్టర్ ప్రదానం చేశారు. రసాయనశాస్త్ర ఆచార్యులు, యస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల ప్రధానాచార్యులు, యస్‌సిసి కంపెనీ కమాండర్, కవి, రచయిత, కాలమిస్టు, లయన్స్ సంస్థ సీనియర్ సంఘసేవకులు, జిల్లా లీడ్ ఇండియా/సైక్లింగ్ అలోసియేషన్/తెలంగాణ తెలుగు భాషా సంరక్షణ సంఘం అధ్యక్షులు గత నాలుగు దశాబ్దాలుగా చేసిన బహుముఖీన కృషికి గుర్తింపుగా స్ఫూర్తి పురస్కారానికి ఎంపిక చేసి ఘనమైన సమావేశంలో అందజేశారు. ఈ సమావేశంలో కరీంనగర్ డైరీ అధ్యక్షులు చలిమెడ రాజేశ్వరరావుకు జీవన సాఫల్య పురస్కారం, ఉపాధ్యాయులు నంది శ్రీనివాస్, కళాకారుడు తిరునగరిలకు స్ఫూర్తి పురస్కారాలను అందజేశారు. జిల్లా కలెక్టర్ కర్ణన్ మాట్లాడుతూ సాహిత్య కళలకు కానాచిగా నిలిచిన కరీంనగరం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతూ ఇతర జిల్లాలకా ఆదర్శంగా నిలుస్తున్నదని సంతోషం వ్యక్తం చేశారు. రసాయనశాస్త్ర ఆచార్యులుగానే కాకుండా సాహితీవేత్తగా, కాలమిస్టుగా, సామాజిక సేవల్లో కార్యకర్తగా, వ్యక్తిత్వ వికాస నిపుణులుగా పలు రంగాల్లో అపూర్వ సేవలను అందిస్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. పురస్కార గ్రహీత మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి గుర్తింపులు బాధ్యతలను మరింత పెంచుతాయని, పరహిత భావనలను పెంచి పోషించాలని కోరారు. ఈ కర్యక్రమంలో నగర ప్రముఖ పౌరులు పాల్గొని పురస్కార గ్రహీతలను అభినందించారు.

Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jaw ahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.